ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

site.singidinews.com

శనివారం 21 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 155 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

తాజ్‌మహల్ చూసేందుకూ
నో చెప్పిన సర్కారు

నిజాముద్దీన్ దర్గా సందర్శనకు అనుమతి నిరాకరణ
ఎస్‌సీవో సదస్సుకే అనుమతులు పరిమితం
2023 తర్వాత భారత్‌కు వచ్చిన తొలి పాక్ మంత్రి
ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇదే మొదటి పర్యటన

2





రాజీపడిన ప్రధాని

2

ఎప్పటికీ అక్కడ కూర్చోలేరు..
కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు
2004-14 మధ్య యూపీఏ ప్రభుత్వం కంటే రాజీపడిన ప్రభుత్వం భారత్‌లో ఎప్పుడైనా ఉందా? బీజేపీ ఆరోపణలు

హైదరాబాద్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇస్తాం.. గ్లోబల్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



హైదరాబాద్ ను ఏఐ, పరిశోధన, సాంకేతిక ఆధారిత వ్యాపారాలకు అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఐక్యరాజ్యసమితి వేదికగా 1M1B సంస్థ నిర్వహించిన గ్లోబల్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఇప్పటికే ఐటీ, లైఫ్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్స్ రంగాల్లో అంతర్జాతీయ గుర్తింపు సాధించిందని చెప్పారు.

2

హైదరాబాద్, నవంబర్ 20 (సింగిడి)

రేవంత్ సీఎం అయ్యాకే బీజేపీ 8 ఎంపీలు గెలిచింది

తెలంగాణలో అసలైన ఆట మొదలైంది: కిషన్ రెడ్డి
ఇటీవల రెండు ఎమ్మెల్సీల్లోనూ బీజేపీ విజయం సాధించిందని వెల్లడి
రాబోయే రెండు ఎమ్మెల్సీలపైనా కేంద్ర మంత్రి ధీమా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. తెలంగాణ రాజకీయాల్లో ఇకపై భారతీయ జనతా పార్టీ అసలైన ఆట ప్రారంభమవుతుందని సంచలన ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం నిశ్చయమైన రాజకీయ మార్పును బలంగా ఆకాంక్షిస్తున్నారని, ఆ మార్పును నిజం చేసే సత్తా ఒక్క బీజేపీకి మాత్రమే ఉందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన విమర్శలను తిప్పికొడుతూ ఎన్నికల గణాంకాలను కిషన్ రెడ్డి ప్రస్తావించారు.

2

హైదరాబాద్, నవంబర్ 20 (సింగిడి)



కేసీఆరే తెలంగాణ బాద్‌షా
మళ్లీ వచ్చేది ఆయనే

2

రేవంత్ రెడ్డి వన్ టైమ్ వండర్ లీడర్
2028, డిసెంబర్‌తో రాజకీయ ఏటీఎం గడువు ముగుస్తుంది.. బీఆర్ఎస్ గెలుస్తుంది
ఢిల్లీకి సంచులు మోసుట్ల, చక్కర్లు కొట్టుట్ల రేవంత్‌కు పదికి పది మార్కులేస్తా
ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో కేటీఆర్ వ్యాఖ్యలు



తెలంగాణ బాద్‌షా కేసీఆరేనని.. 2028లో మళ్ల అధికారంలోకి వచ్చేది ఆయనేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేవంత్‌రెడ్డి వన్‌టైమ్ వండర్ లీడర్ అని విమర్శించారు. 2028, డిసెంబర్‌తో రాజకీయ ఏటీఎం గడువు ముగుస్తుందని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి సంచులు మోయడంలో, ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టడంలో సీఎం రేవంత్ రెడ్డికి పదికి పది మార్కులు ఇస్తానన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఎలాంటి మార్కులు ఇవ్వలేమని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్ లో జరిగిన ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొన్న కేటీఆర్.. తెలంగాణ రాజకీయాలు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, పెట్టుబడులు, ఉద్యోగాలు, అవినీతి తదితర అంశాలపై విమర్శనాత్మకంగా మాట్లాడారు.

హైదరాబాద్, నవంబర్ 20 (సింగిడి)

2047 నాటికి గ్లోబల్ ఎకనామిక్ పవర్‌గా తెలంగాణ

తెలంగాణ టార్గెట్.. దేశ జీడీపీలో 10 శాతం

వచ్చే రెండేళ్లలో మిగిలిన హామీలన్నీ అమలు చేస్తాం
కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థి.. కేటీఆర్‌ను సీరియస్‌గా తీసుకోను
మోదీ హయాంలో రూ.120 లక్షల కోట్ల అప్పులు.. అదానీకి అండగా కేంద్రం
అమిత్ షాకు దమ్ముంటే హైదరాబాద్ నుంచి పోటీ చేయాలి
విద్య, ఉపాధి, పెట్టుబడులపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

> తెలంగాణను దేశంలోనే కీలక ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీని రూపొందించినట్లు వెల్లడించారు. ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా అభివృద్ధి చేయడంతోపాటు యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించామని తెలిపారు. తమ ప్రభుత్వం మూడేళ్లలో 65 శాతం కార్యక్రమాలను అమలు చేసిందని, వచ్చే రెండేళ్లలో మిగిలిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని ప్రకటించారు. అభివృద్ధి లక్ష్యాలతోపాటు జాతీయ రాజకీయాలు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, బీఆర్ఎస్ నాయకత్వం, విద్య, ఉపాధి, నియోజకవర్గాల పునర్విభజన తదితర అంశాలపై సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు.

ఓటు హక్కుపై వేట.. మోదీ పాలనపై నిప్పులు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న పేదల ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలను ప్రజలు అడ్డుకోవాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పేదల ఓటు హక్కును తొలగించే ప్రయత్నం జరిగినప్పుడు ప్రపంచంలో ఎవరైనా స్పందించవచ్చని పేర్కొన్నారు. చెగువేరా ప్రపంచంలో ఎక్కడ అవసరమైతే అక్కడికి వెళ్లి పోరాటం చేశారని గుర్తుచేశారు.

హైదరాబాద్, నవంబర్ 20 (సింగిడి)



ఎట్ల కరువు తెచ్చినవో
అసెంబ్లీలో బట్టబయలు చేస్తా

తొట్టిగ్యాంగులతో టైమ్ వేస్ట్ చేయకు.. సిద్దిపేటకు రా.. నువ్వో నేనే తేల్చుకుందాం
ముష్టి, కుష్టు, నికృష్ట ప్రయత్నమే సిద్దిపేట సభ.. సీఎం రేవంత్‌పై
మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

2



తుపానుల ధాటికి భారీ నష్టం

పునరుద్ధరణకు రూ.96 కోట్ల సాయం కోరిన సీఎం చంద్రబాబు
అర్నబ్ మురసు తుఫాన్ల ప్రభావంతో ఉద్యాన పంటలకు రూ.1,092 కోట్ల నష్టం
కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం చంద్రబాబు లేఖ
దెబ్బతిన్న తోటల పునరుద్ధరణకు రూ.96.33 కోట్ల అదనపు సాయం కోరిన ఏపీ సర్కార్
రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లాల్లో నష్టపోయిన 71,576 మంది రైతులు
అరటి మిర్చి కొబ్బరి పంటల పునరుద్ధరణకు కేంద్ర పథకాల నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి





ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుఫాన్ల ధాటికి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యాన పంటలకు ఏకంగా రూ.1,092 కోట్ల మేర భారీ నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తీవ్రంగా నష్టపోయిన ఉద్యాన పంటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర పథకాల కింద అదనంగా రూ.96.33 కోట్ల ఆర్థిక సాయం అందించాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు. ఈ ఏడాది అక్టోబర్ 28, నవంబర్ 2 తేదీల్లో వరుసగా విరుచుకుపడిన రెండు తుఫాన్ల వల్ల రాష్ట్రంలోని 18 జిల్లాల్లో తీవ్ర విధ్వంసం జరిగిందని చంద్రబాబు వివరించారు. మొత్తం 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 71,576 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు.

2

అమరావతి, నవంబర్ 20 (సింగిడి)

పవన్ కల్యాణ్ 'ఎంపవర్ స్టార్'

డిప్యూటీ సీఎం విజన్‌పై ఉపాసన కొణిదెల ప్రశంసలు

2

పిఠాపురంలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఉపాసన కొణిదెల, స్మృతి ఇరానీ
మహిళలు, విద్యార్థినుల సాధికారతకు పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్న ఉపాసన
అపోలో ఫౌండేషన్ 109 మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని నిర్ణయం

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ప్రముఖ వ్యాపారవేత్త, అపోలో హాస్పిటల్స్ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల పర్యటించారు. కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీతో కలిసి ఆమె పిఠాపురం పరిధిలోని అగ్రహారంలో నూతనంగా నిర్మించిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అపోలో ఫౌండేషన్ చేపట్టిన 'అపోలో ఆరంభ్' ప్రాజెక్టులో భాగంగా కొణిదెల కుటుంబ సహకారంతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విజన్‌ను ఉపాసన కొణిదెల ప్రత్యేకంగా అభినందించారు.

అమరావతి (సింగిడి)



జడ్పీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

28 స్థానాల్లో ఏకంగా 27 కైవసం!.. టీడీపీకి 22 జడ్పీ ఛైర్మన్ స్థానాలు
జనసేనకు 4, బీజేపీకి ఒక స్థానం.. వైసీపీకి దక్కిన ఏకైక అల్లూరి జిల్లా
ఛైర్మన్, వైస్ ఛైర్మన్ వివరాలు ఈసీ ప్రకటన

2



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరంలో అధికార కూటమి విజయదుందుభి మోగించింది. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ప్రజా పరిషత్‌ల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు జరిగిన పరోక్ష ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 28 జడ్పీ పీఠాల్లో ఒక్క అల్లూరి జిల్లా మినహా మిగిలిన 27 జిల్లాలను కూటమి తన ఖాతాలో వేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంది.

అమరావతి, నవంబర్ 20 (సింగిడి)

ఏపీలో రేర్ ఎర్త్ కార్పొరేషన్
ఏర్పాటుకు ఆమోదం

ఖనిజ సంపదపై చంద్రబాబు కీలక సమీక్ష
వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఏపీఎండీసీ ఐపీవోకు సన్నాహాలు
ఎన్ఎండీసీ తరహాలో ఏపీఎండీసీని తీర్చిదిద్దాలని సీఎం ఆదేశం
ఒడిశా, ఝార్ఖండ్ బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొననున్న ఏపీఎండీసీ
పెండింగ్ క్వారీ లీజుల పరిష్కారంతో రూ.400 కోట్ల ఆదాయం అంచనా

2

ఏపీలో ఖనిజ సంపద సద్వినియోగం, ఆదాయార్జనపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో అరుదైన ఖనిజాల అన్వేషణ, విలువ జోడింపు కోసం ప్రత్యేకంగా 'ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' (ఏపీ ఆర్ఈడీసీ) ఏర్పాటుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు.

అమరావతి, నవంబర్ 20 (సింగిడి)



ఓబీసీ కులగణనకు బీఆర్ఎస్
సంపూర్ణ మద్దతు: కేటీఆర్

2

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లకు కులగణన తప్పనిసరి.. బీసీల విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యానికి కేసీఆర్ పాలనలో పెద్దపీట
కేటీఆర్‌ను కలిసిన ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు



ఏపీలో రేర్ ఎర్త్ కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం

అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)ను వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేందుకు ఉద్దేశించిన ఐపీవో ప్రతిపాదనలకు కూడా అంగీకారం తెలిపారు. శుక్రవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో గనుల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్‌ఎండీసీ తరహాలో ఏపీఎండీసీని అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇందుకోసం అవసరమైతే ప్రైవేట్ ఏజెన్సీల సహాయం కూడా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏపీఎండీసీ ఈక్విటీ విలువ ఆధారంగా ఐపీవోకు వెళ్లేలా కార్యాచరణ సిద్ధం చేయాలని నిర్దేశించారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులను కేవలం ఆదాయ వనరుగా కాకుండా భవిష్యత్ తరాలకు ఆస్తిగా చూడాలని, వాటి విలువ పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. మన వనరులను మన రాష్ట్రంలోనే వినియోగంలోకి తెచ్చేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేసేందుకు ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లోని మూడు బొగ్గు బ్లాకుల వేలంలో ఏపీఎండీసీ పాల్గొంటున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ మూడు బ్లాకుల్లో కలిపి సుమారు 1,774.6 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు. మరోవైపు, రాష్ట్రంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 6,500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెవెన్యూ వల్లను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని సమావేశంలో చర్చించారు. వచ్చే ఐదేళ్లలో ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం స్పష్టం చేశారు.

పవన్ కల్యాణ్ 'ఎంపవర్ స్టార్'

ప్రజల్లో పవన్ కల్యాణ్ 'పవర్ స్టార్'గా సుపరిచితులైనప్పటికీ, పిఠాపురంలో ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు, సాధికారత కార్యక్రమాలను చూసిన తర్వాత తనకు ఆయన 'ఎంపవర్ స్టార్'గా కనిపిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి, రుణాల కల్పనపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఏర్పాటుతో విద్యార్థుల సాధికారతకు కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం, ప్రాథమిక విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అపోలో ఫౌండేషన్ 109 మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా మొదటి కేంద్రాన్ని పిఠాపురంలో ప్రారంభించారు. అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ కేంద్రం స్థానిక తల్లులు, చిన్నారులకు ఎంతో ప్రయోజనకరంగా మారనుందని నిర్వాహకులు వెల్లడించారు.

రాజీపడిన ప్రధాని

న్యూఢిల్లీ, నవంబర్ 20 (సింగిడి)

అమెరికా, చైనా, రష్యా అగ్రనేతల సమావేశంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన సోషల్ మీడియా పోస్ట్ దేశ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. చైనాలోని షెన్‌జెన్ వేదికగా ట్రంప్, పుతిన్, షీ జిన్‌పింగ్‌ల అత్యంత కీలకమైన త్రైపాక్షిక శిఖరాగ్ర సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఫొటోను రాహుల్ తన ఎక్స్‌లో షేర్ చేస్తూ.. కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అధికారంలో ఉండి ఉంటే.. ఈ టేబుల్ వద్ద భారత ప్రధాన మంత్రి కూర్చొని ఉండేవారని పేర్కొన్నారు. రాజీపడిన ప్రధాని ఎప్పటికీ ఆ టేబుల్ వద్ద కూర్చోలేరంటూ ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

బీజేపీ ఆరోపణలు

రాహుల్ చేసిన ఈ పోస్టు పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. అధికార బీజేపీ , ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. గత కాంగ్రెస్ ప్రభుత్వాలపై బీజేపీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే దేశ ప్రయోజనాల విషయంలో రాజీ పడ్డారని బీజేపీ ప్రతినిధి తుహిన్ సిన్హా ఆరోపించారు. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు జరిగిన సిమ్లా ఒప్పందం సమయంలో పాకిస్తాన్ యుద్ధ ఖైదీలను విడుదల చేశారని గుర్తు చేశారు. ఆ తర్వాతే పాకిస్తాన్ భారత్‌లోకి ఉగ్రవాదాన్ని ఎగదోయడం ప్రారంభించిందని విమర్శించారు.
ఇక మన్మోహన్ సింగ్ ప్రభుత్వ సమయంలో పాకిస్తాన్‌తో కలిసి విడుదల చేసిన షర్మ్-ఎల్-షేక్ సంయుక్త ప్రకటనను కూడా ప్రస్తావించారు. 2008 ఆగస్టు 7న బీజింగ్‌లో కాంగ్రెస్, చైనా కమ్యూనిస్ట్ పార్టీ మధ్య రహస్య అవగాహన ఒప్పందం జరిగిందని చెప్పారు. ఆ తర్వాతే భారత్ సరిహద్దుల్లో చైనా చొరబాట్లు పెరిగాయని ఆరోపించారు. 2004-14 మధ్య యూపీఏ ప్రభుత్వం కంటే ఎక్కువగా రాజీపడిన ప్రభుత్వం భారత్‌లో ఎప్పుడైనా ఉందా..? అని ప్రశ్నించారు. భారత్‌ను కించపరచడానికే రాహుల్ గాంధీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని.. నేడు ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్‌కు ప్రపంచ దేశాలన్నింటితో బలమైన సంబంధాలు ఉన్నాయని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రస్తుతం ఏఐ, అధునాతన తయారీ సహా నూతన సాంకేతిక రంగాల్లోనూ వేగంగా విస్తరిస్తోందన్నారు. ప్రతిభావంతులైన యువత, పరిశ్రమలకు అనుకూలమైన విధానాలు, బలమైన పారిశ్రామిక పునాదులు రాష్ట్రానికి ప్రధాన బలమన్నారు. సాంకేతిక అభివృద్ధి కేవలం ఆర్థిక వృద్ధికే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ, డిజిటల్ ఆవిష్కరణలను వైద్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి వంటి రంగాల్లో వినియోగించడం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారాలు అందుబాటులోకి వస్తాయన్నారు. సాంకేతిక ప్రగతి, ఆవిష్కరణలు, మానవాభివృద్ధి సమాంతరంగా సాగినప్పుడే సమాజానికి నిజమైన ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, అంతర్జాతీయ సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే బలమైన ఆవిష్కరణల వ్యవస్థ ఏర్పడుతుందన్నారు. ఆ దిశగా తమ ప్రభుత్వం ఇన్నోవేషన్ ఆధారిత ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తోందన్నారు. యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించడంతో పాటు, వారి ఆలోచనలను ప్రపంచస్థాయి ఆవిష్కరణలుగా మలిచేందుకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి.. రైజింగ్ తెలంగాణ లక్ష్యసాధనలో భాగస్వామ్యం కావాలని పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలను శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. అంతకు ముందు తెలంగాణలో ఐటీ, లైఫ్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్స్, ఏఐ, అధునాతన తయారీ రంగాల్లో ఉన్న అవకాశాలను అంతర్జాతీయ ప్రతినిధులకు ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వివరించారు.

తుపానుల ధాటికి భారీ నష్టం

ముఖ్యంగా అర్నబ్ తుఫాను ప్రభావంతో 215 మండలాల్లోని 23,211 హెక్టార్లలో తోటలు నాశనమయ్యాయని, ఇందులో ఒక్క అరటి పంటే 15,549 హెక్టార్లలో నేలమట్టమైందని తెలిపారు. అలాగే మురసు తుఫాను ప్రభావంతో 108 మండలాల్లోని 6,748 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని వెల్లడించారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర పథకాల ద్వారా తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రి కోరారు. తీవ్రంగా నష్టపోయిన అరటి తోటల పునరుద్ధరణ కోసం 'మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్' స్కీమ్ కింద హెక్టారుకు రూ.44 వేల చొప్పున నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన' కింద ఎండుమిర్చి, కూరగాయల పంటల రైతులకు అండగా నిలవాలని కోరారు. కోనసీమ, కాకినాడ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల జిల్లాల్లో మొవ్వ విరిగిన కొబ్బరి చెట్లకు 'కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు' ద్వారా ఆర్థిక సహకారం అందించాలని లేఖలో విన్నవించారు. రైతులకు దీర్ఘకాలిక నష్టాలను తగ్గించేందుకు ఈ సాయాన్ని త్వరితగతిన విడుదల చేయాలని చంద్రబాబు కోరారు.

2047 నాటికి గ్లోబల్ ఎకనామిక్ పవర్‌గా తెలంగాణ



రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓట్ చోర్.. గద్దీ చోర్' నినాదానికి దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందన్నారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ అభివృద్ధి అంటే ప్రతి పేదవాడి అభివృద్ధిగా భావించారని, కానీ మోదీ పాలనలో జాతి, మతం, భాష పేరుతో విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. మోదీ 12 ఏళ్లలో సృష్టించిన భయాన్ని యువత 12 రోజుల్లో తొలగించిందని వ్యాఖ్యానించారు. మోదీ విదేశీ పర్యటనలపై వ్యంగ్యంగా స్పందిస్తూ.. ఆయన 'విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ ఇండియా'గా మారారని అన్నారు. బీజేపీ ఎప్పుడూ అబద్దాలే మాట్లాడుతుందని, ఆ పార్టీకి ప్రజాసేవ కంటే అధికారం ముఖ్యమని విమర్శించారు. స్వాతంత్ర్యం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, ప్రజలు ఉన్నంతకాలం కాంగ్రెస్ ఉంటుందని, మరో వెయ్యి సంవత్సరాలు కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల తరఫున కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.

మోదీని కలిస్తే తప్పేంటి?.. కేసీఆర్‌నైనా కలుస్తా

ప్రభుత్వ ప్రయోజనాల కోసం ఎవరినైనా కలుస్తానని, అవసరమైతే కేసీఆర్‌ను కూడా కలుస్తానని సీఎం స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ఎవరికీ చెప్పకుండా పాకిస్తాన్‌కు వెళ్లి బిర్యానీ తిని వచ్చారని, అలాంటప్పుడు తాను మోదీని కలిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. ఖేలో ఇండియా కార్యక్రమానికి 8 వేల మంది క్రీడాకారులు హాజరవుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీని ఆహ్వానించామని తెలిపారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలా వద్దా అన్నది ఆయన ఇష్టమని, తాను తన మర్యాదను చూపించానని పేర్కొన్నారు. తాను ఏబీవీపీ నుంచే రాజకీయ ప్రస్థానం ప్రారంభించానని, ఆ విషయాన్ని దాచాల్సిన అవసరం లేదని రేవంత్ రెడ్డి అన్నారు. దేశానికి రాహుల్ గాంధీ అవసరమని భావించి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చానని వివరించారు. రాహుల్ గాంధీ తన నాయకుడని, కాంగ్రెస్ పార్టీకి కూడా ఆయనే నాయకుడని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీకి రాజకీయంగా పెద్దగా పాత్ర లేదని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్ కూడా దక్కలేదని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గంలోనే బీజేపీకి ఈ పరిస్థితి ఎదురైందని పేర్కొన్నారు. యాత్రల కోసం నాయకులు వస్తుంటారని, వెళ్లిపోతుంటారని, వారికి ఇవ్వాల్సిన మర్యాద ఇస్తామని అన్నారు. అమిత్ షాకు ధైర్యం ఉంటే హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి అసదుద్దీన్ ఒవైసీని ఓడించాలని సవాల్ విసిరారు.

నా కథలో కేసీఆర్ రావణాసురుడు

బీఆర్ఎస్ నాయకత్వంపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌ను రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తానని, కేటీఆర్‌ను మాత్రం సీరియస్‌గా తీసుకోనని స్పష్టం చేశారు. మేనేజ్‌మెంట్ కోటాలో తండ్రిని అడ్డం పెట్టుకుని కేటీఆర్ నాయకుడయ్యారని విమర్శించారు. కేటీఆర్ పేరు ఎత్తడం కూడా తనకు ఇష్టం లేదని వ్యాఖ్యానించారు. తనది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల టీమ్ అని, ప్రజల కోసమే పోరాడుతానని చెప్పారు. 17 ఏళ్లకే తెలంగాణ సీఎం అయ్యానని, స్వయంకృషితో ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఏ టీమ్‌కు చెందిన వ్యక్తో తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఫూల్స్ పారడైజ్‌లో ఉన్నారని, ఇటీవలే సిద్ధిపేటకు వెళ్లి కాంగ్రెస్ జెండా ఎగురవేసి వచ్చామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌ను అంత సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. తన కథలో కేసీఆర్ రావణాసురుడని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షం ఉండాలనే ఆ పార్టీ కొనసాగుతోందని, లేకుంటే ఎప్పుడో ఖాళీ చేసేవాళ్లమని అన్నారు. పార్టీ ఫిరాయింపులకు శ్రీకారం చుట్టింది కేసీఆరేనని, ఇప్పుడు అదే అంశం ఆయనను చుట్టుకుందని విమర్శించారు.

మోదీ హయాంలో అప్పులు రూ.120 లక్షల కోట్లు

దేశ ఆర్థిక వ్యవస్థపై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రధానుల పాలనలో తీసుకున్న నిర్ణయాలను రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, అనేక విద్యాసంస్థలు, నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు. పీవీ నరసింహారావు ఆర్థిక సరళీకరణ విధానాలను తీసుకువస్తే, మన్మోహన్ సింగ్ వాటిని కొనసాగించారని వివరించారు. మోదీకి ముందు ప్రధానుల హయాంలో దేశ అప్పులు రూ.53 లక్షల కోట్లుగా ఉండగా, గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం రూ.120 లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిధులన్నీ అదానీ జేబులో వేస్తోందని విమర్శించారు.

జడ్పీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ప్రకారం, కూటమి భాగస్వామ్య పక్షాల్లో తెలుగుదేశం పార్టీ అత్యధికంగా 22 జడ్పీ చైర్మన్ పదవులను కైవసం చేసుకుంది. జనసేన పార్టీ 4 స్థానాలను, భారతీయ జనతా పార్టీ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్‌కే పరిమితమైంది. అల్లూరి జడ్పీ చైర్‌పర్సన్‌గా వైసీపీ అభ్యర్థి వంతల శాంతి ఎన్నికయ్యారు. జిల్లాల వారీగా చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపిక ప్రక్రియ విజయవంతంగా ముగియడంతో పాటు, ఎన్నికైన వారి పేర్లు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల అధికారిక జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన జిల్లా పరిషత్ పాలకవర్గాల ఎన్నికల ఘట్టం అధికారికంగా పూర్తయింది.



కేసీఆరే తెలంగాణ బాద్‌షా

రాహుల్ ఏటీఎం కార్డులు వీళ్లే

రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనల సంఖ్యను బట్టి పది కి పది మార్కులు ఇవ్వొచ్చని, ఢిల్లీకి ఎన్ని సంచులు మోసుకెళ్లారనే విషయంలోనూ పూర్తి మార్కులు ఇవ్వాల్సిందేనని కేటీఆర్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 2015లో ఎమ్మెల్యేకు లంచం ఇవ్వడానికి ప్రయత్నించిన కేసులో ఫోరెన్సిక్, డాక్యుమెంటరీ ఆధారాలు ఉన్నాయని, ఆ కేసు ఇంకా సుప్రీంకోర్టు పరిధిలో ఉందని ప్రస్తావించారు. అప్పట్లో ఎమ్మెల్యేకు సంచులు తీసుకెళ్లే స్థాయి నుంచి ఇప్పుడు ఢిల్లీ వరకు సంచులు తీసుకెళ్లే స్థాయికి ఎదిగారని విమర్శించారు. రాహుల్ గాంధీకి రెండు ఏటీఎం కార్డులు ఉన్నాయని, ఒకటి రేవంత్ రెడ్డి, మరొకటి డీకే శివకుమార్ అని వ్యాఖ్యానించారు. ఈ రెండు ఏటీఎం కార్డుల గడువు 2028లో ముగుస్తుందని అన్నారు.

1.85 శాతం ఓట్ల తేడానే

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చిందని కేటీఆర్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు దాటినా వాటి గురించి సమాధానం చెప్పడం లేదన్నారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ కేవలం 1.85 శాతం ఓట్ల తేడాతో ఓడిపోయిందని గుర్తుచేశారు. ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ప్రతిపక్ష నాయకులను తిట్టడం, కొత్త కేసులు పెట్టడం, కొత్త కమిషన్లు ఏర్పాటు చేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఆటో డ్రైవర్లను, మహిళలను, ఉద్యోగులను అడిగితే ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయం తెలుస్తుందని పేర్కొన్నారు.
తెలంగాణలో ప్రస్తుతం కనిపిస్తున్న కరువు పరిస్థితులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల ఫలితమని కేటీఆర్ విమర్శించారు. ఇది ఎల్‌నినో ప్రభావం కాదు.. ఎల్‌కాంగో ప్రభావం అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలను పట్టించుకోవాల్సిన ముఖ్యమంత్రి తన గడ్డం గురించి మాట్లాడటమే పెద్ద సమస్యగా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ఎప్పుడైనా కేసీఆర్‌తో తనను పోల్చుకోవాలనుకుంటే మాటలతో కాకుండా చేతలతో నిరూపించుకోవాలని సూచించారు.

వాళ్ల ఎమ్మెల్యేలే ఆరోపణలు చేస్తున్నరు

రాష్ట్రంలో అవినీతి, కమీషన్ల వ్యవహారాలపై స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రూ.5 లక్షల కోట్ల నుంచి రూ.10 లక్షల కోట్ల వరకు దోపిడీ జరిగిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆరోపించారని, ప్రభుత్వంలో ఏ పని జరగాలన్నా 15 నుంచి 20 శాతం కమీషన్లు ఇవ్వాల్సి వస్తోందని మరో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడారని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతలే ప్రభుత్వ అవినీతిపై మాట్లాడుతున్నా ముఖ్యమంత్రి సమాధానం చెప్పడం లేదన్నారు. హైడ్రా ఎంపిక చేసుకుని చర్యలు తీసుకునే సాధనంగా మారిందని కేటీఆర్ ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లు, బ్లాక్‌మెయిలింగ్, వసూళ్లకు ఉపయోగపడుతున్నదని విమర్శించారు. పేదల తాత్కాలిక ఇళ్లు, గుడిసెలను కూల్చివేస్తూ వారి జీవనోపాధిని దెబ్బతీస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో నేరాలు, అవినీతి పెరుగుతున్నాయని, ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు.
రేవంత్ రెడ్డి ప్రభుత్వం దావోస్, అమెరికా, జపాన్ పర్యటనల ద్వారా లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొచ్చామని ప్రకటిస్తోందని, అయితే ఆ పెట్టుబడుల ఫలితాలు ఎక్కడ కనిపిస్తున్నాయని కేటీఆర్ ప్రశ్నించారు.



తాజ్‌మహల్ చూసేందుకూ నో చెప్పిన సర్కారు

న్యూఢిల్లీ, నవంబర్ 20 (సింగిడి)

షాంఘై సహకార సంస్థ సదస్సు నిమిత్తం భారత్‌కు వచ్చిన పాకిస్థాన్ పర్యావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్ వ్యక్తిగత పర్యటనలకు భారత ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ఢిల్లీలోని చారిత్రక పురానా ఖిలాలో నవంబరు 20 నుంచి 22 వరకు జరుగుతున్న ఎస్‌సీవో వేదికకే ఆయన రాకను పరిమితం చేస్తూ కేంద్రం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. భారత పర్యటన సందర్భంగా ఆగ్రాలోని ప్రపంచ వింత తాజ్‌మహల్‌తో పాటు, ఢిల్లీలోని ప్రసిద్ధ నిజాముద్దీన్ దర్గాను దర్శించుకోవాలని ముసాదిక్ మాలిక్ భావించారు. ఇందుకోసం అనుమతులు కోరగా, ఎస్‌సీవో అధికారిక సమావేశాలు మినహా ఇతర ప్రాంతాల సందర్శనకు అనుమతించేది లేదని భారత విదేశాంగ శాఖ తేల్చిచెప్పింది. కేవలం సదస్సులో పాల్గొనడానికి మాత్రమే వీసా మంజూరైందని, అధికారిక వేదికను దాటి ఇతర కార్యకలాపాలకు అనుమతి లేదని స్పష్టం చేసింది. 2023లో గోవాలో జరిగిన ఎస్‌సీవో సమావేశానికి బిలావల్ భుట్టో జర్దారీ వచ్చిన తర్వాత, పాకిస్థాన్ మంత్రి భారత్‌లో అడుగుపెట్టడం ఇదే తొలిసారి. 2025 పహల్గామ్ ఉగ్రదాడి, అనంతరం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించిన నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో సింధు జలాల ఒప్పందం రద్దు అంశంపై భారత్‌కు వ్యతిరేకంగా తీవ్ర వ్యాఖ్యలు చేసిన మాలిక్‌ను సదస్సుకు ఆహ్వానించడంపై ఇప్పటికే దేశీయంగా విపక్షాలు కేంద్రాన్ని ప్రశ్నిస్తుండగా, ప్రభుత్వం ఆయన కదలికలపై గట్టి నిఘా ఉంచింది.

రేవంత్ సీఎం అయ్యాకే బీజేపీ 8 ఎంపీలు గెలిచింది

"రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన తర్వాతే రాష్ట్రంలో బీజేపీ ఏకంగా 8 లోక్‌సభ స్థానాలను దక్కించుకుంది. అంతేకాకుండా ఇటీవల జరిగిన రెండు శాసనమండలి (ఎమ్మెల్సీ) స్థానాల్లోనూ కాషాయ జెండానే రెపరెపలాడింది. త్వరలో జరగబోయే మరో రెండు ఎమ్మెల్సీ స్థానాలను సైతం బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయం" అని ఆయన కుండబద్దలు కొట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుపై ప్రజల్లో తీవ్ర అసహనం గూడుకట్టుకుందని ఆయన ఆరోపించారు. ఆ రెండు పార్టీలను ప్రజలు పూర్తిగా తిరస్కరిస్తున్నారని, రాబోయే రోజుల్లో వాటికి ఓటు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి, ప్రజా ఆకాంక్షల సాకారం నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీతోనే సాధ్యమని ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కమలం వికసించడం తథ్యమని కిషన్ రెడ్డి తేల్చిచెప్పారు.

ఓబీసీ కులగణనకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు: కేటీఆర్

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లకు కులగణన తప్పనిసరి.. బీసీల విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యానికి కేసీఆర్ పాలనలో పెద్దపీట

కేటీఆర్‌ను కలిసిన ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

హైదరాబాద్, నవంబర్ 20(సింగిడి):

ఓబీసీ కులగణనకు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరుతూ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. కోఆర్డినేటర్లు జయంత్ యాదవ్, రజినీకాంత్ గౌడ్, మురళీకృష్ణ, చిద్విలాస్, కిరణ్, లోకేష్ తదితరులు కులగణన ఆవశ్యకతను వివరించగా, కేటీఆర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలంటే కులగణన తప్పనిసరి అని స్పష్టం చేశారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ గతంలోనే కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని గుర్తుచేశారు. స్థానిక సంస్థలు, రాజ్యసభ, శాసనమండలి, నామినేటెడ్ పదవుల్లో బీసీ, ఎంబీసీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించామని తెలిపారు. కేసీఆర్ పాలనలో బీసీ, బహుజన వర్గాల విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవానికి ప్రాధాన్యత ఇచ్చామని కేటీఆర్ పేర్కొన్నారు. దాదాపు వెయ్యి గురుకుల విద్యాసంస్థల విస్తరణ, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్టడీ సర్కిళ్ల ద్వారా విద్యార్థులకు అవకాశాలు కల్పించామని వివరించారు.హైదరాబాద్‌లో బీసీ కుల సంఘాల భవనాలకు భూములు, నిధులు కేటాయించామని తెలిపారు.వివిధ బీసీ వృత్తి కులాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్, గౌడలకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు, మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ, యాదవులకు సబ్సిడీపై గొర్రెల పంపిణీ వంటి పథకాలను గుర్తుచేశారు. చేనేత కార్మికుల రుణమాఫీ, బతుకమ్మ చీరల తయారీ ద్వారా నేతన్నలకు ఉపాధి కల్పించామని తెలిపారు.బీసీల జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై కచ్చితమైన సమాచారం ఉంటేనే వారికి తగిన రిజర్వేషన్లు, సంక్షేమ అవకాశాలు కల్పించడం సాధ్యమవుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. దేశవ



దొంగతనాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కామారెడ్డి నవంబర్ 20 (సింగిడి)

కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల ప్రజలకు సదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్ పలు సూచనలు చేశారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లేటప్పుడు తలుపులు కిటికీలు సరిగ్గా మూసారు లేదో చూసుకోవాలి ఇంట్లో అధిక మొత్తంలో నగదు బంగారు ఆభరణాలు ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి. కుటుంబ సభ్యులు అందరూ ఊరికి వెళ్లేటప్పుడు పోలీసులకు లేదా నమ్మకమైన పొరుగు వారికి సమాచారం ఇవ్వాలి. ఇంటి పరిసరాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి రాత్రి సమయంలో ఇంటిబయట లైట్లు వెలిగేలా చూసుకోవాలి. ప్రజల భద్రత కోసం పోలీసులు రాత్రి గస్తిని పటిష్టం చేస్తున్నారని. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. ద్విచక్ర వాహనాలు నిర్మానుష ప్రదేశాల్లో పార్కింగ్ చేయకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉంచి తప్పనిసరిగా లాక్ చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామంలో అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్టు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు అపరిచిత వ్యక్తులకు ఇంటి వివరాలు కుటుంబ సభ్యుల సమాచారం వెల్లడించకూడదు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్తున్న విషయాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని సూచించారు. మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో బంగారు ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి బ్యాంకు నుంచి పెద్ద మొత్తంలో నగదు తీసుకువెళ్లేటప్పుడు తగినజాగ్రత్తలు పాటించాలని తెలిపారు. గ్రామాల్లో రాత్రివేళలో అనుమాన స్పద వ్యక్తులు లేదా కనిపించినట్టయితే వెంటనే డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్ సూచించారు

అర్హులైన ప్రతీ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 20 సింగిడి

బూర్గుల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా యోజన పథకం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం బూర్గుల్ గ్రామంలో ఘనంగా ప్రారంభమైంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సౌమ్య మోహన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి DRDA ప్రాజెక్టు డైరెక్టర్ (PD), MPDO, గాంధారి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగసాని శ్రీనివాస్, తిప్పారం సర్పంచ్ ప్రమోద్ మాధవరావు, కరక్‌వాడి సర్పంచ్ సుధాకర్ రావు, సోమ్లా నాయక్ తండా సర్పంచ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు హాజరయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా యోజన ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన క్లిష్ట సమయంలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.అనంతరం సర్పంచ్ సౌమ్య మోహన్ మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన వివరాలతో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

31వ డివిజన్‌లో దోమల నివారణకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం!



హన్మకొండ ప్రతినిధి, (సింగిడి) నవంబర్ 20

మలేరియా, డెంగ్యూ నివారణే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పించిన తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజుఈరోజు 31వ డివిజన్ పరిధిలో అర్బన్ మలేరియా విభాగం, జి డబ్లు ఎం సి సిబ్బంది ఆధ్వర్యంలో దోమల నివారణకు సంబంధించిన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు గారు ప్రజలకు పలు సూచనలు చేశారు.ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.నీటి తొట్టెలు, పాత్రలకు తప్పనిసరిగా మూతలు పెట్టాలి.నిల్వ ఉన్న నీటిని వారానికి ఒకసారి మార్చాలి.తొట్టెల అడుగు భాగాన్ని శుభ్రమైన గుడ్డతో తుడవాలి.పరిసర ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలి.మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత. పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యవంతమైన 31వ డివిజన్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మామిండ్ల రాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రవచనాలు ప్రారంభం

కరీంనగర్, నవంబర్20(సింగిడి)

మహాశక్తి ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులతో ఈనెల 26 వరకు సాయంత్రం 6.45 నుంచి రాత్రి 8.30 గంటల వరకు గురు చరిత్ర ప్రవచనాలు నిర్వహించనున్నారు. గర్రెపల్లి మహేశ్వర శర్మ ప్రవచనాలు అందించనున్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

సీఎం పర్యటనతో అభివృద్ధి శూన్యం..విమర్శలకే ప్రాధాన్యం

కేసీఆర్, హరీష్ రావును తిట్టడానికే సిద్ధిపేటకు వచ్చారా..?
ప్రజాధనంతో రాజకీయ విమర్శలా..?
ఎన్నికల హామీల అమలుపై సమాధానం చెప్పాలి:ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



సిద్ధిపేట ప్రతినిధి, నవంబర్ 20, (సింగిడి):

గజ్వేల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్ధిపేట పర్యటనలో అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారాన్ని విస్మరించి కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లపై వ్యక్తిగత విమర్శలకే పరిమితమయ్యారని, దుబ్బాక ఎమ్మెల్యే, భారస జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. ప్రజాధనంతో భారీగా అధికార యంత్రాంగాన్ని తరలించి నిర్వహించిన పర్యటనలో ప్రజలకు ఓరగబెట్టింది ఏమి లేదని మండిపడ్డారు.గజ్వేల్‌లో భారస నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటేరి ప్రతాప్‌రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం పర్యటనతో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల కాలువలకు నిధులు, రైతులకు రైతుబంధు, నాణ్యమైన విద్యుత్, రహదారుల అభివృద్ధిపై స్పష్టమైన ప్రకటనలు వస్తాయని ప్రజలు ఆశించారన్నారు. అయితే ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకే సీఎం పరిమితమయ్యారని ఆరోపించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జిల్లాల పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని, అవసరమైన నిధులు మంజూరు చేసేవారని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి మాత్రం ఎక్కడికి వెళ్లినా కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్థాయికి తగిన హుందాతనంతో వ్యవహరిస్తే బాగుంటుందని సూచించారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, నిధులు విడుదల కావడం లేదని ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేల సమస్యలనే పరిష్కరించలేని ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. భారీ సంఖ్యలో కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులను సిద్ధిపేటకు తీసుకొచ్చి ప్రజాధనాన్ని ఖర్చు చేయడం వల్ల ప్రజలకు ఏం ప్రయోజనం కలిగిందని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ రాజకీయ వేదికలుగా మార్చడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని మండిపడ్డారు. పార్టీ కార్యక్రమాలు నిర్వహించుకుంటే పార్టీ నిధులతోనే నిర్వహించుకోవాలని హితవు పలికారు. కేసీఆర్‌పై ఎన్ని విమర్శలు చేసినా తెలంగాణ ప్రజల గుండెల్లో ఆయనకు ఉన్న స్థానాన్ని చెరపలేరన్నారు. ఇప్పటికైనా వ్యక్తిగత విమర్శలు మానుకుని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు, సాగునీటి కాలువలు, రైతుబంధు, విద్యుత్, రోడ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించాలని కొత్త ప్రభాకర్ రెడ్డి కోరారు...ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, భారస నాయకులు పాల్గొన్నారు.

స్వేరో ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

హన్మకొండ ప్రతినిధి (సింగిడి) నవంబర్ 20



హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నవంబర్ 22వ తేదీన స్వేరో ఆత్మీయ సమ్మేళనం స్వేరో పండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు కార్యక్రమ కన్వీనర్ మంద శ్యామ్ తెలిపారు ఒక విద్యార్థికి మంచి విద్య అందిస్తే ఒక కుటుంబం మారుతుంది. ఒక తరం విద్యావంతమైతే సమాజం మారుతుంది.అనే లక్ష్యంతో స్వేరోస్ ముందుకు సాగుతున్నారని తెలిపారు.స్వేరోస్ ప్రధాన ఎజెండా అయిన అక్షరం ఆర్థికం ఆరోగ్యం ఆత్మ గౌరవం అనే నాలుగు అంశాల ఆధారంగా సమాజంలో విద్యా చైతన్యం, ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య అవగాహన, ఆత్మగౌరవ భావనలను పెంపొందించడమే స్వేరోస్ ఆశయమని పేర్కొన్నారు.గతంలో స్వేరోస్ ఉద్యమంలో భాగస్వాములైన పాత స్వేరోలు, ప్రస్తుతం వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న స్వేరో నాయకులు, కార్యకర్తలు, అభిమానులను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ ఆత్మీయ సమ్మేళనం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ సమ్మేళనం ద్వారా విద్య ప్రాధాన్యతను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు సామాజిక చైతన్యాన్ని బలోపేతం చేయడం, ఆత్మగౌరవం, క్రమశిక్షణ, సమానత్వం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, ముఖ్యంగా బాలికలకు సమాన అవకాశాలు కల్పించి అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించడం తమ లక్ష్యమని వివరించారు.కేవలం విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, ఆత్మవిశ్వాసం మరియు క్రమశిక్షణతో ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాలను సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు.డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ గారు గురుకులాల కార్యదర్శిగా ఉన్నప్పుడు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలోకి స్వేరో స్ పేరు వెళ్లే విధంగా ఉన్నతమైన కార్యక్రమాలు చేశారుకావున ఉమ్మడి వరంగల్ జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పాత స్వేరోలు, కొత్త స్వేరో నాయకులు, స్వేరో అభిమానులు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారి అభిమానులు, విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులు ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సమేతంగా నవంబర్ 22న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ స్వేరో ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మంద శ్యామ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు:తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బొల్లె మధుకర్, స్వేరో నాయకులు మారపల్లి మనోజ్, స్వేరోస్ జిల్లా నాయకులు చాతల్లా వేణుగోపాల్, రాజేశ్వరి సోషల్ మీడియా ఇన్‌చార్జి తెల్లూరి సురేష్, మాజీ భద్రాద్రి జోనల్ అధ్యక్షులు ఒంటెరు చక్రి, క్విట్ ఇండియా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కోకిల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా దరఖాస్తులో వివరాలు పక్కాగా ఉండాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 20 (సింగిడి):



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో భాగంగా బీమా దరఖాస్తులో వివరాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లావ్యాప్తంగా సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి. కుటుంబాల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా వేములవాడ అర్బన్ మండలం ఆర్ అండ్ ఆర్ కాలనీ చీర్లవంచ, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 23 వ వార్డు లో ఏర్పాటు చేసిన కేంద్రాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఆయా కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయగా, పరిశీలించారు. రిజిస్టర్లు ఏర్పాటు చేసి దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేయగా, పరిశీలించి.. ఎందరు నమోదు చేసుకున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆన్లైన్లో బీమా వివరాలు నమోదు చేస్తుండగా, పరిశీలించి.. మొత్తం ప్రక్రియ పూర్తి అయ్యేందుకు ఎంత సమయం పడుతుందో ఆరా తీశారు. సిరిసిల్లలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పై అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, అధికారులతో కలిసి ఆవిష్కరించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు డిసెంబర్ 19వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. అన్ని కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ లు ఉన్నాయని వివరించారు. బీమా వివరాల నమోదు సమాచారం చేరవేయాలని ఆదేశించారు. అర్జీదారులు రేషన్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు ఇవ్వాలని సూచించారు. అన్ని ప్రత్యేక కేంద్రాల్లో బీమా వివరాలు, నామినీ వివరాలు పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, నోడల్ అధికారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సిరిసిల్ల 23వ వార్డు సభ్యురాలు ఆడెపు చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్లు జయంత్, మహేష్ తదితరులు ఉన్నారు.

రేవంత్ రెడ్డిపై బీసీల్లో తీవ్ర వ్యతిరేకత

హన్మకొండ ప్రతినిధి(సింగిడి) నవంబర్ 20

కొండా సురేఖమ్మను బర్తరఫ్ చేసి బీసీల్లో వ్యతిరేకత మూటగట్టుకున్న రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తప్పును సరిదిద్దుకుని కొండా మురళీకి ఎమ్మెల్సీ ఇవ్వాలని, లేకుంటే వరంగల్ లో కాంగ్రెస్ భూస్థాపితం ఖాయమని బీసీ సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఉమ్మడి ఓరుగల్లు జిల్లాలో తిరుగులేని బీసీ నేత, రాష్ట్రవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ఓరుగల్లు ముద్దుబిడ్డ, పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రజానాయకుడు, ఆప ద్బాంధవుడు అయిన కొండా మురళీకి జరిగిన అన్యాయంపై బీసీ సంఘాలు భగ్గుమంటున్నాయి. శాసనసభ ఎన్నికల ముందు కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని నమ్మబలికి, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఓట్లను తెప్పించుకున్న కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాటను విస్మరించింది. అంతేకాకుండా..మంత్రి పదవి నుండి కొండా సురేఖమ్మను బర్తరఫ్ చేయించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. ఇది కేవలం కొండా కుటుంబానికి జరిగిన అవమానం కాదు, యావత్ బీసీ సమాజానికి జరిగిన ఘోర అవమానంగా బీసీలు భావిస్తున్నారు. ఓరుగల్లు బిడ్డలను అవమానిస్తే ఊరుకునేది లేదని బీసీలు హెచ్చరిస్తున్నారు.ఇప్పటికైనా తప్పును సరిదిద్దుకోవాలి:జరిగిన పొరపాటును గ్రహించి, కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటికైనా కళ్లు తెరవాలని బీసీ సంఘాలు, బీసీ మేధావులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొండా సురేఖమ్మ భర్త, బీసీ ముద్దుబిడ్డ అయిన కొండా మురళీకి గవర్నర్ కోటాలో భర్తీ చేయబోయే ఎమ్మెల్సీ పదవిని కేటాయించి, చేసిన తప్పును సరిదిద్దుకోవాలని వారు కోరుతున్నారు. ఇది కేవలం పదవి కాదు, బీసీల ఆత్మగౌరవానికి ప్రతీక. కొండా మురళీకి ఎమ్మెల్సీ ఇస్తేనే బీసీల్లో కాంగ్రెస్ పై ఉన్న ఆగ్రహం చల్లారుతుంది. ఒకవేళ ఈ డిమాండ్ ను పెడచెవిన పెడితే, వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అవడం ఖాయమని, బీసీ వర్గాలు పూర్తిగా కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యే పరిస్థితులు నెలకొంటాయని బీసీ సంఘాలు తీవ్రంగా హెచ్చరించాయి. బీసీల గోసను, ఓరుగల్లు బిడ్డల ఆక్రోశాన్ని అధిష్టానం అర్థం చేసుకుని తక్షణమే న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



బీమా నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి
హనుమకొండ ప్రతినిధి
నవంబర్ 20 (సింగిడి)



ఆత్మకూర్ మండలం తిరుమలగిరి గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ఆన్లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ఆన్లైన్ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం తిరుమలగిరి గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ఆన్లైన్ నమోదు ప్రక్రియ చేస్తుండగా జిల్లా అదనపు కలెక్టర్ సందర్శించారు. గ్రామస్తుల వివరాలను ఆన్లైన్ విధానంలో బీమా కోసం నమోదు చేస్తుండగా పరిశీలించారు.ఆన్లైన్ నమోదు ప్రక్రియకు సంబంధించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ద్వారా ప్రతి కుటుంబానికి ప్రయోజనం కలుగుతుందన్నారు. బీమా నమోదు ప్రక్రియను గ్రామంలో వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బూర దేవేంద్ర రాజేందర్ , తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్య శిక్షణ

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 20 (సింగిడి):



మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో యువతకు నైపుణ్య శిక్షణ అందించి, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని టాస్క్ కేంద్రాన్ని, పట్టణంలోని 10వ వార్డు రంగంపల్లిలో ఉన్న బస్తీ దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా మార్కెట్ అవసరాలకు తగిన కోర్సులను గుర్తించి, శిక్షణ అందించాలని సూచించారు. కేవలం శిక్షణకే పరిమితం కాకుండా, వారికి ఉపాధి దక్కేలా పక్కా కార్యాచరణ రూపొందించి టాస్క్ కేంద్రం ద్వారా ఎక్కువ మందికి ప్రయోజనం చేకూర్చాలన్నారు.అనంతరం రంగంపల్లి బస్తీ దవాఖానాను పరిశీలించిన కలెక్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో సమయ పాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. వాతావరణ మార్పుల వల్ల సీజనల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో టాస్క్ రీజినల్ మేనేజర్ కౌసల్య, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ భరోసా కల్పించడమే లక్ష్యం

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 20 (సింగిడి):



నిరుద్యోగ యువతకు ఉద్యోగ భరోసా కల్పించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా సువర్ణావకాశాన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి పిలుపునిచ్చారు.పెద్దపల్లి నియోజకవర్గ యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో, ట్రినిటీ విద్యా సంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి ఆలోచన మేరకు ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేశారు. శుక్రవారం ట్రినిటీ విద్యాసంస్థల కళాశాల సిబ్బందితో కలిసి ఆమె మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ, ట్రినిటీ విద్యా సంస్థలు విద్యను అందించడంతో పాటు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా జాబ్ మేళాలు నిర్వహిస్తూ యువతకు ఉపాధి కల్పించడాన్ని ఒక సామాజిక బాధ్యతగా తీసుకున్నాయని కొనియాడారు. పెద్దపల్లి నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా 20కి పైగా మల్టీనేషనల్ కంపెనీలను యువత ముంగిటకే తీసుకువచ్చి, 2,000కు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. గతంలో దాసరి మనోహర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో దాదాపు 3 వేల మంది యువతకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి ఆర్మీ, ఇతర రక్షణ దళాల్లో ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేశారని, నేడు అదే సేవా సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు.ఉద్యోగం అంటే ఒక వ్యక్తికి ఉపాధి మాత్రమే కాదని, ఒక కుటుంబానికి భరోసా అని ఆమె పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి ఎదురుచూసే పరిస్థితి లేకుండా స్థానికంగానే ఈ అవకాశం కల్పిస్తున్నారని, ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దాసరి మనోహర్ రెడ్డికి, దాసరి ప్రశాంత్ రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. యువత తమ భవిష్యత్తు కోసం ఆత్మవిశ్వాసంతో ఒక్క ముందడుగు వేస్తే, వారికి అండగా నిలిచేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. నవంబర్ 21వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుండి పెద్దపల్లి ప్రగతి నగర్‌లోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ మెగా జాబ్ మేళా జరగనుంది. అండర్ గ్రాడ్యుయేట్లు, గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఇతర అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులందరూ తమ బయోడేటా (రెజ్యూమ్) తో పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం!

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 20 సింగిడి



నిజాంసాగర్: నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల జీవితాల్లో కొత్త ఆశలు నింపుతోంది. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం అండగా నిలుస్తోంది. సొంత గూడు సమకూరడంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ కార్యక్రమానికి క

ఎడిటోరియల్

Editorial

సామాన్య కుటుంబ ఆత్మీయ నేస్తం టెలివిజన్



(21 నవంబర్ "ప్రపంచ టెలివిజన్ దినోత్సవం" సందర్భంగా)

21వ శతాబ్దంలో టెలివిజన్ (టివీ) ప్రయోజనం ఏమైనా ఉన్నదా ? డిజిటల్ యుగపు టివీ ద్వారా దృశ్య శ్రవణ సమాచార వితరణ, కేబుల్ ప్రసారాల వడ్డింపు మాత్రమే కాకుండా మల్టీమీడియా పాత్ర, వీడియో, మ్యూజిక్, ఇంటర్నెట్ అనుసంధాన ప్రయోజనాలు అనేకం కలిగి ఉంటున్నది. సామాన్య మానవుడి వినోద, విజ్ఞాన, వార్తా ప్రసారాల వేదికగా ప్రతి ఇంట్లో కనీస అవసరంగా మారింది టెలివిజన్ బాక్స్. టివీని విచక్షణారహితంగా వాడితే వ్యక్తి పతనానికి కూడా కారణం అవుతున్నది. భారత్‌లో దాదాపు 350 మిలియన్ల కుటుంబాలు ఉండగా, అందులో 230 మిలియన్ల కుటుంబాలు (70 శాతం కుటుంబాలు) టెలివిజన్ ప్రసారాలు చూడడం జరుగుతుంది. టివీ ప్రయోజనాలను గుర్తించిన ఐరాస ప్రతి ఏట 21 నవంబర్ రోజు "ప్రపంచ టెలివిజన్ దినోత్సవం (వరల్డ్ టివీ డే)" పాటించడం కొనసాగుతున్నది. ప్రపంచ టివీ దినం లక్ష్యాలుగా "అత్యంత నమ్మకమైనా నేస్తం – సమాచారం, సాధికారత, అనుసంధానం – ఆలోచనాత్మకంగా చూడండి – జాగ్రత్తగా పంచుకొండి" అను అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

టివీ విస్తృత ప్రయోజనాలు:

ప్రజలను ప్రభావితం చేస్తూ విభిన్న సమస్యలను ప్రదర్శించడంలో టివీ ప్రధాన భూమికను పోషిస్తున్నది. టివీ ప్రసారాలు వివిధ సంస్కృతులను ఏకం చేయడం, ప్రపంచ వార్తలను క్షణాల్లో మన ఇంటికి చేర్చడం, విద్య బోధన, వినోదాల వడ్డింపు, సమాచారాన్ని చేరవేయడం, ప్రజలను అనుసంధానం చేయడం, మీడియా లిటరసీ, సామాజిక అభివృద్ధి, బ్రేకింగ్ న్యూస్ రూపంలో తాజా వార్తలను అందించడం, సాంస్కృతిక వినిమయం, ఆర్థిక ప్రగతికి బాటలు వేయడం, సాంస్కృతిక వికాసం, క్రీడల వృద్ధి, వినూత్న ప్రయోగాల క్షేత్రం లాంటి బహుళ ప్రయోజనాలను కలిగి ఉంటుంది. టివీ ఆవిష్కరణలో ప్రధాన భాగంగా జాన్ లోగీ బైర్డ్, ఫిలో ఫెన్స్‌వర్త్ కృషి మరువలేనిది. అత్యంత శక్తివంతమైన మాధ్యమంగా టివీ నేడు ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నది.

యువతకు ప్రేరణ అందించడం, పలు అంశాల్లో అవగాహన కల్పించడం, ప్రపంచ దర్శనానికి కిటికీ వలె టివీ నిలుస్తున్నది. సమాజాన్ని సమన్వయ పరచడంతో పాటు సమాజ అద్దంగా టివీ నిలువెత్తు రూపం నిలుస్తున్నది. ప్రజాభిప్రాయాన్ని సమీకరించడం, సాంస్కృతిక వైవిధ్యాలను ప్రోత్సహించడం, దేశాల మధ్య సంబంధాలను పెంపొందించడం, పేదరిక నిర్మూలన లాంటి బహుళ ప్రయోజనాలు కలిగిన టివీ లేని ఇళ్లు లేదని అవగతం అవుతున్నది.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

బృందావన విహారి



కార్తీక శుద్ధ ఏకాదశి మొదలుకొని పౌర్ణమి వరకు పంచ పర్వాలలోని ఐదు రోజులలో తులసికి కృష్ణునితో వివాహం జరపడం సనాతర ఆచారం. హిందూ మత విధుల్లో తులసికి అత్యంత ప్రాధాన్యత ఉంది. తులసికి సంస్కృతంలో చాలా పేర్లున్నాయి. సురస (మంచి రసం కలిగినది), సులభ (సులభంగా లభించేది), విష్ణువల్లభ (విష్ణుమూర్తికి ఇష్టమైనది), అపేతరాక్షసి (రాక్షస బాధను తొలగించే సామర్థ్యం కలిగినది), పావని (పవిత్ర చేసేది), శూలఘ్ని (శూలను లేదా నొప్పిని తగ్గించేది).. దేవతార్చనకు తులసి పత్రి ముఖ్యం. తులసి లక్ష్మీదేవి అవతారమని భారతీయుల విశ్వాసం. కాలనేమి కూతురు, జలంధరుని భార్యయైన వృంద (వృంద, బృంద, వృందావనం, బృందావనం సంబంధం) చితాభస్మం నుండి తులసి, ఉసిరి మున్నగునవి పుట్టినట్లు శివపురాణంలో ఉంది. తులసి తీర్థాన్ని మరణ సమయంలో నోటిలో పోయడం, శవ దహన సమయాన తులసి కాష్టాన్ని కొద్దిగైనా వేయడం ఆచరిస్తారు. బృందావనం ఉన్న ఇంటికి యమదూతలు కూడా రారని శాస్త్ర వచనాలు. క్షీరాబ్ధి పర్వ సమయంలో తులసి ఒక దేవతగా వ్యవహరింప బడుతున్నది. దేవ దీపావళి పేరున మహారాష్ట్రలో కార్తీక శుక్ల ద్వాదశినాడు తులసి వివాహ పర్వం జరుపుతారు. మాళవీయులు ఈ పండువ నాడు తులసి కోటను శుభ్ర పరిచి వెల్లవేసి, అలంకరించి, సాయంకాల మునిమాపు వేళ మంత్రయుక్తంగా జరుపు కుంటారు. తెలుగు రాష్ట్రాలలో తులసి పూజతో పాటు, పెద్ద ఉసిరి కొమ్మను ఉంచడం, దీపారాధన చేయడం అనవాయితీ. స్మృతి కౌస్తుభంలో ఏకాదశి మొదలు ఐదు దినాలలో ఏనాడైనా చేయవచ్చునని స్పష్టమవుతున్నది. విష్ణువు అవతారాలలో ఎనిమిదవది కృష్ణావతారం.

కృష్ణునితో తులసికి ప్రధానంగా కార్తీక పూర్వార్ధ పక్ష పంచ పర్వాలలో సాయంత్రం గోధూళి వేళ కల్యాణం నిర్వహించడం సాంప్రదాయంగా ఉంది. కృష్ణునితో తులసికి అయ్యే వివాహం వివాహ రుతువును స్వాగతిస్తుంది. వివాహాలకు మాఘాది పంచకాలు తగినవి. తులసి వివాహ పర్వం కార్తీకంలో వస్తుంది. అంటే వివాహ రుతువుకు తులసి కృష్ణుల కళ్యాణం పురోగామి అన్నమాట. ప్రతి సంవత్సరం దీపావళికి తర్వాత) పంచ పర్వాలు గా భావించబడే కార్తీక శుక్ల ఏకాదశి నుండి పౌర్ణమి వరకు తులసీ కృష్ణుల వివాహం జరపడం ఆనవాయితీగా వస్తున్నది. తులసి మొక్కకు చెరుకు గడలతో పందిరి వేసి, ఆ పందిరికి మామిడి తోరణాలు కట్టి, తులసి మొక్కను పూలతో అందంగా అలంకరించి పూజ చేసే సంప్రదాయము భారతదేశములో ఉంది. దీపావళి ఉత్సవాలలో లాగే తులసి మొక్కచుట్టూ, ఇంటి చుట్టూ మట్టి ప్రమిదలో దీపాలు పెట్టి అలంకరిస్తారు. భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో ఈ సందర్భంగా బాణాసంచా కూడా కాల్చుతారు.

శ్రీకృష్ణ విగ్రహానికి, తులసికి చెట్టు వధువుగా, శ్రీకృష్ణ విగ్రహం వరునిగా నిర్దేశించి, మధ్య అంతర పటంగా ఒక శాలువా పట్టు కుంటారు. తులసి వేళ్ళ వద్ద ఒక చెరుకు ముక్క ఉంచి, పసుపు అద్దిన గుడ్డలు, గాజులు మొదలైన ఆభరణాలను తులసి మొక్కకు కట్టి, గణపతి, శివుడు, విష్ణు వులను, పుణ్య నదులను స్తోత్రం చేస్తూ, పురోహితుడు మంగళా ష్టకాలు చదువుతూ వేదోక్త రీతిలో తంతు నిర్వహించాక తెర ఎత్తి, వివాహం జరిపించడం, నివేదన పదార్థాలను ప్రసాదంగా పంచడం సనాతన సాంప్రదా యాచారం. ఈకార్య క్రమంలో తులసి కోటలో పెద్ద ఉసిరిక కొమ్మను ఒకదానిని ఉంచడం ప్రత్యేకం. తులసితో కలిపి ఉసిరిక కొమ్మను పూజించడం, కాయలలో పూజా సమయాన దీపారాధన చేయడం ఆచారం...

రాము కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

ప్రపంచం మారబోతోందా?

మనిషి భవిష్యత్తు ఏమిటి?

ప్రపంచ చరిత్రలో కొన్ని సంవత్సరాలు కేవలం కాలగమనంలో భాగంగా మిగిలిపోవు. అవి చరిత్రను మలుపు తిప్పే కీలక ఘట్టాలుగా నిలిచిపోతాయి. ప్రస్తుతం ప్రపంచం అలాంటి ఒక చారిత్రక మలుపు వద్ద నిలబడి ఉంది. 2026 నుంచి 2030 వరకు రాబోయే ఐదేళ్లు మానవజాతి భవిష్యత్తును నిర్ణయించే అత్యంత కీలకమైన కాలంగా మారే అవకాశముంది. మనిషి జీవన విధానం, ఆలోచనా ధోరణి, ఉద్యోగాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, రాజకీయాలు, అంతర్జాతీయ సంబంధాలు.. ఇలా ప్రతి రంగంలోనూ పెను మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ఇవి కేవలం సాంకేతిక మార్పులు కావు. మనిషి ఎలా బతకాలి? భవిష్యత్తు తరాలకు ఎలాంటి ప్రపంచాన్ని అందించాలి? అనే ప్రశ్నలను మన ముందుంచుతున్నాయి.



యుద్ధాల మధ్య శాంతి కోసం ప్రపంచం అన్వేషణ!

ప్రపంచంలో ఒకవైపు రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, మరోవైపు ఇజ్రాయెల్--ఇరాన్ ఉద్రిక్తతలు, పశ్చిమాసియా పరిణామాలు అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. దేశాలు తమ రక్షణ కోసం భారీగా నిధులు వెచ్చిస్తున్నాయి. ఆధునిక క్షిపణులు, డ్రోన్లు, అణ్వాయుధాలు, సైబర్ యుద్ధ సామర్థ్యాల కోసం పోటీ పడుతున్నాయి. కానీ ఒక ప్రశ్నకు మాత్రం ప్రపంచం సమాధానం చెప్పలేకపోతోంది. ఇన్ని ఆయుధాలు సమకూర్చుకుంటున్న మానవజాతి తన భవిష్యత్తుకు భద్రతను కల్పించుకోగలుగుతోందా? యుద్ధంలో గెలిచిన దేశానికి భూభాగం దక్కవచ్చు. కానీ ఓడిపోయేది మాత్రం మానవత్వమే. ప్రాణాలు కోల్పోయేది సైనికులు మాత్రమే కాదు.. అమాయక ప్రజలు, పిల్లలు, మహిళలు, వృద్ధులు కూడా. రాబోయే రోజుల్లో ప్రపంచ దేశాల ముందు రెండు మార్గాలు ఉండబోతున్నాయి. ఒకటి ఆధిపత్యం కోసం పోరాటం.. మరొకటి సహకారం ద్వారా అభివృద్ధి. ఆయుధాల బలం కంటే ఆర్థిక బలం, వాణిజ్య సంబంధాలు, సాంకేతిక సహకారం, దౌత్యానికి ప్రాధాన్యత పెరగాల్సిన అవసరం ఉంది. భారతదేశం మొదటి నుంచీ ప్రపంచ శాంతి, చర్చలు, దౌత్య పరిష్కారాలకు ప్రాధాన్యత ఇస్తూ వస్తోంది. 'వసుధైవ కుటుంబకం' అనే భారతీయ భావన ప్రపంచానికి మరింత అవసరమవుతోంది.

AI విప్లవం.. మనిషి చేసే పనిని యంత్రం చేస్తుందా?

ఇప్పటివరకు మనిషి యంత్రాలను తయారు చేశాడు. ఇప్పుడు మనిషి ఆలోచనా ప్రక్రియలో కూడా యంత్రాలు భాగస్వాములవుతున్నాయి. అదే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI). 2026 నాటికి కృత్రిమ మేధస్సు సామాన్య ప్రజల జీవితాల్లోకి విస్తృతంగా ప్రవేశించింది. రాబోయే ఐదేళ్లలో దీని ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉంది. వైద్యరంగంలో వ్యాధులను గుర్తించడం, పరీక్షల నివేదికలను విశ్లేషించడం, చికిత్సకు సహాయక సూచనలు ఇవ్వడం.. విద్యారంగంలో విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధించడం.. వ్యవసాయంలో పంటల పరిస్థితిని అంచనా వేయడం.. మీడియా రంగంలో వార్తల సేకరణ, అనువాదం, సమాచార విశ్లేషణ.. ఇలా ప్రతి రంగంలో AI పాత్ర పెరగనుంది.

రేపటి రోజుల్లో AI డాక్టర్‌కు సహాయకుడిగా, ూ× టీచర్ విద్యార్థికి మార్గదర్శిగా, AI జర్నలిజం వార్తా సేకరణలో సహాయక సాధనంగా మారవచ్చు. అయితే ఇక్కడ ఒక ప్రమాదం కూడా ఉంది. సాంకేతికతను ఉపయోగించేవారు ముందుకు వెళ్తారు. దాన్ని అర్థం చేసుకోలేనివారు వెనుకబడే అవకాశం ఉంది. కొన్ని ఉద్యోగాలు మారవచ్చు, మరికొన్ని కనుమరుగవవచ్చు. అదే సమయంలో కొత్త వృత్తులు, కొత్త అవకాశాలు కూడా పుట్టుకొస్తాయి. కానీ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ూ× సమాచారం ఇవ్వగలదు.. శ్లేషించగలదు.. వేగంగా నిర్ణయాలకు తోడ్పడగలదు. కానీ మనిషి అనుభవం, సామాజిక బాధ్యత, నైతిక విలువలు, కరుణ, ఆత్మీయతలకు ప్రత్యామ్నాయం కావడం అంత సులభం కాదు. భవిష్యత్తులో AIని చూసి భయపడేవారు కాదు.. ూ×ని బాధ్యతాయుతంగా ఉపయోగించుకునేవారే విజేతలు.

జర్నలిజం కూడా పెను మార్పుల దశలోకి!

ఈ మార్పుల్లో మీడియా రంగం కూడా మినహాయింపు కాదు. ఒకప్పుడు వార్తల కోసం విలేకరి గ్రామాలు తిరిగేవాడు. ప్రజల సమస్యలను తెలుసుకునేవాడు. అధికారులను ప్రశ్నించేవాడు. ఆధారాలను సేకరించి వార్తలు రాసేవాడు. ఇప్పుడు ఒక్క మొబైల్ ఫోన్‌తోనే ప్రపంచంలోని సమాచారాన్ని క్షణాల్లో తెలుసుకునే పరిస్థితి వచ్చింది. రేపటి రోజుల్లో AI వార్తలను రూపొందించవచ్చు. వీడియోలు సృష్టించవచ్చు. అనేక భాషల్లోకి అనువదించవచ్చు. కానీ నిజమైన జర్నలిజం అంటే కేవలం వార్తలు రాయడం కాదు. వార్త వెనుక ఉన్న వాస్తవాన్ని వెలికితీయడం. బాధితుడి కన్నీటిని అర్థం చేసుకోవడం. అధికారాన్ని ప్రశ్నించడం. సమాజానికి నిజాన్ని అందించడం. AIసృష్టించిన వార్తను ప్రచురించడం సులభం. కానీ ఆ వార్తలోని నిజానిజాలను పరిశీలించి ప్రజల ముందు ఉంచడం జర్నలిస్టు బాధ్యత. అందుకే భవిష్యత్తులో జర్నలిస్టులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నిజాయితీ, నిబద్ధత, సామాజిక స్పృహ మరింత అవసరం.

భారత్.. ప్రపంచానికి కొత్త దిశ చూపగలదా?

ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థలు మారుతున్న తరుణంలో భారత్ పాత్ర అత్యంత కీలకంగా మారుతోంది. ప్రపంచంలోనే అతి పెద్ద యువ జనాభా కలిగిన దేశాల్లో భారత్ ఒకటి. సాంకేతిక పరిజ్ఞానం, అంతరిక్ష పరిశోధనలు, డిజిటల్ చెల్లింపులు, ఔషధ ఉత్పత్తులు, వ్యవసాయం, సేవారంగాల్లో భారత్ తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటోంది. అమెరికా సాంకేతిక, ఆర్థిక శక్తిగా.. చైనా పారిశ్రామిక శక్తిగా ఎదిగినట్లే, భారత్ కూడా తన ప్రత్యేకతతో ప్రపంచంలో కీలక పాత్ర పోషించే అవకాశాలు కలిగి ఉంది. కానీ భారత్ అసలైన బలం కేవలం జనాభా కాదు. వైవిధ్యంలో ఏకత్వం, ప్రజాస్వామ్య వ్యవస్థ, కుటుంబ విలువలు, ఆధ్యాత్మిక వారసత్వం, సహజీవన సంస్కృతి కూడా మన బలాలు. భారత్ ప్రపంచానికి చెప్పాల్సిన సందేశం ఒక్కటే. అభివృద్ధి కావాలి.. కానీ విధ్వంసం వద్దు. సాంకేతికత కావాలి.. కానీ మానవత్వం మరువకూడదు. సంపద కావాలి.. కానీ ప్రకృతిని నాశనం చేయకూడదు.

యువత చేతుల్లోనే రేపటి ప్రపంచం!

2026 నుంచి 2030 వరకు ప్రపంచంలో జరిగే మార్పులను ఎక్కువగా ఎదుర్కొనేది నేటి యువతే. వారి చేతుల్లోనే రేపటి ఉద్యోగాలు, పరిశోధనలు, రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థలు ఉంటాయి. విద్య అంటే కేవలం డిగ్రీలు సంపాదించడం కాదు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా కొత్త విషయాలు నేర్చుకోవడం, ప్రశ్నించడం, ఆలోచించడం, సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం. తల్లిదండ్రులు పిల్లలకు కేవలం మార్కులు, ఉద్యోగాల గురించి మాత్రమే చెప్పకుండా మానవత్వం, క్రమశిక్షణ, ప్రకృతి ప్రేమ, సామాజిక బాధ్యతలను కూడా నేర్పించాలి. సాంకేతికంగా ప్రపంచాన్ని జయించినా.. మనిషిగా ఓడిపోతే ఆ విజయానికి అర్థం ఉండదు.

అయ్యప్ప దీక్షలోని సందేశమే ప్రపంచానికి అవసరం!

ఇక్కడ ఒక ఆధ్యాత్మిక సందేశాన్ని కూడా మనం గుర్తు చేసుకోవాలి. అయ్యప్ప దీక్షలో మాల ధరించిన స్వాములు ఒకరినొకరు కులం, మతం, ప్రాంతం, ఆర్థిక స్థితి ఆధారంగా చూడరు. అందరినీ 'స్వామి' అని సంబోధిస్తారు. నలభై ఒక్కరోజుల దీక్షలో క్రమశిక్షణ, సహనం, సాత్విక జీవనం, సేవాభావం, సమానత్వం నేర్చుకుంటారు. ఇది కేవలం ఒక ఆచారం కాదు. మనిషి తనలోని అహంకారాన్ని తగ్గించుకుని, ఎదుటివారిని గౌరవించడం నేర్చుకునే జీవన విధానం. ప్రపంచ దేశాలు కూడా ఇదే సూత్రాన్ని పాటిస్తే యుద్ధాల అవసరం తగ్గుతుంది. మతాలు, భాషలు, దేశాలు వేరైనా మనుషులంతా ఒకే మానవ కుటుంబానికి చెందినవారనే భావన పెరుగుతుంది. బుద్ధుడి కరుణ, గాంధీజీ అహింస, వివేకానందుడి మానవతా సందేశం, అయ్యప్ప దీక్షలోని సమానత్వ భావన.. ఇవన్నీ ప్రపంచానికి అవసరమైన జీవన విలువలే.

2030 నాటికి మనం ఎలా ఉండబోతున్నాం?

2030 నాటికి ప్రపంచం పూర్తిగా ఎలా మారుతుందో ఎవరూ కచ్చితంగా చెప్పలేరు. కానీ కొన్ని మార్పులు మాత్రం మన కళ్లముందే వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. యుద్ధాల కంటే శాంతి విలువను ప్రపంచం గుర్తించాల్సిన పరిస్థితి వస్తుంది. ూ×తో కలిసి పనిచేయడం ప్రతి రంగంలోనూ అవసరమవుతుంది. నీరు, ఆహారం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత పెరుగుతుంది. సాంకేతిక పరిజ్ఞానం తెలిసిన యువతకు కొత్త అవకాశాలు వస్తాయి. నిజమైన సమాచారం, విశ్వసనీయ జర్నలిజానికి మరింత విలువ పెరుగుతుంది. మానవ సంబంధాలు, మానసిక ప్రశాంతత, కుటుంబ విలువల అవసరం మరింత స్పష్టమవుతుంది. అయితే ఈ మార్పులన్నింటికంటే ముఖ్యమైనది ఒక్కటే.

ప్రపంచం ఎంత ఆధునికంగా మారినా.. మనిషి మనిషిగా మిగలాలి! చంద్రుడిపైకి వెళ్లగలం. అంగారకుడిపై పరిశోధనలు చేయగలం. కృత్రిమ మేధస్సును సృష్టించగలం. సముద్రాల లోతులను కొలవగలం. కానీ పక్కింటి మనిషి ఆకలిని గుర్తించలేకపోతే, బాధలో ఉన్నవారికి చేయూత ఇవ్వలేకపోతే, మన అభివృద్ధికి అసలైన అర్థం ఏమిటి? యుద్ధాలు ఆగాలి. ఆకలి తీరాలి. ప్రకృతి బతకాలి. రైతు బాగుండాలి. యువతకు ఉపాధి రావాలి. జర్నలిజంలో నిజం నిలవాలి. మనిషిలో మానవత్వం పెరగాలి. రాబోయే ఐదేళ్లు ప్రపంచాన్ని మార్చవచ్చు. కానీ ప్రపంచాన్ని మంచిగా మార్చాల్సిన బాధ్యత మాత్రం మన చేతుల్లోనే ఉంది. మార్పు కోసం ప్రపంచాన్ని నిందించకండి.. మార్పును మనతోనే ప్రారంభిద్దాం. ఎందుకంటే భవిష్యత్తును నిర్ణయించేది యంత్రాల మేధస్సు మాత్రమే కాదు.. మనిషి హృదయంలో మిగిలి ఉన్న మానవత్వం కూడా!

ఉక్కల్‌కార్ రాజేందర్ నాథ్
సీనియర్ పాత్రికేయులు,
9440387170.



దేశంలోనే మేటి పథకం 'ఇందిరమ్మ జీవిత బీమా'

41 కిలోలకు మించి ధాన్యం తూకం వేయొద్దు
రూ. 8.30 కోట్లతో సుల్తానాబాద్‌లో పబ్లిక్ స్కూల్,
ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 20 (సింగిడి):

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. సుల్తానాబాద్, పెద్దపల్లి పట్టణాల్లో నిర్వహించిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఇందిరమ్మ బీమా ఆన్‌లైన్ విధానం ప్రారంభం:సుల్తానాబాద్ మున్సిపాలిటీ 10వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత ఆధ్వర్యంలో అలాగే పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి బస్తీ దవాఖాన వద్ద ఏర్పాటు చేసిన 'ఇందిరమ్మ జీవిత బీమా పథకం' ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను విజయరమణ రావు స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీమా పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా ముందుచూపుతో ఈ మేటి పథకాన్ని తీసుకొచ్చారని



ఎలాంటి షరతులు లేకుండా ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబానికి ఈ బీమా అండగా నిలుస్తుందని వివరించారు.విద్య, మౌలిక వసతులకు పెద్దపీటసుల్తానాబాద్ 10వ వార్డులో లబ్ధిదారుల ఆహ్వానం మేరకు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ కళాశాల మైదానంలో ఖో-ఖో (కోకో) క్రీడా పోటీలను ప్రారంభించారు. మరో నాలుగైదు రోజుల్లో సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రూ. 8.30 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'కు భూమిపూజ చేయనున్నట్లు వెల్లడించారు.మరోవైపు పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు గౌరెడ్డిపేట బీటీ రోడ్డు నుండి శాంతినగర్ బ్రిడ్జి వరకు డి.ఎం.ఎఫ్.టి (DMFT) నిధులు రూ. 30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఆరుతడి పంటలు ధాన్యం కొనుగోళ్లపై దిశానిర్దేశంపెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో విజయరమణ రావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని యాసంగిలో రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.పారదర్శకంగా కొనుగోళ్లుధాన్యం కొనుగోలు కేంద్రాలను సర్పంచులు నిరంతరం సందర్శించాలని రైతుల నుంచి 41 కిలోలకు మించి ఒక్క గింజ కూడా అదనంగా తూకం వేయకూడదని కఠినంగా హెచ్చరించారు. గత పదేళ్లలో పాలకులు ప్రజలకు మొండిచేయి చూపించారని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు రేషన్ కార్డులు, వయోవృద్ధుల పెన్షన్లను పారదర్శకంగా అర్హులకు అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్లు బిరుదు రాధాకృష్ణ, నూగిల్ల మల్లయ్య, మున్సిపల్ కమిషనర్లు టి. రమేష్, వెంకటేష్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాజయ్య, సింగిల్ విండో చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు కాంగ్రెస్ నాయకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

10 వ వార్డులో జీవిత పథకం నమోదు కార్యక్రమం

వేములవాడ నవంబర్ 20 (సింగిడి)

వేములవాడ 10 వ వార్డు కౌన్సిలర్ సిరిగిరి సంగీత – శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత పథకం నమోదు కార్యక్రమం చేపట్టారు ప్రతి కుటుంబానికి బీమా భద్రత ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అవకాశం నూ మన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కల్పించారాని కావున ఈ రోజు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారి సహకారంతో ఈ రోజు ఇందిరమ్మ కుటుంబ జీవిత పథకం నమోదు కార్యక్రమం 10 వ వార్డు లో చేపాట్టమని కావున అర్హులైన ప్రతి సభ్యులు ఈ బీమా పతకం నూ సద్వినియోగంచేసుకోవాలి అని కోవాలని కోరారు.

బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన చల్లా

హన్మకొండ ప్రతినిధి :(సింగిడి)

నవంబర్ 20పరకాల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు దగ్గు రాజేశ్వర్ రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చక్రపాణి దంపతులకు ఘనంగా కళాపోషక సన్మానం

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 20 (సింగిడి):

తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి దంపతులను ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ.ఈనెల 3వ తేదీన సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ వారి మొదటి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన "జానపద జాతర" కళా మహోత్సవ కార్యక్రమం విజయవంతం కావడానికి ఆర్థికంగా హార్థికంగా సహాయ సహకారాలు అందించి తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ కళాకారులను ప్రోత్సహించినందుకు మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి దంపతులను ఘనంగా సన్మానించుకోవడం జరిగింది అన్నారు.అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి దంపతులు మాట్లాడుతూ.ఇంత గొప్ప కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించే అవకాశం మాకు లభించడం అదేవిధంగా మా యొక్క కృషిని గుర్తించి ఇంత మంది గొప్ప కళాకారుల చేత సన్మానాన్ని స్వీకరించడం నిజంగా మాకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నామని అన్నారు..తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆశయాలకు అనుగుణంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు నాయకత్వంలో మేము మా బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులము ఎప్పుడు కళాకారులను కళా రంగాన్ని ప్రోత్సహిస్తూ ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షులు పత్తిపాటి రమణాకర్ , ప్రధాన కార్యదర్శి ఎండి సత్తార్, ఉపాధ్యక్షులు కళాంజలి రాజేష్ , కోశాధికారి గజ్వేల్ వేణు,సలహాదారులు దరువు అంజన్న , ప్రముఖ కవులు కళాకారులు కోదారి శ్రీనివాస్ ఆకునూరి దేవరాజు , మల్లిక్ తేజ చీకోటి నరసింహులు. శ్రీధర్ రెడ్డి నక్క శ్రీకాంత్ మొదలగు కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

పద్మశాలి సమాజానికి ఆడెపు ఉపేందర్ విశేష సేవలు

హనుమకొండ ప్రతినిధి నవంబర్ 20(సింగిడి)

స్వాతంత్ర ఉద్యమకారుడు,మాజీ ఆప్కో డైరెక్టర్ ఆడెపు ఉపేందర్ పద్మశాలి సమాజానికి విశేష సేవలు అందించారని, ఆయన సేవలను పద్మశాలి సమాజం, చేనేత కార్మికులు మరిచిపోరని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కమలాపూర్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు బొప్ప శివశంకర్ వ్యాఖ్యానించారు. శుక్రవారం కమలాపూర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్లో కమలాపూర్ మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆడెపు ఉపేందర్ సంతాప సభకు పద్మశాలి కులస్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆడెపు ఉపేందర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించి ఆయన చేసిన సేవలను స్మరించుకొని కొనియాడారు. మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం జాన్సీ రాణి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,టిపిపి ఎస్ రాష్ట్ర కార్యదర్శి తవుటం రవీందర్, కమలాపూర్ పట్టణ పద్మశాలి యూత్ కమిటీ అధ్యక్షులు ఆడెపు శ్రీకాంత్, నాయకులు తుమ్మ శోభన్ బాబు,ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు మల్లికార్జున్, దాశి శంకరయ్య,తుమ్మ సదానందం,రమేష్, కుటుంబ సభ్యులు హాజరయ్యారు .

గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలు

ఉమ్మడి నల్గొండ బ్యూరో నవంబర్ 20 (సింగిడి)

భువనగిరి పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం నాడు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తీ ఆధ్వర్యంలో జరిగిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, విద్యార్థులు, యువతలో పఠనాసక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో చదివే అలవాటును పెంపొందించేందుకు గ్రంథాలయ వారోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పండుగ వాతావరణం లో వారం రోజులపాటు ఘనంగా జరిపారని చైర్మన్ అవేజ్ చిస్తీని ఎమ్మెల్యే అభినందించారుగ్రంథాలయ అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని ఎల్లప్పుడు అందిస్తానని తెలిపారు. గ్రంథాలయంలో ఫర్నిచర్ కొరత ఉందని గ్రంథాలయ చైర్మన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. పాలకవర్గం పట్టణంలో దాతల సహకారం తీసుకుని గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని దాతలు సైతం ముందుకు రావాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే సూచన మేరకు వ్యాపారవేత్త దిడ్డి కాడి నర్సింగ్ రావు ముదిరాజ్ 25 వేల రూపాయల ను ప్రకటించారు. వెంటనే ఎమ్మెల్యే నర్సింగ్ రావు ను అభినందించి శాలువతో సత్కరించారు. చైర్మన్ అవేజ్ చిస్తీ, మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోతనక్ ప్రమోద్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకట్ లు నర్సింగ్ రావును అభినందించారు.

ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం నమోదు కేంద్రాలు ప్రారంభం

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 20 (సింగిడి):

ఇంద్రమ్మ కుటుంబ భీమా పథకం నమోదు కేంద్రం ప్రారంభం ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ.రేషన్ కార్డు కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశం తో ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభించారు అన్నారు.గత ప్రభుత్వంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు. ప్రభుత్వంలో రైతు బీమా, నేతన్న బీమా, గీత కార్మికుల భీమా వంటి వివిధ ప్రభుత్వ బీమా పథకాలు ప్రారంభించి ఆపద సమయంలో ఆయా కుటుంబాలకు అండగా నిలవడం అన్నారు.అయితే ఈ సంపత్సరం రైతు బీమా వంటి పథకాలకు ప్రీమియం చెల్లించలేదని అదేవిధంగా నేతన్న బీమా పథకం కూడా కొనసాగట్లేదని తెలుస్తుంది రాష్ట్రంలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఒక సిరిసిల్ల లోనే దాదాపు 30 మంది నేత కార్మికులు మరణించడం జరిగింది .వారికి నేతన్న బీమా పథకం ద్వారా కానీ ప్రభుత్వం ద్వారా కానీ ఎలాంటి సహకారం అందలేదు కాబట్టి వారికి వెంటనే నేతన్న బీమా పథకం కింద ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అదే విధంగా కెసిఆర్ ప్రవేశపెట్టిన



రైతన్న బీమా వంటి మొదలగు సంక్షేమ భీమా పథకాలను యధావిధిగా కొనసాగించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు..ఈ ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ద్వారా కుటుంబాన్ని పోషించే పెద్దకు మరణం సంభవించినట్లయితే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఈ పథకం ఉపయోగపడుతుందని రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హత కలిగి ఉంటుందని ఆ కుటుంబ సభ్యులను నామినీగా ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు..అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అందుకుగాను మున్సిపల్ పరిధిలోని 39 వార్డులలో సిబ్బందిని నియమించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రజల సందేహాలు తీర్చేలా ప్రత్యేక ఇందిరమ్మ కుటుంబ భీమా నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఈ ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ద్వారా కుటుంబంలో 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వయసు గల కుటుంబ పెద్దకే కాకుండా ఆ కుటుంబానికి సంబంధించిన రేషన్ కార్డు లో నమోదైన ప్రతి ఒక్కరికి ఈ బీమా వర్తించేలా ఉంటే మరింత బాగుండేదని ఈ సందర్భంగా అన్నారు..ఈరోజు అన్ని వార్డులలో ప్రత్యేక కేంద్రాల ద్వారా ఈ పథకం ప్రారంభం కాగా లాంఛనంగా1వ, 3వ, 6వ, 9వ,23 వ వార్డులలో లాంఛనంగా మేము ప్రారంభించడం జరిగిందని అన్నారు.అనంతరం కలెక్టర్ కలిసి ఈ పథకం యొక్క నమోదు వివరాలను తెలుసుకుంటూ ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా , కౌన్సిలర్ సభ్యులు బూర బాలు , దూదం రజిని శ్రీనివాస్ , దొంతునేని కళ్యాణి అశోక్ రావు , ఆడెపు చంద్రకళ ప్రభాకర్ పుర ప్రముఖులు వివిధ వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడుతున్న నాలుగేళ్ల చిన్నారి

దాతల సాయం కోసం వేడుకోలు
గుండె, కాలేయ సమస్యలు,
న్యుమోనియాతో బాధపడుతున్న అభినవ్
వైద్యానికి రూ. 30 లక్షలు అవసరమని తెలిపిన వైద్యులుచేతులెత్తి వేడుకుంటున్న నిరుపేద తల్లిదండ్రులు

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 20 (సింగిడి):



రెక్కాడితే కానీ డొక్కాడని ఓ నిరుపేద కుటుంబంపై విధి కన్నెర్ర చేసింది. బుడిబుడి అడుగులు వేస్తూ ఇంట్లో ఆడుతూ పాడుతూ తిరగాల్సిన నాలుగేళ్ల చిన్నారి తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రి మంచంపై ప్రాణాలతో పోరాడుతున్నాడు. బిడ్డ వైద్యానికి రూ. 30 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఆ తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అసలేం జరిగింది?పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జీడీనగర్ గ్రామానికి చెందిన సంపంగి సమ్మయ్య, మౌనిక దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు అభినవ్ (4) ఉన్నాడు. సమ్మయ్య డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్దిరోజుల క్రితం అభినవ్ అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు బాలుడికి డెంగీ పాజిటివ్‌తో పాటు కాలేయ సంబంధిత సమస్య, గుండెపోటు, న్యుమోనియా సోకినట్లు నిర్ధారించారు. రూ. 30 లక్షల ఖర్చు.. నిరుపేద కుటుంబంలో ఆందోళన ప్రస్తుతం చిన్నారి హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నాడు. అభినవ్ ప్రాణాలు కాపాడేందుకు మరిన్ని కీలక వైద్య పరీక్షలు, ప్రత్యేక చికిత్స అందించాల్సి ఉందని, ఇందుకు సుమారు రూ. 30 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. రోజువారీ కూలీ పని చేస్తేనే పూట గడిచే తమకు అంత పెద్ద మొత్తంలో డబ్బు సమకూర్చడం అసాధ్యమని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. దాతలకు తల్లిదండ్రుల విజ్ఞప్తిప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న తమ ఒక్కగానొక్క కుమారుడిని కాపాడుకునేందుకు దయార్ద్ర హృదయులు, దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించాలని సమ్మయ్య, మౌనిక చేతులెత్తి వేడుకుంటున్నారు. తమ బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని కోరుతున్నారు. సాయం అందించే వారు ఫోన్ నంబర్: 77022 29131 ఫోన్‌పే (PhonePe), గూగుల్ పే (Google Pay) ద్వారా గాని ఆర్థిక సాయం అందించాలని వారు వేడుకుంటున్నారు.

కళాశాలకు టీఆర్ఎస్ అధినేత కవిత చేయూత!

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 20 (సింగిడి):

ఎల్లారెడ్డిపేట గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. శాతవాహన యూనివర్సిటీకి చెల్లించాల్సిన ఫీజు బకాయిలు చెల్లించలేని పరిస్థితి నెలకొనడంతో కళాశాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయాన్ని గుర్తించిన కళాశాల పరిరక్షణ సభ్యుడు రంజిత్ సమస్య పరిష్కారం కోసం టిఆర్ఎస్ సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ మజీద్ దృష్టికి తీసుకెళ్లారు.మజీద్ ఈ సమస్య తీవ్రతను టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిరక్షణకు తనవంతు సహకారం అందించేందుకు ముందుకొచ్చారు. శాతవాహన యూనివర్సిటీకి చెల్లించాల్సిన



రూ.1,30,800 మొత్తాన్ని చెల్లించి కళాశాలకు అందగా నిలిచారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా కళాశాల మనుగడకు ఇబ్బందులు ఎదురవుతున్న తరుణంలో ఎమ్మెల్సీ కవిత స్పందించి ఆర్థిక సహాయం అందించడం పట్ల కళాశాల పరిరక్షణ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందించే ప్రభుత్వ కళాశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. సమయానికి అందిన ఈ ఆర్థిక సహాయం కళాశాలకు ఊరటనివ్వడమే కాకుండా విద్యార్థుల చదువులకు భరోసానిచ్చింది. కళాశాలను కాపాడుకోవడానికి ముందుకు వచ్చి రుసుమును చెల్లించిన టిఆర్ఎస్ అధినేత కవితకు కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతీ పనికి గడువు విధించి.. వేగంగా పూర్తి చేయాలి

వీటీఏడీఏ వైస్ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్
రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, బద్ది పోచమ్మ, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 20 (సింగిడి):

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో ప్రతి దానికి గడువు విధించి.వేగంగా పూర్తి చేయాలని వీటీఏడీఏ వైస్ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వేములవాడ పట్టణంలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ వీటీఏడీఏ ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులపై వీటీఏడీఏ వైస్ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి శుక్రవారం ఆర్ అండ్ బీ, దేవాదాయ శాఖ, ఎన్ పీ డీ సీ ఎల్, వేములవాడ మున్సిపల్ అధికారులతో ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా ప్రతి పనికి సంబంధించి ప్రత్యేకంగా కూలీల సంఖ్య పెంచాలని, పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ అధికారులు నిత్యం అభివృద్ధి పనులను పరిశీలిస్తూ.వేగంగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. రాజన్న ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనుల్లో మిగతావి ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో దేవాదాయ శాఖ ధార్మిక సలహాదారు గోవింద హరి, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లో రెచ్చిపోతున్న భూకబ్జాదారులు!

మహిళ ఇంటిపై బుల్డోజర్
నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేత!
అధికారులతో కుమ్మక్కై తన ఇంటిని కూల్చివేయించారని బాధితురాలి ఆరోపణ
న్యాయం చేయాలని వేడుకోలు!

వరంగల్ క్రైమ్ రిపోర్టర్ :ప్రతినిధి (సింగిడి)

నవంబర్ 20వరంగల్ నగరంలో భూముల విలువ పెరుగుతుండటంతో భూకబ్జాదారుల ఆగడాలు పెరిగిపోతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విలువైన భూములపై కన్నేస్తున్న కొందరు వ్యక్తులు సామాన్యుల ఆస్తులను దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా న్యూ శాయంపేట రైల్వే గేట్ సమీపంలో చోటుచేసుకున్న ఓ మహిళ ఇంటి కూల్చివేత ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన స్థలంలో నిర్మించుకున్న తన ఇంటిని ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది శుక్రవారం ఉదయం కూల్చివేశారని బాధితురాలు కన్నీరుమున్నీరవుతోంది. కనీసం తనకు సమాచారం ఇవ్వకుండా, తన వాదన వినకుండా ఇంటిని నేలమట్టం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తోంది.గతంలో తమ కుటుంబానికి ఎకరం భూమి ఉండేదని, తన తండ్రి కొంత భూమిని విక్రయించగా మిగిలిన స్థలంలో సుమారు 133 గజాల మేర ఇల్లు



నిర్మించుకుని నివసిస్తున్నట్లు బాధితురాలు తెలిపింది. ఎన్నో ఏళ్లుగా తనకు ఆధారంగా ఉన్న ఇంటిని ఒక్కసారిగా కూల్చివేయడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేసింది.అధికారులతో కుమ్మక్కై ఇంటిని కూల్చివేశారా?తన పక్కనే ఉన్న కొందరు వ్యక్తులు విలువైన స్థలాన్ని దక్కించుకోవాలనే ఉద్దేశంతో అధికారులతో కుమ్మక్కై తన ఇంటిని కూల్చివేయించారని బాధితురాలు ఆరోపిస్తోంది. తనకు సంబంధించిన భూమి పత్రాలు ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించకుండా కూల్చివేతకు ఎలా పాల్పడ్డారని నిలదీస్తోంది. స్థానికులు సైతం ఆ స్థలం తనదేనని చెబుతున్నప్పటికీ, కొందరు అధికారులు ఇతరులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తోంది.నోటీసులు ఇవ్వకుండా కూల్చివేత ఎలా?ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న తన ఇంటిని కూల్చివేయడానికి ముందు కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదని బాధితురాలు వాపోతోంది. తనకు వివరణ ఇచ్చే అవకాశం కూడా కల్పించకుండా ఇలాంటి చర్యలకు పాల్పడటం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తోంది. అసలు ఎవరి ఆదేశాలతో కూల్చివేత చేపట్టారు? ఏ ఆధారాలతో తన ఇంటిని నేలమట్టం చేశారు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తోంది.కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి!ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని బాధితురాలు కోరుతోంది. తన స్థలానికి సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, కూల్చివేతకు సంబంధించిన పూర్తి వివరాలను బయటపెట్టాలని విజ్ఞప్తి చేస్తోంది. కూల్చివేతకు బాధ్యులైన అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది.భూముల విలువ పెరిగిందని సామాన్య మహి



రంగపేటలో 'ఇందిరమ్మ' బీమా పథకం ప్రారంభం

మానకొండూర్, నవంబర్20(సింగిడి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని రంగపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ కొత్త రాంరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేల్పుల కొమురయ్య, వార్డు సభ్యులు రుద్రారం లచ్చయ్య, శ్రీకాంత్ రెడ్డి, గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడాల మహేందర్ గౌడ్, నాయకులు నాగిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



కామారెడ్డి ప్రతినిధి , నవంబర్ 20:(సింగిడి)

ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును ఈరోజు తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ బంగారి శంకర్, ఉపసర్పంచ్ గాయత్రి సౌందర్య సంజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మారెళ్ల భూపతి, కళ్లెం రవి ఆధ్వర్యంలో గ్రామ ప్రతినిధులు కలిసి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తిమ్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.అదేవిధంగా వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన నీటి వసతులు కల్పించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామ ప్రతినిధులు పేర్కొన్నారు.

విజ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనం అవసరం



కరీంనగర్, నవంబర్20(సింగిడి)

ఉన్నత స్థాయికి ఎదగాలంటే నిరంతర పుస్తక పఠనం అవసరమని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, పుస్తక పఠనం జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. పోటీ పరీక్షలు, వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలంగాణ వ్యవస్థక అధ్యక్షుడు ముదిగంటి సుధాకర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. శశిజాదేవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నమెంట్లో డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 20 (సింగిడి)

కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ మర్కల్ గ్రామం నందు ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి(మర్కల్) కి చెందిన విద్యార్థినులు ఈ నెల 19 వ తేదీన తెలంగాణ యూనివర్సిటీ నందు నిర్వహించిన అంతర కళాశాలల కబడ్డీ టోర్నమెంట్ లో ఉత్తమమైన ప్రతిభ చూపించి ద్వితీయ బహుమతి సాధించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణవేణి, ఫిజికల్ డైరెక్టర్ రమాదేవి తో పాటు కళాశాల అధ్యాపక బృందం విద్యార్థినులను అభినందించారు.

- రాజన్న ఆలయ అభివృద్ధి కోసం అవసరమైతే పది మెట్లు దిగడానికి కూడా సిద్ధం
- శ్రీ శ్రీ విధుశేఖర భారతి స్వామివారి సూచనలు, ఆదేశాల మేరకే పనులు చేపడుతున్నాం
- ఎవరి సొంత నిర్ణయాలకు తావులేదు
- విమర్శలకు సమాధానం చెప్పడం కాదు
- భక్తులకు వాస్తవాలను వివరించడమే మా బాధ్యత
- ఆలయ అభివృద్ధిపై కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను భక్తులు నమ్మవద్దు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మా లక్ష్యం ఆలయ అభివృద్ధి మాత్రమే





రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 20 (సింగిడి):

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధి పనులు పూర్తిగా ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగానే చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధి విషయంలో శృంగేరి పీఠాధిపతులు జగద్గురు శ్రీ శ్రీ భారతీ తీర్థ స్వామి, శ్రీ శ్రీ విధుశేఖర భారతి స్వామివారి సూచనలు, ఆదేశాల మేరకే ముందుకు సాగుతున్నామని తెలిపారు.వేములవాడ పట్టణంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ. ఆలయ అభివృద్ధి కార్యక్రమంలో ఎవరి సూచనలు, సలహాలనైనా స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే ఆలయ ప్రాచీనత, విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాశస్త్యానికి ఎలాంటి భంగం కలగకుండా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఆలయ అభివృద్ధిపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాలను భక్తులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఏవైనా అనుమానాలు ఉంటే నేరుగా అడిగి తెలుసుకోవాలని,వాటిపై పూర్తిస్థాయిలో వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.ఆలయ శిఖరం విషయంలో వస్తున్న విమర్శలపై స్పందిస్తూ.గతంలో శిలామయంగా ఉన్న శిఖరాన్ని 1970వ దశకంలో తొలగించి ఇటుకలతో నిర్మించినట్లు శృంగేరి పీఠంలో జరిగిన చర్చల సందర్భంగా వెల్లడైందన్నారు. ప్రస్తుతం పీఠాధిపతుల సూచనల మేరకు తిరిగి శిలామయ శిఖరాన్ని నిర్మించే దిశగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. కలశానికి ధాన్యవాసం,గర్భగుడిలో ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలను కూడా ఆగమ శాస్త్ర పద్ధతుల ప్రకారమే నిర్వహిస్తామని తెలిపారు.రాజన్న ఆలయ అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా యంత్రాంగం, ఆలయ అధికారులు, సలహాదారులు ఎవరూ వ్యక్తిగత నిర్ణయాలతో ముందుకు వెళ్లడం లేదని, అందరూ ఆగమ శాస్త్ర మార్గదర్శకత్వంలోనే పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. సుమారు రూ.250 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.విమర్శలకు విమర్శలతో సమాధానం చెప్పడం తమ ఉద్దేశం కాదని, వాస్తవాలను భక్తులకు వివరించడమే తమ బాధ్యతని అన్నారు.రాజన్న ఆలయ అభివృద్ధి కోసం అవసరమైతే పది మెట్లు దిగజారడానికైనా సిద్ధంగా ఉన్నామని, తమకు వ్యక్తిగత ప్రతిష్ఠ కంటే రాజన్న ఆలయ అభివృద్ధి, భక్తుల మనోభావాలే ముఖ్యమని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ శైవ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా విశేష ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని కలిగి ఉన్నది. ప్రతిరోజూ వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటూ ఉంటారు. రానున్న కాలంలో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశాన్ని, ఆలయానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన, సులభతరమైన దర్శన సదుపాయాలు కల్పించడం, ఆలయ ప్రాంగణాన్ని విస్తరించడం, భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించడం, అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం వంటి సమగ్ర లక్ష్యాలతో ఆలయ విస్తరణ మరియు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నది. ఈ కార్యక్రమాలన్నీ ఆలయ పవిత్రత, ఆగమ సంప్రదాయాలు, శాస్త్రోక్త విధివిధానాలను పరిరక్షిస్తూ నిర్వహించబడుతున్నాయి అన్నారు..బాలాలయం ఏర్పాటు భక్తులకు ప్రత్యామ్నాయ దర్శన, ఆర్జిత సేవల సౌకర్యాలు దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ భీమేశ్వర స్వామివారి ఆలయంలో ప్రధాన ఆలయంలో మాదిరిగానే భక్తులకు కోడె మొక్కులు, అభిషేకములు, అన్నపూజలు తదితర అన్ని రకాల ఆర్జిత సేవలను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ప్రధాన ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో కూడా భక్తులు తమ మొక్కులను చెల్లించుకోవడానికి, ఆర్జిత సేవలను నిర్వహించుకోవడానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించబడ్డాయి పేర్కొన్నారు.తద్వారా భక్తుల ధార్మిక విశ్వాసాలకు, సేవా సంప్రదాయాలకు ఎటువంటి అంతరాయం కలగకుండా నిరంతరాయంగా సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా భక్తుల సేవా సౌకర్యాలను కొనసాగించడం జరిగిందన్నారు.ప్రధాన ఆలయంలో శ్రీ స్వామివారికి నిర్వహించవలసిన నిత్య పూజలు, అర్చనలు, కైంకర్యాలు ఇతర ఆగమోక్త విధులు ఆలయ ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో అంతరంగికంగా, ఎటువంటి లోపం లేకుండా యథావిధిగా నిర్వహించబడుతున్నాయి.ఆలయ విస్తరణ అభివృద్ధి పనుల కారణంగా స్వామివారి నిత్యారాధనకు గానీ, ఆగమ సంప్రదాయాలకు గానీ ఎటువంటి విఘాతం కలగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతున్నది. అందువల్ల ఆలయంలో నిత్య పూజా కార్యక్రమాలకు ఆటంకం కలుగుతున్నదనే అభిప్రాయం వాస్తవ పరిస్థితులకు విరుద్ధమైనది.శృంగేరి జగద్గురువుల అనుమతి, మార్గదర్శకత్వంలో నూతన విమాన గోపుర నిర్మాణం శాస్త్రోక్త కళాపకర్షణఆలయ విస్తరణ నూతన పంచతల విమాన గోపుర నిర్మాణానికి సంబంధించి శృంగేరి శారదా పీఠాధిపతులు, జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ విధుశేఖర భారతీ తీర్థ మహాస్వామివారిని సంప్రదించి, అనుమతులు మార్గదర్శకత్వం పొందడం జరిగిందన్నారు. తెలంగాణలో దేవాలయాల అభివృద్ధి పేరుతో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం దేవాలయాలను విస్మరించిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విమర్శించారు. దేవాలయాల అభివృద్ధి విషయంలో కేసీఆర్ ప్రభుత్వం దేవుళ్లకు సైతం శఠగోపం పెట్టిందని ఘాటుగా వ్యాఖ్యానించారు.వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చిన సందర్భంగా రూ.500 కోట్ల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒక్క రూపాయి కూడా విదుదల చేయలేదని ఆరోపించారు. ఇదే విధంగా ధర్మపురి, కొండగట్టు, భద్రాచలం, బాసరతో పాటు అనేక ప్రముఖ పుణ్యక్షేత్రాల అభివృద్ధికి హామీలు ఇచ్చి వాటిని విస్మరించారని మండిపడ్డారు.కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రవ్యాప్తంగా రూ.2 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేస్తోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ రాజన్న ఆలయం, భద్రాచలం రామాలయం, కాళేశ్వరం, బాసర అమ్మవారి ఆలయాలతో పాటు గోదావరి తీరం వెంబడి ఉన్న పలు ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.హైదరాబాద్ మంచిరేవుల సమీపంలోని ఆలయంతో పాటు వివిధ ప్రాంతాల్లో దేవాలయాల పునరుద్ధరణ, అభివృద్ధి పనులు చేపడుతూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. దేవాలయాల అభివృద్ధి కేవలం నిర్మాణాలకే పరిమితం కాకుండా భక్తిభావాన్ని పెంపొందించి లోకకల్యాణానికి దోహదపడేలా ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.దేవుళ్లపై ప్రమాణాలు చేస్తూ తెలంగాణను దోచుకున్నది మీరేనని, ప్రజలకు అన్నీ తెలుసని ఘాటుగా స్పందించారు.

సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలి!

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 20:(సింగిడి)

బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు.శుక్రవారం వర్ని మండలంలోని సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల ప్రస్తుత పురోగతి, ఇప్పటి వరకు పూర్తయిన పనులు, మిగిలి ఉన్న పనుల వివరాలను



కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని, నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగానే ప్రతి పనిని చేపట్టాలని స్పష్టం చేశారు.ప్రజలకు ఉపయోగపడే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యత, సమయపాలన అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోచారం శ్రీనివాసరెడ్డి వెంట వర్ని, బాన్సువాడ గ్రామీణ మండలాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, సిద్దాపూర్ పరిసర గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



డీఎం గారూ.. మా గ్రామాలపై దయ చూపించండి!

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 20:(సింగిడి)

చలికాలంలో తెల్లవారుజామున బస్సుల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, మహిళల ఇబ్బందులను గుర్తించి ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలని గాంధారి మండలంలోని నల్లమడుగు, రామలక్ష్మణపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డీఎంను కలిసి గ్రామాల సమస్యలను వివరిస్తూ వినతి పత్రం సమర్పించారు.నల్లమడుగు, రామలక్ష్మణపల్లి రహదారి మీదుగా ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ గ్రామాలకు ఉదయం ఒక ట్రిప్పు, సాయంత్రం ఒక ట్రిప్పు మాత్రమే ఆర్టీసీ బస్సు నడుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ ప్రతినిధులు డీఎం దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా చలికాలంలో ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య బస్సు కోసం విద్యార్థులు రోడ్లపై వేచి ఉండాల్సి వస్తోందని, దీంతో చిన్నారులు చలికి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నా సరిపడా బస్సు సర్వీసులు లేకపోవడం సమస్యగా మారిందని పేర్కొన్నారు.ప్రస్తుతం నడుస్తున్న రెండు ట్రిప్పులకు అదనంగా మరో ట్రిప్పు పెంచి, ఉదయం మూడు, సాయంత్రం మూడు ట్రిప్పుల చొప్పున బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బస్సు సర్వీసులు పెరిగితే విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకోవడంతో పాటు మహిళలు, వృద్ధులు, ఇతర ప్రయాణికులకు కూడా ఎంతో సౌకర్యంగా ఉంటుందని వివరించారు.గ్రామ ప్రజల విజ్ఞప్తిపై స్పందించిన ఆర్టీసీ డీఎం, ఈ సమస్యను త్వరలోనే ఎండీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు స్పందించి అదనపు బస్సు ట్రిప్పులు ఏర్పాటు చేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు!

కామారెడ్డి,ప్రతినిధి నవంబర్ 20:(సింగిడి)

విద్యార్థులు, నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న యువతకు గ్రంథాలయాలే విజ్ఞాన కేంద్రాలని, పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా పలు నోటిఫికేషన్లు విడుదల చేస్తూ ఖాళీల భర్తీ చేపడుతోందని తెలిపారు. ఉద్యోగ సాధన లక్ష్యంగా పెట్టుకున్న యువత సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాల్లో క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.



డిజిటల్ వినోదానికి ఎక్కువ సమయం కేటాయించకుండా ఆ సమయాన్ని విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, పోటీ పరీక్షల సన్నద్ధతకు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి జిల్లాలోనే కాకుండా ప్రతి మండలంలోనూ గ్రంథాలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రూప్-1, గ్రూప్-2 తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి గ్రంథాలయ అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పన కోసం చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు. గ్రంథాలయంలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని అదనపు మౌలిక వసతుల కల్పనకు జిల్లా కలెక్టర్ నిధుల నుంచి రూ.12 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు.ప్రస్తుతం పెద్ద సంఖ్యలో విద్యార్థులు గ్రంథాలయాన్ని వినియోగించుకుంటున్నారని, 24 గంటల పాటు గ్రంథాలయ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో అదనపు వసతుల కల్పన అవసరమని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద కూడా గ్రంథాలయాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని పేర్కొన్నారు.విద్యార్థులు అందుబాటులో ఉన్న గ్రంథాలయ సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకొని పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సమర్పిస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, అదనపు కలెక్టర్ గిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ చౌదరి లక్ష్మి , పీఏసీఎస్ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ కులగణనకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

బీసీల విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, రాజకీయ ప్రాతినిధ్యానికి కేసీఆర్ ప్రభుత్వం విశేష కృషి : కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 20 (సింగిడి):

ఓబీసీ కులగణనకు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరుతూ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్లు జయంత్ యాదవ్, రజినీకాంత్ గౌడ్, మురళీకృష్ణ, చిద్విలాస్, కిరణ్, లోకేష్ తదితరులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఓబీసీ కులగణనకు బీఆర్ఎస్ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. కేటీఆర్ సంపూర్ణ మద్దతు తెలిపారు. కేటీఆర్ మాట్లాడుతూ.. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యంతో గతంలోనే కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారని గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు అవకాశాలు కల్పించడంతో పాటు రాజ్యసభ సభ్యులుగా, శాసనమండలి సభ్యులుగా, నామినేటెడ్ పదవుల్లో బీసీ, ఎంబీసీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించామని తెలిపారు. శాసనమండలి తొలి చైర్మన్‌గా కూడా బీసీ నాయకుడికి అవకాశం కల్పించామని



పేర్కొన్నారు. బీసీల్లో రాజకీయ చైతన్యం పెంచి, వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్న తపన కేసీఆర్‌కు ఉందన్నారు.బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలంటే ముందుగా కులగణన జరగడం అత్యవసరమని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై బీఆర్ఎస్ తరఫున పార్లమెంట్‌లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడి కులగణన చేపట్టాలని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ఓబీసీ కులగణన చేపడితేనే వివిధ వర్గాల జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు, ఇతర సంక్షేమ అవకాశాలు కల్పించేందుకు అవసరమైన ప్రాతిపదిక ఏర్పడుతుందని తెలిపారు.కేసీఆర్ పాలనలో బీసీలు, బహుజనుల విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి, కులవృత్తుల పరిరక్షణ, సామాజిక గౌరవానికి పెద్దపీట వేశామని కేటీఆర్ పేర్కొన్నారు. బీసీల అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అని విశ్వసించిన కేసీఆర్, ఆ వర్గాలకు ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన, రాజకీయ ప్రాధాన్యత కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. దాదాపు వెయ్యి గురుకుల విద్యాసంస్థలను విస్తరించి పేద బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తెచ్చామని వివరించారు. హైదరాబాద్‌లో వివిధ బీసీ కుల సంఘాలకు భవనాల నిర్మాణం కోసం భూములు కేటాయించి, నిధులు మంజూరు చేయడం ద్వారా వారి ఆత్మగౌరవానికి ప్రతీకలుగా సంఘ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. బీసీ విద్యార్థులకు ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు స్టడీ సర్కిళ్ల ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఉచిత శిక్షణ అందించే కార్యక్రమాలను ప్రోత్సహించామని తెలిపారు.

ఇందిరమ్మ బీమా నమోదు శిబిరాలు ప్రారంభం

కరీంనగర్, నవంబర్20(సింగిడి)

అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' నమోదు శిబి

ఐడియా అదుర్స్

▶▶ వరిగడ్డితో కోట్లు సంపాదిస్తున్న మహిళలు ▶▶ పలువురికి ఉపాధి

వరి కోత తర్వాత పొలంలో మిగిలిపోయిన గడ్డిని కొందరు పశువుల ఆహారంగా వాడుకుంటే.. మరికొందరు మాత్రం మిగిలిపోయే గడ్డిని వ్యర్థంగా భావించి పొలంలోనే తగలబెడుతుంటారు. దీనివల్ల వాయు కాలుష్యం తీవ్రంగా పెరుగుతోంది. అయితే ఈ సమస్యకు ఎలాగైనా చెక్ పెట్టాలని నిర్ణయించుకున్న హర్యానాకు చెందిన సంజన, రాజస్థాన్ కు చెందిన సోనికా అనే ఇద్దరు మహిళలు.. దాన్నే వ్యాపారంగా మలుచుకోవాలని ఆలోచించారు. ఆ వ్యవసాయ వ్యర్థాలతోనే బయోఫ్యూయల్ తయారు చేస్తూ ప్రస్తుతం ఏడాదికి రూ.7-8 కోట్ల టర్నోవర్ సాధిస్తున్నారు. అంతేకాదు తమ వ్యాపారంతో పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా స్థానిక ప్రజలకు ఉపాధి కూడా కల్పిస్తున్నారు.



హర్యానాలోని సిర్సా జిల్లా ఘోరన్వాలి గ్రామానికి చెందిన సంజన, రాజస్థాన్‌లోని భద్రా ప్రాంతానికి చెందిన సోనికా ఇద్దరూ స్నేహితులు. వీరి చదువులు పూర్తయిన తర్వాత సొంత గ్రామాలకు వచ్చిన వీరిద్దరూ.. వరి కోతల తర్వాత రైతులు గడ్డిని వేస్ట్‌గా తగలబెట్టడం ద్వారా ఏర్పడే గాలి కాలుష్యాన్ని గమనించారు. ఈ సమస్యకు చెక్ పెట్టడంతో పాటు దాన్ని వ్యాపారంగా మార్చుకోవాలని డిసైడ్ అయ్యారు. ఈ క్రమంలో వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి బయోఫ్యూయల్ తయారు చేయాలని 2024లో SSAR Biomass Green Pvt. Ltd. కంపెనీని స్టార్ట్ చేశారు.

రూ.2.5 కోట్ల పెట్టుబడితో తయారీ కేంద్రం

హర్యానాలోని ఘోరన్వాలి గ్రామంలో తమ కంపెనీని స్టార్ట్ చేయాలని సంజన, సోనికా నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇందుకోసం సుమారు రూ.2.5 కోట్ల పెట్టుబడి అవసరమని.. కేంద్ర ప్రభుత్వానికి చెందిన అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (AIF) పథకం ద్వారా ఈ పెట్టుబడిని సమకూర్చుకున్నారు. తర్వాత గడ్డిని బయో ఇంధనంగా మార్చేందుకు అవసరమైన ప్రత్యేక యంత్రాలను కొనుగోలు చేశారు.

వరి గడ్డితో బయోఫ్యూయల్ తయారీ

అన్నీ ఏర్పాటు చేసుకున్న తర్వాత స్థానిక రైతుల నుంచి వరి కోత తర్వాత పొలాల్లో మిగిలిపోయిన గడ్డిని సేకరించడం స్టార్ట్ చేశారు. బేలర్ యంత్రాల ద్వారా పొలంలోనే గడ్డిని కట్టలుగా మార్చి కంపెనీకి తరలించేవారు. అక్కడ ప్రత్యేక యంత్రాల ద్వారా ఆ గడ్డిని ప్రాసెస్ చేసి గట్టి బయోఫ్యూయల్ గుళికలుగా తయారు చేస్తారు. వీటిని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు సరఫరా చేస్తారు. అక్కడ సంప్రదాయ ఇంధనాలకు బదులుగా వీటిని ఉపయోగించి కరెంటు ఉత్పత్తి చేస్తారు. ఇప్పుడు వీరి కంపెనీ ఏడాదికి సుమారు లక్ష నుంచి 1.5 లక్షల క్వింటాళ్ల వరకు వరి వ్యర్థాలను ప్రాసెస్ చేసి బయోఫ్యూయల్‌ను తయారు చేస్తోంది.

20 మందికి పైగా ఉపాధి

వీరికి వచ్చిన ఈ ఐడియా కేవలం ఆదాయ వనరుగా మాత్రమే కాకుండా పర్యావరణానికి మేలు చేయడంతో పాటు స్థానిక ప్రజలకు ఉపాధి కూడా కల్పించింది. ప్రస్తుతం వీళ్ల కంపెనీలో స్థానిక గ్రామాలకు చెందిన 20 మంది ఉపాధి పొందుతున్నారు. మరోవైపు సిర్సా, పరిసర ప్రాంతాల్లోని బేలర్ ఆపరేటర్లు, రవాణా రంగానికి చెందిన వారికి కూడా ఈ వ్యాపారం ద్వారా ఆదాయం లభిస్తోంది. వ్యర్థంగా భావించే పంట గడ్డితోనూ కోట్ల రూపాయల వ్యాపారం చేయవచ్చని నిరూపించిన ఈ ఇద్దరు మహిళల ప్రయాణం ఇప్పుడు ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

అతివ Athiva Singidi

చుండ్రు తగ్గించుకోండి ఇలా!

చుండ్రు సమస్య తీవ్రంగా మారి బట్టలపై రాలడం, చేతితో తల తాకినప్పుడు చుండ్రు అంటుకోవడం వంటి సమస్యలు చాలామందిని వేధిస్తాయి. ఎన్ని ఉత్పత్తులు వాడినా చుండ్రు తగ్గకపోతే, సహజ సిద్ధమైన వేప నూనె ఉపయోగకరంగా ఉంటుంది.

యాంటీ-ఫంగల్ గుణాలు ఉన్న వేప నూనె చుండ్రును తగ్గించడమే కాకుండా జుట్టు పెరుగుదలకు కూడా తోడ్పడుతుంది. అయితే వేప నూనెను నేరుగా కాకుండా ఇతర పదార్థాలతో కలిపి వాడటం వల్ల మంచి ఫలితాలు లభిస్తాయి.

వేప నూనెతో కలిపి వాడదగిన సులభమైన మిశ్రమాలు

వేప నూనె – కొబ్బరి నూనె లేదా నువ్వుల నూనె: కొబ్బరి నూనె సహజ తేమను అందించి పొడిబారడాన్ని తగ్గిస్తుంది. సమాన భాగాలలో వేప నూనె, కొబ్బరి నూనె లేదా నువ్వుల నూనె కలిపి తల చర్మంపై మృదువుగా మసాజ్ చేయాలి. 20-30 నిమిషాల తర్వాత మైల్డ్ షాంపూతో శుభ్రం చేసుకోవాలి.

వేప నూనె – టీ ట్రీ ఆయిల్: టీ ట్రీ ఆయిల్ ఒక ఎసెన్షియల్ ఆయిల్; దీనిని ఎప్పుడూ నేరుగా రాయకూడదు. కొబ్బరి నూనెలో వేప నూనెతో పాటు కొన్ని చుక్కల టీ ట్రీ ఆయిల్ కలిపి మసాజ్ చేసి, 20-30 నిమిషాల తర్వాత మైల్డ్ షాంపూతో కడగాలి.

వేప నూనె – చిక్కటి పెరుగు: ప్రోబయోటిక్ గుణాలున్న పెరుగు, యాంటీ-ఫంగల్ వేప నూనెతో కలిసి చుండ్రు తగ్గించడంలో సహాయపడుతుంది. చిక్కటి పెరుగులో కొన్ని చుక్కల వేప నూనె కలిపి తలకు పట్టించి, షవర్ క్యాప్ ధరించి 30-45 నిమిషాల తర్వాత కడగాలి. వారానికి రెండుసార్లు చేయవచ్చు.

వేప నూనె – నిమ్మరసం, ఆలివ్ నూనె: విటమిన్ సి ఉన్న నిమ్మరసం తల చర్మం పీహెచ్ సమతుల్యతకు సహాయపడుతుంది. ఒక టీస్పూన్ పలుచన చేసిన నిమ్మరసం, కొన్ని చుక్కల వేప నూనె, తగినంత ఆలివ్ నూనె కలిపి మసాజ్ చేసి, 20-30 నిమిషాల తర్వాత రసాయనాలు లేని షాంపూతో కడగాలి.

వేప నూనె – కలబంద గుజ్జు: రెండు టీస్పూన్ల కలబంద గుజ్జులో ఒక టీస్పూన్ వేప నూనె కలిపి తలకు రాసి, 30-40 నిమిషాల తర్వాత కడగాలి. ఇది దురద, చికాకు నుంచి ఉపశమనం ఇస్తుంది.

ఈ నివారణలను క్రమం తప్పకుండా పాటించడం ద్వారా చుండ్రు సమస్య తగ్గి, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.



స్టాక్ మార్కెట్ Stock Market

బంగారం, వెండి ధరల భారీ పతనం



బంగారం, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. వరుసగా మూడో రోజు కూడా భారీగా తగ్గాయి. శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో బంగారం ధరలు ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం.. బంగారం, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. వరుసగా మూడో రోజు కూడా భారీగా తగ్గాయి. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో విలువైన లోహాల ధరలు పడిపోతున్నాయి. ఈ రోజు (శుక్రవారం) దేశీయ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై ఏకంగా రూ.5120 తగ్గగా.. 22 క్యారెట్ల బంగారంపై రూ.4700 మేర ధర తగ్గింది. మరోవైపు వెండి ధర కూడా భారీగా పడిపోయింది. కిలో వెండిపై ఏకంగా రూ.5,000 తగ్గింది. దీంతో కొనుగోలుదారులకు భారీ ఊరట లభించినట్లయింది గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.5120 తగ్గి రూ.1,25,570కు చేరింది (Gold Rate Today). అలాగే ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.4700 తగ్గి రూ.1,15,100 వద్దకు దిగివచ్చింది. బంగారంతో పాటు వెండి ధర కూడా భారీగా తగ్గింది. కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.1.75 లక్షలకు చేరింది. గమనిక: బంగారం, వెండి ధరలు ఎప్పటి కప్పుడు మారుతుంటాయి. కాబట్టి కొనుగోలుదారులు మరోసారి ధరలను చెక్ చేసుకోవలసిందిగా సూచన.

కుప్పకూలిన గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లు..

అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు అంచనాలు, 19 నెలల గరిష్టానికి చేరిన డాలర్, రూపాయి బలపడటంతో దేశీయ మార్కెట్లో సిల్వర్ ఈటీఎఫ్‌లు 9 శాతం వరకు, గోల్డ్ ఈటీఎఫ్‌లు 6 శాతం వరకు పతనమయ్యాయి. వెండి ధరలు మరింత తగ్గే అవకాశం ఉన్నందున, ఒకేసారి కాకుండా ధరలు స్థిరపడే వరకు వేచి చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లో గోల్డ్, సిల్వర్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ETFs) ఇన్వెస్టర్లకు భారీ షాక్ తగిలింది. ఉదయం మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్ (MCX)లో ధరలు కాస్త సానుకూలంగానే ప్రారంభమైనప్పటికీ, అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలతో ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఫలితంగా సిల్వర్ ఈటీఎఫ్‌లు ఏకంగా 9 శాతం వరకు, గోల్డ్ ఈటీఎఫ్‌లు 6 శాతం వరకు కుప్పకూలాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ డిసెంబర్‌లో వడ్డీ రేట్లు పెంచుతుందనే అంచనాలు, 19 నెలల గరిష్టానికి చేరిన డాలర్ విలువ, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల వల్ల పెరుగుతున్న చమురు ధరలు బులియన్ మార్కెట్‌ను కుదిపేశాయి.

ప్రపంచంలో 5వ అతిపెద్ద స్టాక్ ఎక్స్చేంజ్‌గా NSE

అంతర్జాతీయ స్థాయిలో ఎన్ ఎస్ ఈ సత్తా చాటింది. నాస్ డాక్, హాంకాంగ్ ఎక్స్చేంజీలను అధిగమించి ప్రపంచంలోనే 5వ అతిపెద్ద లిస్టెడ్ స్టాక్ ఎక్స్చేంజ్ గా రికార్డు సృష్టించింది. నాస్ డాక్, హాంకాంగ్ ను అధిగమించి ప్రపంచంలో 5వ అతిపెద్ద స్టాక్ ఎక్స్చేంజ్ గా మన NSE



భారతదేశపు అతిపెద్ద స్టాక్ ఎక్స్చేంజ్ ఆపరేటర్ నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (NSE) అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త చరిత్ర సృష్టించింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) పరంగా అమెరికాకు చెందిన దిగ్గజ టెక్ ఎక్స్చేంజ్ నాస్‌డాక్ (Nasdaq), హాంకాంగ్ ఎక్స్చేంజీలను (HKEX) వెనక్కి నెట్టి ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద లిస్టెడ్ స్టాక్ ఎక్స్చేంజ్ ఆపరేటర్ గా అవతరించింది. నవంబర్ 20, 2026 నాటి గణాంకాల ప్రకారం ఎన్ఎస్ఈ సాధించిన ఈ అరుదైన ఘనత విశేషాలు:

మార్కెట్ విలువ & షేర్ల జోరు

59.3 బిలియన్ డాలర్ల విలువ: ప్రస్తుతం ఎన్ఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు 59.3 బిలియన్ డాలర్లకు (రూ. 5.5 లక్షల కోట్లు) చేరుకుంది. ఇది నాస్‌డాక్ ($57.7 బిలియన్లు), హాంకాంగ్ ఎక్స్చేంజీల ($57.7 బిలియన్లు) కంటే సుమారు 1.6 బిలియన్ డాలర్లు ఎక్కువ.

ఐపీఓ తర్వాత 25శాతం లాభం: సెప్టెంబర్‌లో ఎన్ఎస్ఈ ఐపీఓ ఇష్యూ ధర రూ. 1,785 కాగా, శుక్రవారం (నవంబర్ 20) మధ్యాహ్నం ట్రేడింగ్‌లో దీని షేరు ధర 1.5% పెరిగి రూ. 2,222 వద్ద ట్రేడవుతోంది. అంటే లిస్టింగ్ అయిన రెండు నెలల లోపే ఇష్యూ ధర కంటే దాదాపు 24.5% (సుమారు రూ. 1.1 లక్షల కోట్ల సంపద వృద్ధి) లాభపడింది.

ప్రస్తుతం నాలుగవ స్థానంలో ఉన్న లండన్ స్టాక్ ఎక్స్చేంజ్ గ్రూప్‌కు ($60.1 బిలియన్లు), ఎన్ఎస్ఈకి మధ్య కేవలం 800 మిలియన్ డాలర్ల తేడా మాత్రమే ఉండటం విశేషం. ఇదే జోరు కొనసాగితే ఎన్ఎస్ఈ త్వరలోనే నాలుగవ స్థానానికి ఎగబాకే అవకాశం ఉంది.

ప్రపంచంలోనే అతిపెద్ద లిస్టెడ్ స్టాక్ ఎక్స్చేంజ్ ఆపరేటర్లు (టాప్-7): (నవంబర్ 20, 2026 నాటి మార్కెట్ క్యాప్ ప్రకారం)

1. సీఎంఈ గ్రూప్ (CME Group) $109.6 బిలియన్లు
2. ఇంటర్‌కాంటినెంటల్ ఎక్స్చేంజ్ (NYSE) $95.5 బిలియన్లు
3. డాయిష్ బోర్స్ (Deutsche Boerse - జర్మనీ) $63.7 బిలియన్లు
4. లండన్ స్టాక్ ఎక్స్చేంజ్ గ్రూప్ (LSEG) $60.1 బిలియన్లు
5. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ ఆఫ్ ఇండియా (NSE) $59.3 బిలియన్లు
6. హాంకాంగ్ ఎక్స్చేంజీలు & క్లియరింగ్ (HKEX) $57.7 బిలియన్లు
7. నాస్‌డాక్ (Nasdaq) $57.7 బిలియన్లు

2024లో వచ్చిన హ్యుందాయ్ మోటార్ ఇండియా (రూ. 27,870 కోట్లు) తర్వాత, భారతదేశంలో వచ్చిన రెండవ అతిపెద్ద ఐపీఓగా ఎన్ఎస్ఈ నిలిచింది.

2 ట్రిలియన్ డాలర్లకు చేరిన ఆంథ్రోపిక్

ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ (Anthropic) అమెరికా స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టిన తొలిరోజే అదరగొట్టింది. నాస్‌డాక్ (Nasdaq) స్టాక్ ఎక్స్చేంజ్‌లో లిస్టింగ్ అయిన వెంటనే కంపెనీ షేర్లు భారీగా పుంజుకున్నాయి.

ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ (Anthropic) అమెరికా స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టిన తొలిరోజే అదరగొట్టింది. నాస్‌డాక్ (Nasdaq) స్టాక్ ఎక్స్చేంజ్‌లో లిస్టింగ్ అయిన వెంటనే కంపెనీ షేర్లు భారీగా పుంజుకున్నాయి. ప్రారంభ ట్రేడింగ్‌లో ఏకంగా 34 శాతానికి పైగా లాభపడ్డాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ కొద్దిసేపటికే 2 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఏఐ రంగంలో పెట్టుబడిదారులకు ఉన్న ఆసక్తికి ఈ పరిణామం అద్దం పడుతోంది (Anthropic IPO).

ఆంథ్రోపిక్ తన ఐపీఓ (IPO)లో ఒక్కో షేరు ధరను 83 డాలర్లుగా నిర్ణయించింది. అయితే నాస్‌డాక్‌లో ట్రేడింగ్ ప్రారంభమైనప్పుడు ఒక్కో షేరు 111.50 డాలర్ల వద్ద నమోదైంది. అంటే ఐపీఓ ధరతో పోలిస్తే 34 శాతానికి పైగా పెరిగింది. అంతకుముందు కంపెనీ ఒక్కో షేరును 70 నుంచి 78 డాలర్ల మధ్య విక్రయించాలని భావించినప్పటికీ, భారీ డిమాండ్ కారణంగా చివరకు 83 డాలర్లుగా నిర్ణయించింది. ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా ఆంథ్రోపిక్ సుమారు 98 కోట్ల షేర్లను విక్రయించింది. ఒక్కో షేరును 83 డాలర్ల చొప్పున విక్రయించడం ద్వారా సుమారు 81 బిలియన్ డాలర్ల నిధులను సమీకరించింది

ఈ భారీ ఐపీఓతో గతంలో స్పేస్‌ఎక్స్ నెలకొల్పిన రికార్డును ఆంథ్రోపిక్ అధిగమించింది (Anthropic Valuation). ఆంథ్రోపిక్ సంస్థను 2021లో ఓపెన్‌ఏఐ నుంచి బయటకు వచ్చిన కొందరు పరిశోధకులు స్థాపించారు. దారియో అమోడెయ్, డేనియెలా అమోడెయ్ ఈ సంస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సంస్థ అభివృద్ధి చేసిన క్లాడ్ (Claude) ఏఐ అసిస్టెంట్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, పరిశోధన, వ్యాపార కార్యకలాపాల్లో క్లాడ్ వినియోగం పెరుగుతోంది.



సమీకృత సాగు.. లాభాలు బాగు

- ఉన్నత విద్య అభ్యసించి.. వ్యవసాయాన్ని ఉపాధిగా ఎంచుకున్న మల్లయ్య
- అభినందించిన కలెక్టర్..



సూర్యాపేట జిల్లా ప్రతినిధి (సింగిడి):
పరిమిత భూమిలో సమీకృత వ్యవసాయం చేపడుతూ బహుళ ఆదాయ మార్గాలను సృష్టించుకుంటున్న రైతు పిల్లలమర్రి మల్లయ్యను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అభినందించారు. నూతనకల్ మండలం చిన్ననేమిల గ్రామానికి చెందిన మల్లయ్య తనకున్న ఎకరంన్నర భూమిలో వినూత్న వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. శుక్రవారం కలెక్టర్ ఆయన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి సమీకృత వ్యవసాయ విధానాలను పరిశీలించారు.ఒకే పంటపై ఆధారపడకుండా ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటలుగా జామ, మునగ, బంతిపూల సాగుతో పాటు నాటుకోళ్ల పెంపకం చేపడుతున్న విధానాన్ని కలెక్టర్ ఆసక్తిగా పరిశీలించారు. పరిమిత భూమిలో విభిన్న వ్యవసాయ కార్యకలాపాలు చేపడుతూ ఆదాయ మార్గాలను పెంపొందించుకుంటున్న మల్లయ్యను అభినందించారు. వివిధ పంటల సాగులో లాభనష్టాలు, మార్కెటింగ్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడి ఎదురవుతున్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా కూరగాయలు, పూలు, ఇతర ఆరుతడి పంటలు సాగుచేసి అధిక ఆదాయం పొందేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందుబాటులో ఉన్న రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.మల్లయ్య వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వం అందించిన బిందు సేద్యం పరికరాల పని తీరును, పంటల రక్షణ కోసం ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్ వ్యవస్థను కలెక్టర్ పరిశీలించారు. నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ పంటలు సాగుచేస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు.ఉన్నత విద్య అభ్యసించినప్పటికీ ఉద్యోగం రాలేదని నిరుత్సాహపడకుండా వ్యవసాయాన్నే ఉపాధి మార్గంగా ఎంచుకున్న మల్లయ్య యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి భూమిని సమర్థంగా వినియోగించుకుంటూ సమీకృత వ్యవసాయం ద్వారా ఆదాయం పెంచుకోవచ్చని అన్నారు. ప్రణాళికాబద్ధంగా విభిన్న పంటలు, అనుబంధ రంగాలను ఎంచుకుంటే మెరుగైన ఆర్థిక అవకాశాలు ఉంటాయని, ఇతర రైతులు కూడా మల్లయ్య అనుసరిస్తున్న విధానాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, తుంగతుర్తి డివిజన్ ఉద్యాన అధికారిణి ప్రమిత, మండల వ్యవసాయ అధికారి సైదా నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి జానయ్య, ఉద్యాన విస్తరణ అధికారి రాము తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు ఆసరా..!

- అనంతగిరి మండలంలోని దొడ్డి దారిని సదరం సర్టిఫికెట్లు.. పెన్షన్లు కూడా జారీ?
- దొడ్డిదారిన ధ్రువీకరణ పత్రాలు పొందారంటూ ఆరోపణలు
- ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలనలో అధికారుల వైఫల్యమా?
- క్షేత్రస్థాయి విచారణలోనూ గుర్తించలేదా?



సూర్యాపేట జిల్లా ప్రతినిధి (సింగిడి):
అర్హత ఉన్నవారికి ఆసరా అందించాల్సిన సంక్షేమ పథకం.. అనర్హులకు వరంగా మారుతోందా? దివ్యాంగులుగా అర్హత నిర్ధారించే సదరం ధ్రువీకరణ పత్రాల జారీ నుంచి పెన్షన్ల మంజూరు వరకు అధికారుల పర్యవేక్షణ ఏమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అనంతగిరి మండలంలో అనర్హులు దొడ్డిదారిన సదరం సర్టిఫికెట్లు పొందడంతోపాటు, వాటి ఆధారంగా పెన్షన్లు సైతం మంజూరు చేయించుకున్నారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలోనే కాకుండా క్షేత్రస్థాయి విచారణలోనూ అర్హతలను గుర్తించలేకపోయారా? ప్రభుత్వ నిధులు అనర్హుల చేతుల్లోకి వెళ్లే వరకు అధికారులు ఏం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.పరిశీలన చేసినట్లేనా.. అర్హత గుర్తించినట్లేనా?సదరం సర్టిఫికెట్ల ఆధారంగా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్న అనంతరం మండల కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయింది. అధికారులు దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన తర్వాతే పెన్షన్ మంజూరు చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు అనర్హులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి పెన్షన్లు ఎలా మంజూరయ్యాయి? ఆన్‌లైన్ సమయంలోనే అర్హతలను పరిశీలించలేదా? క్షేత్రస్థాయి విచారణలోనూ గుర్తించలేదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.20 గ్రామాల్లోనూ తనిఖీలు చేయాలిమండలంలో 20 గ్రామాలలో అక్రమ పెన్షన్ల వ్యవహారం చర్చనీయాంశమైంది. నిజమైన దివ్యాంగులు పెన్షన్ల కోసం ఎదురుచూస్తుంటే అనర్హులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. మండల వ్యాప్తంగా పెన్షన్ లబ్ధిదారుల అర్హతలను మరోసారి పరిశీలించి, అక్రమాలకు పాల్పడిన వారితోపాటు బాధ్యులైన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం: ఎంపీడీవో సుష్మ..పూర్తిస్థాయిలో మండల వ్యాప్తంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరుపుతాం. అనర్హులకు పెన్షన్ మంజూరైతే చర్యలు తీసుకుంటాం.. నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం...

ఫుట్‌బాల్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా ప్రశాంత్ గౌడ్



గద్వాల ప్రతినిధి నవంబర్ 20 (సింగిడి):
ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర పురుషుల జట్టుకు జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన పి. ప్రశాంత్ గౌడ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. ఈయన ప్రస్తుతం జోగులాంబ గద్వాల జిల్లా డీసీఎస్ఓ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు.గోవా నగరంలో ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగుల జట్లు పాల్గొంటున్నాయి. తెలంగాణ రాష్ట్రం తరఫున బరిలోకి దిగుతున్న పురుషుల ఫుట్‌బాల్ జట్టుకు గద్వాల ఫుట్‌బాల్ అసోసియేషన్ క్రీడాకారుడైన ప్రశాంత్ గౌడ్ వైస్ కెప్టెన్‌గా ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ప్రభుత్వ విధులు నిర్వహిస్తూనే క్రీడలపై ఆసక్తితో జాతీయ స్థాయికి ఎదిగి రాష్ట్ర జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎంపిక కావడం పట్ల పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా అయిజ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ శాఖ ఉద్యోగులు, రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తూ ప్రశాంత్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు విజయం సాధించాలని ఆకాంక్షించారు.

కుటుంబ కథా చిత్రం 'నేనూ నా లల్లీ '



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 20 (సింగిడి):
కుటుంబ విలువలు, మానవ సంబంధాలు, స్వచ్ఛ రాజకీయాలు ప్రధాన ఇతివృత్తంగా 'నేనూ నా లల్లీ' సినిమాను నిర్మించినట్లు ఆ చిత్ర నిర్మాత, హీరో, దర్శకులు ఎన్ఎన్ఆర్ చౌదరి పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చిత్రం డిశెంబర్ 11న థియేటర్లలో విడుదల కానుందని, ప్రేక్షక దేవుళ్లు ఆదరించాలని కోరారు. తప్పకుండా చిత్రం ఘన విజయంసాధిస్తుందని తెలిపారు. ఇప్పటికే తాను రెండు చిత్రాలు నిర్మించానని, ఇది మూడో చిత్రమని తెలిపారు. ఓ సాధారణ రైతు కుటుంబం నుండి వచ్చిన తాను సినిమాపై ఫ్యాషన్‌తో హైదరాబాద్ వెళ్లినట్లు తెలిపారు. ఇన్‌స్టిట్యూట్‌లో సినిమా కోర్సు చేశానని తెలిపారు. తక్కువ బడ్జెట్‌తో రూపొందించినా సినిమా రష్ మాత్రం క్లాస్టీగా, నైపుణ్యంగా వచ్చిందన్నారు. చిత్రంలో పాటలు అందరినీ ఆకట్టుకుంటాయని, సంగీత దర్శకుడు మంచి ట్యూన్స్ ఇచ్చారని తెలిపారు. డైలాగులు బాగున్నాయని, సినిమాటోగ్రఫీ అద్భుతంగా వచ్చిందని తెలిపారు. తప్పకుండా ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. అందరూ ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. అనంతరం సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించి, ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు తాతా శ్రీనివాసరావు, ఏపూరి లక్ష్మీనారాయణ, పురుషోత్తం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉర్సు మహోత్సవం వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ఇల్లందు, నవంబర్20 (సింగిడి):
సత్యనారాయణపురం హజరత్ నాగుల్ మీరా దర్గా చంద్ మౌలానా దర్గా షరీఫ్ లో వచ్చేనెల డిసెంబర్ 7, 8 తేది లో నిర్వహించే 24వ ఉర్స్ మహోత్సవాలకు సంబంధించిన వాల్పోస్టర్ను ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం దర్గా ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లందు నియోజకవర్గ ప్రజలతో పాటు ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో వర్ధిల్లే విధంగా నాగుల మీద ఆశీస్సులు ఎప్పుడూ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరారు. ఇదిలా ఉండగా డిసెంబర్లో నిర్వహించే ఉర్స్ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు 7వ తేదీన నెంబర్-2 బస్తీలోని హజరత్ ఖాసిం దూల దర్గా నుండి సంసల్(గంధం) బయలుదేరి సత్యనారాయణపురం నాగుల్ మీరా దర్గాకు చేరుతుంది. 8వ తేదీ ఉదయం నెంబర్ 2 బస్తీ దర్గా నుండి నిషానిలు ఊరేగింపుగా, డప్పు వాయిద్యాల నడుమ భారీ ఊరేగింపుగా నాగుల్ మీరా దర్గాకు చేరుతుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉర్సు ఉత్సాహ కమిటీ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసేటందుకు నిమగ్నం అవుతున్నారు. ఇది ఇలా ఉండగా దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పోస్ట్ ఆవిష్కరణ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్, తహసిల్దార్, కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం..

- 13 పాఠశాలల్లో రూ.1.95 లక్షలతో గ్రంథాలయాల ఏర్పాటు..
- వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం..



నాగర్ కర్నూల్, నవంబర్ 20 (సింగిడి):
జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని, నూతన గ్రంథాలయాల ఏర్పాటు, ఉన్న గ్రంథాలయాల డిజిటలైజేషన్‌కు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్ తెలిపారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.
శుక్రవారం 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేందర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 13 పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు రూ.15 వేల చొప్పున మొత్తం రూ.1.95 లక్షల వ్యయంతో గ్రంథాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రంథాలయం అంటే కేవలం పుస్తకాలను భద్రపరిచే ప్రదేశం మాత్రమే కాదని, విజ్ఞానాన్ని అందించే కేంద్రాలని అన్నారు. పుస్తక పఠనం మనిషి ఆలోచనా విధానాన్ని, జ్ఞానాన్ని, వ్యక్తిత్వాన్ని వికసింపజేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు సన్మార్గంలో పయనిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. ప్రతాప్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విజ్ఞాన, సాహిత్య పుస్తకాలతో పాటు మహనీయుల జీవిత చరిత్రలను చదివి తమ జ్ఞాన పరిధిని విస్తరించుకోవాలని కోరారు. పుస్తక పఠనం జీవితంలో గొప్ప మార్పునకు దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
అనంతరం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు చైర్మన్ రాజేందర్, కార్యదర్శి ప్రతాప్ బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన అతిథులు, ఉపాధ్యాయులు, విశ్రాంత గ్రంథాలయ పాలకురాళ్లు రాజ్యలక్ష్మి , సి. వెంకటరమణలను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ పాలకురాలు ఆర్. పరమేశ్వరి, ఉపాధ్యాయులు చందన, కల్పన, శ్రీనివాసులు, విశ్రాంత ఉపాధ్యాయుడు నరసింహ శర్మ, గ్రంథాలయ పాఠకులు, నిరుద్యోగులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది కర్నె వెంకటేష్, తాజోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

ఇద్దరు ఉపాధ్యాయినులు మృతి



సూర్యాపేట జిల్లా ప్రతినిధి (సింగిడి):
సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళా ఉపాధ్యాయులను ఎదురుగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటన సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోనీ మూడో వార్డు బీబీగూడెం సమీపంలో చోటుచేసుకుంది.పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వేంల మండల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న కోట్ల రజిత, అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పిల్లల జగ్గతండాకు చెందిన గుగులోతు రమ్య ఇద్దరూ ద్విచక్ర వాహనంపై చివ్వేంల గురుకుల పాఠశాల నుంచి సూర్యాపేటకు బయలుదేరారు. ఈ క్రమంలో బీబీగూడెం సమీపానికి చేరుకోగానే ఎదురుగా వేగంగా వచ్చిన ఏ మిక్స్ కంపెనీకి చెందిన టిప్పర్ లారీ వారి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టినట్లు సమాచారం.ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు చేపట్టాల్సి ఉంది.గురుకుల పాఠశాలలో విషాదం....ఒకే పాఠశాలలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయురాలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గురుకుల పాఠశాల వర్గాల్లో విషాదం నెలకొంది. విద్యాబోధనలో కీలక పాత్ర పోషిస్తున్న ఇద్దరు మహిళలు ఒకేసారి మృత్యువాత పడటంతో వారి కుటుంబ సభ్యులు, సహచర ఉపాధ్యాయులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు గ్రీన్ మ్యాట్స్ పంపిణీ



బోధన్ ప్రతినిధి, నవంబర్ 20(సింగిడి):
సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక పాఠశాల (హరిజనవాడ)లో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్ పల్లి ఆధ్వర్యంలో గ్రీన్ మ్యాట్స్ ను పంపిణీ చేశారు. పి ఆర్ టి యు మాజీ జిల్లా అధ్యక్షులు, లయన్స్ చార్టర్ ప్రెసిడెంట్ ఇళ్లేపు శంకర్ తన సొంతంగా 25 రూపాయల విలువ చేసే గ్రీన్ మ్యాట్స్ ను కొనుగోలు చేసి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలపై కూర్చుని చదువుకునే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ మ్యాట్స్ ను అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాజీ మంజుషా, గ్రామ సర్పంచ్ లావణ్య రవి, సొసైటీ చైర్మన్ అల్లే రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంటే లక్ష్మణ్, పి ఆర్ టి యు మండల అధ్యక్షులు కల్లూరి శంకర్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్ పల్లి ప్రతినిధులు దుర్గారావు, ఐ. ఆర్.చక్రవర్తి, రమణారెడ్డి, శ్రీనివాసరాజు, హరిబాబు, గ్రామ పెద్దలు కేజీ గంగారాం,సొక్కం రవి, వాహెద్, మౌలానా, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు..

అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ..



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 20 (సింగిడి) :
ఎస్ ఐఆర్ పై కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పి కొట్టడానికే బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ ఈ నెల 23న ఇందూరుకు వస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిజెపి కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, ఆయా మోర్చాల అధ్యక్షులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నితిన్ నబీన్ జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణకు ఇది రెండోసారి రావడం అన్నారు. ఇందూరుకు మొదటిసారిగా వస్తున్నారని చెప్పారు. అయితే అధికారికంగా ఒకటి రెండు రోజుల్లో చెప్పడం జరుగుతుందన్నారు. కావున ప్రతి నాయకుడు జన సమీకరణ ఎక్కువగా చేపట్టాలని సూచించారు. ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని ఇందూరు కాషాయానికి అడ్డా అని తెలిపారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. బిజెపి బలం చూపించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై ఇప్పటికే ప్రజలకు స్పష్టత వచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ పడిపోతుందని, వారి ఎమ్మెల్యేలే సీఎం రేవంత్ రెడ్డి పై చేస్తున్న ఆరోపణలు ఎందుకు ఉదాహరణ అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ జ్యోతి, కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

వర్షాభావంతో జీవనం కష్టతరం..



గద్వాల ప్రతినిధి నవంబర్ 20 (సింగిడి):
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితులతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సామాజిక కార్యకర్త శాంతకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. వ్యవసాయ పనులు లేక కూలీలు, చేతివృత్తులపై ఆధారపడిన కుటుంబాలకు ఉపాధి కరువైందన్నారు. పేద కుటుంబాలు కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో పంట నష్టాలపై అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు. పంట నష్టపోయిన రైతులతో పాటు కౌలు రైతులకు కూడా అర్హత మేరకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారు, నిరుపేద కుటుంబాలను గుర్తించి ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని బాధితులను ఆదుకునేందుకు కార్యాచరణ రూపొందించాలని శఆయన కోరారు.

జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి

జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 20 (సింగిడి) :
వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేయూత పథకం కింద ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పెన్షన్లను మంత్రి సీతక్క లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గత ప్రభుత్వ పదేళ్ళ పాలనలో నిజామాబాద్ జిల్లా ఆశించిన విధంగా అభివృద్ధి చెందలేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం గత మూడు సంవత్సరాల నుండి రోడ్ల నిర్మాణాలు తదితర వాటికి నిధులు కేటాయిస్తున్నామని, అయితే ఇంకనూ పెద్ద ఎత్తున అభివృద్ధి జరగాల్సి ఉందని తెలిపారు. పార్టీలకు అతీతంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో కలిగి త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అవుతామని, ఈ ప్రాంత పెండింగ్ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా నివేదిస్తా మని మంత్రి సీతక్క తెలిపారు. బీడీ కార్మికులకు సంబంధించి కూడా వారిని అన్ని విధాలుగా ఆదుకునేలా త్వరలోనే ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోనుందని వెల్లడించారు. మహిళలు సంఘాలలో సభ్యులుగా చేరి ప్రభుత్వ తోడ్పాటుతో ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అంటేనే అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోందని అన్నారు. గత పాలకులు అనాలోచిత విధానాలతో ఇబ్బడిముబ్బడిగా చేసిన అప్పులకు ప్రతీ నెల 6వేల కోట్ల రూపాయలను వడ్డీ రూపంలో రేవంత్ రెడ్డి సర్కార్ చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. నిజామాబాద్ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు కోసం కేంద్ర విమానయాన శాఖ మంత్రిని కలుస్తామని, డిచ్ పల్లిలో అన్ని వసతులతో కూడిన అతిథి గృహం నిర్మాణానికి, నిజామాబాద్ నగర మాస్టర్ ప్లాన్ అమలు కోసం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గానికి సంబంధించి 3150 మందికి నూతనంగా చేయూత పెన్షన్ లు జారీ కాగా, మంత్రి సీతక్క పలువురికి లాంచనంగా మంజూరీ పత్రాలను అందజేశారు. అంతకు ముందు ఆర్మూర్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన లు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, మున్సిపల్ చైర్ పర్సన్ లహరి, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో చేయూత పెన్షన్ల పంపిణీ

- లబ్ధిదారులకు పెన్షన్ మంజూరీ పత్రాలు అందజేసిన జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క
- బాల్కొండ నియోజకవర్గ మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.21.91 కోట్ల రుణాలు పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కలెక్టర్ ఇలా త్రిపాఠి
- స్వాగతం పలికిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఆర్మూర్, నవంబర్ 20 (సింగిడి) :
మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే లక్ష్యంతో మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ, వ్యాపార కార్యకలాపా లను నిర్వహించుకునేందుకు ప్రభుత్వం సహకరి స్తోందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలోని మణికంఠ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం చేయూత పెన్షన్ల పంపిణీ కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గ్రామీణా భివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, నిజామా బాద్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై కొత్తగా మంజూరైన చేయూత పెన్షన్ల లబ్ధిదారులకు పెన్షన్ మంజూరీ పత్రాలను శాసన మండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్డీఓ సాయన్నతో కలిసి అందజేశారు. అదేవిధంగా బాల్కొండ నియో జకవర్గంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.21.91 కోట్ల విలువైన రుణాలను చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వం లోని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంద న్నారు. రాష్ట్రంలో 4.63 లక్షల మందికి చేయూత పెన్షన్లు అందుతుండగా, వారిలో 3.50 లక్షల మంది మహిళలే ఉన్నారని తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, పాఠశాల విద్యార్థుల యూనిఫారాల కుట్టింపు వంటి బాధ్యత లను కూడా మహిళా సంఘాలకు అప్పగించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలు కమీషన్ రూపంలో రూ.167 కోట్ల ఆదాయం ఆర్జిం చాయని వివరించారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్ల నిర్వహణ లోనూ మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తు న్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, మహిళా సంఘాల ఆదాయ వనరులు పెంపొందేలా ఆర్టీసీ అద్దె బస్సులను సమకూర్చుతున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిట మంజూరు చేస్తూ, స్వయం సహాయక సంఘాల ద్వారా ఇంటి నిర్మాణానికి అవసరమైన పెట్టుబడి కోసం రుణాలు అందిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.76 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని, 300కు పైగా మహిళా సంఘ భవనాలను నిర్మించామని తెలిపారు. 60 సంవత్సరాలు దాటిన మహిళలకు కూడా ఆర్థిక చేయూత అందిస్తున్నామని, స్వయం సహాయక సంఘం నుంచి రుణం తీసుకున్న సభ్యురాలు దుర దృష్టవశాత్తు మరణిస్తే ఆమె తీసుకున్న రుణాన్ని మాఫీ చేయడంతో పాటు రూ.10 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నామని మంత్రి సీతక్క వివరించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తు లకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని, ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలను అమలు



చేస్తున్నామని తెలిపారు.తెలంగాణలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అమలులోకి తెచ్చిందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, ఇప్పటికే ప్రతి నియోజకవర్గానికి 5,500 ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. రైతులకు రూ.23 వేల కోట్ల మేర పంట రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.5 లక్షల ఆర్థిక భరోసా కల్పిస్తూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా పేదల సంక్షేమమే పరమావధిగా అన్ని ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రానున్న రెండేళ్లలో నిజామాబాద్ జిల్లాను విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తా మని తెలిపారు.

జిల్లాలో 20,555 మందికి కొత్తగా చేయూత పెన్షన్లు : కలెక్టర్ ఇలా త్రిపాఠి

జిల్లా వ్యాప్తంగా మొత్తం 20,555 మందికి కొత్తగా చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని కలెక్టర్ వెల్ల డించారు. చేయూత పెన్షన్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని, అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి తదుపరి విడతలో ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేస్తుందని, పెన్షన్ రాని వారు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. కొత్తగా చేయూత పెన్షన్లు మంజూరు కావడం ఎంతో సంతోషకరమన్నారు. గత కొంత కాలంగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం అర్హిక చేయూతను అందించడం అభినందనీయమన్నారు. బాల్కొండ నియోజకవర్గం పరిధిలో చేయూత పథకం కింద 3,092 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి సీతక్క లబ్ధిదారులకు పెన్షన్ మంజూరీ పత్రాలను అందజేశారు. కొత్తగా మంజూరైన పెన్షన్ మొత్తాలు ఈ నెల 26వ తేదీన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్స్ గుండెల్లో నేనున్నా.. పక్కా గెలుపు నాదే!

మెండెం కిరణ్ కుమార్
ఖమ్మం (సింగిడి):
ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి ఇప్పుడే రాజుకుంటోంది. ప్రచార బరిలో మెండెం కిరణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. తన బలమెంతో, తన వెనుక ఎంతమంది ఉన్నారో తెలు సుకోవాలంటే ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాలని సవాల్ విసిరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 90 శాతానికి పైగా ఓట్లు తన ఖాతాలోనే పడతాయని ధీమా వ్యక్తం చేస్తూ రాజకీయ ప్రత్యర్థు లకు బహిరంగ సంకేతాలిచ్చారు.40 వేల మంది వాలంటీర్లు.. 6 వేల మంది ఉద్యోగులు! ఇదీ తన వెనుక ఉన్న బలగమని కిరణ్ కుమార్ ప్రకటిం చడం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్యాలెట్ పేపర్‌పై తన పేరు కనిపిస్తే పట్టభద్రులు పక్కవారికి ఓటెయ్యాలంటే మనసు రాదని, వాళ్లు నన్ను అంతలా గుండెల్లో పెట్టుకున్నారని, కచ్చితంగా నాకే ఓటు వేస్తారని, 13 ఏళ్లుగా తాను చేసిన సేవకు పట్టభద్రులు తమ ఓటుతో గుర్తింపు ఇస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో హామీలు ఇచ్చేవారు చాలామంది ఉంటారని, కానీ నిరుద్యో గుల కోసం తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. లక్ష మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు సాధించిన తర్వాతే తన తుది శ్వాస విడుస్తానంటూ భావోద్వేగ ప్రకటన చేశారు.నేవే నా అస్త్రం.. పట్టభద్రులే నా





సైన్యం! తన రాజకీయ ప్రస్థానానికి కొత్త నినాదాన్ని వినిపించారు. తనను గుండెల్లో పెట్టుకున్న ఖమ్మం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి బలవంతం లేకుండా, స్వచ్ఛందంగా సభకు తరలి వచ్చిన పట్టభద్రులే తనపై ఉన్న అభిమానానికి నిద ర్శనమన్నారు.సభకు పోటెత్తిన జనసందోహం.. స్వల్ప తొక్కిసలాట! కిరణ్ కుమార్ సభకు పట్టభ ద్రులు భారీగా తరలిరావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. వచ్చిన జనసందోహానికి ప్రాంగణం సరిపోక స్వల్ప తొక్కిసలాట చోటుచేసు కుంది. సభకు వచ్చిన స్పందన రాజకీయంగా చర్చ నీయాంశంగా మారింది.కలుషిత రాజకీయాల్లో నికార్సయిన నాయకుడు కిరణ్! ప్రముఖ పొలిటికల్ స్ట్రాటజిస్ట్ ఎర్రబెల్లి రజనీకాంత్ మాట్లాడుతూ.. ప్రస్తుత పొల్యూటెడ్ పాలిటిక్స్‌లో మెండెం కిరణ్ కుమార్ వంటి నిబద్ధత కలిగిన నాయకులు అరుదని అన్నారు. కమిట్‌మెంట్, క్యాలిబర్ ఉన్న నాయకుడిగా కిరణ్ కుమార్‌ను అభివర్ణించారు. 13 ఏళ్లుగా ఆయన సాగిస్తున్న సేవా ప్రస్థానం ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని పేర్కొన్నారు.మొత్తంగా.. మాటల యుద్ధం మొదలైంది.. గెలుపుపై ధీమా తార స్థాయికి చేరింది! మెండెం కిరణ్ కుమార్ చేసిన సంచలన ప్రకటనలు, సభకు తరలివచ్చిన పట్టభ ద్రుల స్పందన ఖమ్మం గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల రాజకీయ వేడిని మరింత పెంచాయి. ఈ ఆత్మవిశ్వాసం ఓట్లుగా ఎంతవరకు మారుతుంద న్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.ఈ కార్యక్రమంలో చేకూరి చైతన్య, పత్తిపాటి లక్ష్మీకాంతమ్మ, వంశీ, ప్రవీణ్, శింభూ, నవీన్, బాలకోటి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగుమట్ల బాధితులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

అర్హుల విషయంలో నిబంధనలు విధించవద్దు..
ఈ నెల 29లోగా స్పష్టమైన ప్రకటన చేయాలి : జస్టిస్ చంద్రకుమార్
ఖమ్మం, నవంబర్ 20(సింగిడి):
వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితులందరికీ ఎలాంటి షరతులు లేకుండా అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు . శుక్రవారం ఆయన వెలుగుమట్లను సందర్శించి , కేతవరపు కృష్ణారావు అధ్యక్షతన కలెక్టర్ వైఖరిని నిరసిస్తూ నిర్వహించిన సభలో మాట్లాడారు . ప్రభుత్వం 729 మంది పేదల ఇళ్లను కూల్చివేసినట్లు ప్రకటించి , కేవలం 300 మందికే ఇళ్లు నిర్మిస్తామనడం సరికా దన్నారు . బీసీ , ఎస్సీ , ఎస్టీ జేఏసీల సుదీర్ఘ పోరాటం ఫలితంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మిగిలిన అర్హులకు కూడా వెలుగుమట్లలోనే ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు . ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ నెల 29లోగా స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు . భూదాన్ భూములు పేదలకే చెందాలని , అక్కడ ప్రభుత్వ కార్యాలయాలు లేదా ఇతర నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేశారు . బాధితుల గ్రామాల్లో చిన్నపాటి ఇళ్ల స్థలాలు ఉన్నాయనే కారణంతో వారిని అనర్హు లుగా ప్రకటించవద్దని కలెక్టర్‌ను కోరారు .



డిమాండ్లు నెరవేర్చకపోతే ఈ నెల 29న రాహుల్ ఇల్లు ముట్టడి కార్యక్రమాన్ని కొనసాగిస్తామని హెచ్చ రించారు . బీసీ , ఎస్సీ , ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పోడకంటి రాంబాబు మాట్లాడుతూ 15 ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లను కూల్చివేసి , ఇప్పుడు వారినే అనర్హులుగా ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు . బాధితులే నిజనిర్ధా రణ కమిటీగా ఏర్పడి గుర్తించిన అర్హులందరికీ ఎలాంటి షరతులు లేకుండా వెలుగుమట్లలోనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు . లేనిపక్షంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని మరో ఉద్యమం చేపడతామని ప్రముఖ న్యాయవాది వంజాకుల లక్ష్మీనారాయణ హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కో-కన్వీనర్ రాజేష్ , లక్షి , నవ్య , కృష్ణ , ఉదయ్ తదితరులు పాల్గొన్నారు .

మత్స్యకార కమిటీకి కొలిపాక అభినందనలు

- నూతన కార్యవర్గ సభ్యులకు ఘన సన్మానం
- మత్స్యకారుల సంక్షేమం, ఐక్యతకు కలిసికట్టుగా కృషి చేయాలి



పెద్దపల్లి, నవంబర్ 20 (సింగిడి):
కాల్వ శ్రీరాంపూర్ మండల మత్స్యకారుల ఐక్యత, అభ్యున్నతి, సంక్షేమమే లక్ష్యంగా నూతన మత్స్యకార సంఘం కార్యవర్గాన్ని నియమించారు. సంఘం అధ్యక్షుడిగా చెప్పాల సారయ్య, ఉపాధ్యక్షుడిగా చిలివేరి రమేష్, కోశాధికారిగా కొలిపాక అన్వేష్‌తో పాటు ఆరుగురు డైరెక్టర్లను కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు.ఈ నేపథ్యంలో నూతన కార్యవర్గ సభ్యులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నూతన కమిటీ సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.మత్స్యకారుల సమస్యల పరిష్కారం, సంఘం అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. మత్స్యకారులంతా ఐక్యంగా ఉంటూ సంఘాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకంపై అవగాహన

చుంచుపల్లి, నవంబర్ 20(సింగిడి):
ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవే శపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఆవశ్యకతను ప్రజలకు వివరించేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.చుంచుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు స్వర్ణ జేమ్స్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని రాంపురం, పెనగడప, అంబేద్కర్ నగర్, గౌతంపూర్, ధన్వాడ్, 3 ఇంక్లైన్, ప్రశాంతినగర్, పెనుబల్లి గ్రామపంచాయతీలలో పర్యటించి ప్రజలకు పథకం ఉద్దేశం, ప్రయోజనాలను వివరించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆ కుటుం బానికి ఆర్థికంగా అండగా నిలిచేలా ఈ పథకం ఉపయోగపడుతుందని నాయకులు తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, పథకానికి సంబంధించిన వివరాలను ప్రజలు తెలుసుకుని అవసరమైన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అచ్చా నాగరాజు, జె. రాజేష్, కీర్తి కుమార్, డానియల్, సర్పంచ్ అనిత, ఉపసర్పంచ్‌లు ప్రేమ్, గోరే బాబు, నాసిర్, మన్నే శ్రీను, కట్ట నరసింహారావు, అలాగే కొలిపాక సత్తి, అబ్బులు, రెడ్డి, కాంపల్లి శ్రీను, బుచ్చ, గాంధీ, కనకరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు సమష్టి కార్యాచరణ

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్
నాగర్ కర్నూల్ నవంబర్ 20 (సింగిడి):
బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, క్షేత్రస్థా యిలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. బాల్య వివాహ రహిత జిల్లాగా నాగర్ కర్నూల్‌ను తీర్చిది ద్దేందుకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఇందులో భాగంగా ఈ నెల 27న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు.
శుక్రవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బాల్య వివాహ రహిత భారత్ – 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్య క్రమం'లో భాగంగా జిల్లా స్థాయి సమన్వయ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువతకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల నివారణ ఒక్క శాఖ బాధ్యత మాత్రమే కాదని, అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక బాలికల సంరక్షణ సంఘాలను ఏర్పాటు చేయాలని డీపీఓ రాజేశ్వరిని ఆదేశించారు.
రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు శాఖల సమన్వ యంతో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వ హించాలని, వివిధ మతాల పెద్దలతోనూ చర్చించి బాల్య వివాహాల నిర్మూలనకు వారి సహకారం తీసు కోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలల హక్కులు, బాలికల విద్య ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్ర మాలు నిర్వహించాలని డీఈఓ రమేష్ కుమార్‌కు తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికా రులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తల్లిదండ్రులు, మహిళా సంఘాలకు అవగాహన కల్పించాలని, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్ అధి కారులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశిం



చారు. రెవెన్యూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ, దేవాదాయ శాఖల అధికారులు తమ పరిధిలో ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా నిర్వ హించాలన్నారు. బాలికలు చదువును మధ్యలో ఆపకుండా ప్రోత్సహించడం, బాల్య వివాహాలకు దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించడం ద్వారా ఈ సామాజిక సమస్యను అరికట్టవచ్చని పేర్కొన్నారు. 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్ర మాన్ని కేవలం అవగాహన కార్యక్రమాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో స్పష్టమైన ఫలితాలు సాధించేలా కార్యాచరణ అమలు చేయాలని అధికా రులకు సూచించారు. బాలికలకు సురక్షితమైన, విద్యావంతమైన భవిష్యత్తును అందించేందుకు ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి డీఆర్ఓ పాండు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ, డీఈఓ ఏ. రమేష్ కుమార్, డీపీఓ రాజేశ్వరి, జిల్లా బాలల సంరక్షణ చైర్మన్ లక్ష్మణరావు, జిల్లా యువజన, క్రీడల అధికారి సీతారాం నాయక్, కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్, కోనేరు ఎన్జీవో సంస్థ అధినేత సలీం, అధి కారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం

తెలంగాణ రక్షణ సేన నిరసన

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 20 (సింగిడి):
జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన నగర అధ్యక్షుడు కర్లపూడి రఫీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు షేక్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టులు సొంత ఇళ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఎలాంటి వివక్ష లేకుండా ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9వ తేదీలోగా స్థలాల కేటాయింపు ప్రక్రియ ప్రారంభించాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడం బాధాకరమ న్నారు. జర్నలిస్టుల మద్దతుతో రాజకీయంగా హీరోలుగా చలామణి అవుతున్న వారిని జీరోలుగా మార్చడం పెద్ద పనేమీ కాదని వ్యాఖ్యానించారు. జర్నలిస్టులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణ సేన అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి వనం నాగేంద్రకుమార్, బంజారా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ నాయక్, టీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ యాదవ్, బంజారా విభాగం జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి..
రూ. 5 లక్షల జీవిత బీమా ఆర్థిక భరోసా

• చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 20(సింగిడి): కుటుంబ జీవిత బీమా ప్రతి కుటుంబానికి ఆర్థిక పరమైన భరోసా అని చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం మాదిరెడ్డి పల్లిలో ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి అనుకోని కారణాలతో మరణించినప్పుడు, ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ 5 లక్షల జీవిత బీమా ప్రయోజనం కల్పించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని అన్నారు. కుటుంబాన్ని పోషించే 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల సభ్యుడిని బీమా పరిధిలోకి తీసుకురావడం శుభపరిణామమని ఆయన అన్నారు. ఈ పథకానికి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఆధారంగా వివరాలను సేకరించనున్నట్లు చెప్పారు. స్వర్గీయ మహిళా తొలిప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించడం విశేషమన్నారు. ప్రత్యేక శిబిరాల ద్వారా అర్హులైన కుటుంబాల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతోందని అన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కలుగుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. చేవెళ్ల నియోజకవర్గంలోని ప్రజలందరూ ఈ పథకానికి సంబంధించిన వివరాలను తెలుసుకొని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఎం పీ డి వో అనురాధ, సర్పంచ్ ఎర్రోళ్ల కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు రాంరెడ్డి, మల్ రెడ్డి, నాగిరెడ్డి, రంగారెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ గ్రూప్ III పరీక్షలకు ఉచిత ఫౌండేషన్ కోచింగ్



వికారాబాద్, నవంబర్ 20 (సింగిడి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని డైరెక్టర్, తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్, హైదరాబాద్ వారు టీజీపీఎస్సీ గ్రూప్ III పోటీ పరీక్షలకు ఉచిత ప్రాథమిక ఫౌండేషన్ కోచింగ్ అందించుటకు అర్హులైన మైనారిటీ అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ వికారాబాద్ జిల్లా ఇంచార్జీ అధికారి సుదీర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పార్శీలు మరియు బౌద్ధ మైనారిటీ వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. విద్యార్హత: అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. 17.11.2026: దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం. 26.11.2026 దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ. 27.11.2026: ఉచిత శిక్షణ తరగతుల ప్రారంభం. 100 మంది, శిక్షణలో ప్రవేశాలకు గరిష్ఠ పరిమితి. దరఖాస్తు నమోదు సమయంలో తీసుకురావలసిన పత్రాలు విద్యార్థులకు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు. ఒరిజినల్ ఆధార్ కార్డు (డిజిటల్ స్కానింగ్ కొరకు) ఒక పాస్పోర్ట్ సైజు ఫోటో, దరఖాస్తుల నమోదు మరియు శిక్షణ కేంద్రం తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్,ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రాంగణం, ఎం ఏ ఎం క్యాంపస్, ఇంటర్మీడియట్ బోర్డు వెనుక, శ్రీ బాలాజీ ఎనక్లేవ్, ఫోషామహల్,నాంపల్లి, హైదరాబాద్ – 500001. మరిన్ని వివరాలకు అన్ని పని దినాలలో ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు క్రింది నంబర్లను సంప్రదించవచ్చు. టెలిఫోన్: 040-23236112. మొబైల్ నెంబర్: 9059050062, ఈమెయిల్ ఐడి: directorsmccctelangana@gmail.com.

నాలుగు లైన్ల రహదారి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 20(సింగిడి): పరిగి ఎమ్మెల్యే కృషితో వేగంగా కొనసాగుతున్న అప్పా జంక్షన్ మన్నెగూడ ఎన్ హెచ్ 163 నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులను శుక్రవారం పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్) డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అప్పా జంక్షన్ మన్నేగూడ నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఈ రహదారిని వరల్డ్ క్లాస్ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే తెలిపారు.

మౌలిక వసతుల ఏర్పాటుతో మరింత అభివృద్ధికి తోడ్పాటు

జగద్గిరిగుట్ట డివిజన్ లో 4 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



కుత్బుల్లాపూర్, నవంబర్ 20 (సింగిడి): మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా శుక్రవారం 126 – జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా దేవమ్మ బస్తి, మైసమ్మ నగర్, వాంబే కాలనీ, భూదేవి హిల్స్, మద్దూర్ నగర్, సీసాల బస్తి, రింగ్ బస్తి, భగత్ సింగ్ మార్గ్ వంటి ప్రాంతాలలో పర్యటించిన ఎమ్మెల్యే సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక వసతుల అభివృద్ధితోనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడడంతో పాటు మన అభివృద్ధి సాధ్యమని తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్నీప్రాంతాలలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరచామని, రానున్న రోజుల్లో జగద్గిరిగుట్ట డివిజన్లోని ప్రతి కాలనీలో పూర్తిస్థాయి మౌలిక వసతులను అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, పార్టీ అధ్యక్షులు రుద్రా అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, ఆయా కాలనీల వాసులు బసవేశ్వర్, మహేందర్, బ్రహ్మానంద చారి, ముఖేష్, రవి సాగర్, విటల్, త్రివేణి, మల్లాచారి, సురేష్, రాము, ముంతాజ్ అలీ, పాషా బాయ్, రాములు, రషీద్, ఆజమ్, మహమూద్, హాజీ, చంద్రశేఖర్, రాజేష్, విగ్నేష్, గణేష్ గౌడ్, పాపులు గౌడ్, యాదగిరి, మల్లారెడ్డి, శోభ, మంజుల, సీనియర్ నాయకురాలు ఇందిరాగౌడ్, సీనియర్ నాయకులు మెట్ల శీను, శశిధర్, జై హింద్, సాజిత్, ముంతాజ్, నాగరాజు, కయ్యూం, ఎర్ర లక్ష్మయ్య, మహేందర్, మహమ్మద్, సన్నీ, కన్నప్ప, అయోధ్య, అంజయ్య, పరశురాం, శీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభలో భూతులు, తిట్లు తప్ప సిద్దిపేటకు ఒరిగింది ఏమి లేదు

మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ నూడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం



సిద్ధిపేట ప్రతినిధి, నవంబర్ 20(సింగిడి): సిద్ధిపేటలో నిర్వహించిన సభలో సీఎం బూతులు తిట్లు తప్ప సిద్ధిపేటకు ఒరిగింది ఏమీ లేదని సిద్ధిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేరుకు రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల సాయిరాం లు విమర్శించారు. శుక్రవారం సిద్ధిపేట ఎమ్మెల్యే క్యాపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సిద్ధిపేటలో జరిగిన సభ ప్రజల కోసం సంక్షేమ పథకం ప్రారంభించేలా లేదని కేవలం కేసీఆర్ కేటీఆర్ హరీష్ వాళ్ళను తిట్టే విధంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆందోళనలో కొంత పాడుతూ ఉద్యమకారులపై కన్ను ఎక్కువ పెట్టిన ఘనత నీదని మండిపడ్డారు తెలంగాణ గురించి మాట్లాడే అర్హత నీకు లేదని అన్నారు. సిఎం ప్రారంభించిన ఇందిరమ్మ భీమా పథకంతో ఇద్దరమ్మా ఆత్మక్షోభిస్తుందన్నారు. ప్రజల మనోభావాలు పెరిగే విధంగా సీఎం మాట్లాడారూ అని సీఎం సభలో తెలంగాణ ఉద్య మకారుడు శ్రీకాంత్ చారి తల్లి గురించి ప్రస్తావించాలన్నారు ఆ రోజు శ్రీకాంత్ చారి తల్లికి టిఆర్ఎస్ టికెట్ ఇస్తే అపోజిషన్ లో పిసిసి ప్రెసిడెంట్ గా ఉన్న ఉత్తంకుమార్ రెడ్డి నిలిపి ఎవరని ప్రశ్నించారు మీరు ఆ తెలంగాణ గురించి మాట్లాడిది అన్నారు. తెలంగాణ గురించి మాట్లాడే ముందు ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు దానికి కూతవీడు దూరంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఉందన్న విషయం మర్చిపోయారని ఎద్దేవా చేశారు. సిద్దిపేట మెడికల్ కాలేజ్ మదన్మోహన్ పేరు పెట్టడం స్వాగతించదగ్గ విషయమని ఈ విషయమై రెండు సంవత్సరాల క్రితమే మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తీర్మానం చేశారన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆయన సొంత డబ్బులతో సిద్దిపేటలో మదన్మోహన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కోల రమేష్ గౌడ్, యాదగిరి,శ్రీనివాస్ రెబల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు న్యాయం చేయండి

• అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయండి
• జిల్లా కలెక్టర్‌ను కోరిన డిసిసి అధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్



మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 20 (సింగిడి): జవహర్ నగర్ పరిధిలో ఎన్నో ఏళ్లుగా నివాస ఉంటున్న పేద కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయండి అని గ్రామకంఠం పరిధిలో నివసిస్తున్న అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయండి అని మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరిని కోరారు. జవహర్ నగర్ గ్రామకంఠం 330 ఎకరాల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఎన్నో ఏళ్లుగా జవహర్ నగర్ లో నివాసముంటున్న పేద ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ జవహర్ నగర్ గ్రామకంఠం పరిధిలోని 330 ఎకరాల్లో నివాసం ఉంటున్న వారికి గతంలో రెవెన్యూ శాఖ మంత్రి దేవేందర్ గౌడ్ హయాంలో జారీ చేసిన పట్టాలు గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అందించిన తెలంగాణ పట్టాలు డోర్ నెంబర్లు విద్యుత్ బిల్లుల వంటి ఆధారాలు ఉన్న కుటుంబాలన్నింటినీ అర్హులుగా పరిగణించి ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపజేయాలని కోరారు. గ్రామ కంఠం పరిధిలో నివసిస్తున్న ప్రజలకు ఇంటి నిర్మాణాల కోసం మున్సిపల్ అనుమతులు మంజూరు చేయాలని ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రజాసమస్యలు అభివృద్ధి పనులు ప్రజలు ఎదురవుతున్న ఇబ్బందులపై కలెక్టర్ తో చర్చించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిధిలోని కాంగ్రెస్ శ్రేణులు, జవహర్ నగర్ కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

టీవీఆర్ మోడల్ హైస్కూల్లో ఘనంగా చుక్కారామయ్య జన్మదిన వేడుకలు

• చుక్కారామయ్య విద్యారంగానికి చేసిన సేవలపై విద్యార్థులకు ప్రత్యేక పోటీ పరీక్షలు
• విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేసిన వంశీకృష్ణారెడ్డి



హైదరాబాద్, నవంబర్ 20(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పూర్వ సుభాష్ నగర్ డివిజన్ అపురూప కాలనీలోని టీవీఆర్ మోడల్ హైస్కూల్ లో ప్రముఖ విద్యావేత్త, విద్యారంగంలో విశేష సేవలందించిన డాక్టర్ చుక్కా రామయ్య 100వ జన్మదిన వేడుకలను టి వి ఆర్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులకు డాక్టర్ చుక్కా రామయ్య జీవిత చరిత్ర, విద్యారంగానికి ఆయన చేసిన సేవలు, సాధించిన విజయాలు, విద్యా ప్రస్థానంపై ప్రత్యేకంగా ప్రశ్నాపత్రం రూపొందించి (వ్యాసరచన) పరీక్ష నిర్వహించారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు డాక్టర్ చుక్కారామయ్య జీవిత విశేషాలను తెలియజేస్తూ, ఆయన ఆశయాలు, క్రమశిక్షణ, విద్య పట్ల అంకితభావం వంటి గొప్ప లక్షణాలను ఆదర్శంగా తీసుకోవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో టి. వంశీ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. పివిఆర్ విద్యాసంస్థల (పాఠశాల) చైర్మన్ టి. కోటిరెడ్డి, టి. అరుణ కుమారి తో కలిసి, డాక్టర్ చుక్కారామయ్య నివాసం సమీపంలో నిర్వహించిన శతజయంతి వేడుకల్లో పాల్గొని తమ గౌరవాభిమానాలను తెలియజేశారు. ఈ సందర్భంగా టీవీఆర్ విద్యాసంస్థలలో మ్యాథమెటిక్స్ ఐఐటీ సబ్జెక్టు లో ప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందజేశారు విద్యారంగానికి విశేష సేవలందించి, ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన డాక్టర్ చుక్కా రామయ్య శతజయంతిని నిర్వహించుకోవడం టీవీఆర్ మోడల్ హైస్కూల్ కుటుంబానికి ఎంతో గర్వకారణమని పాఠశాల యాజమాన్యం వివరించారు.

బీజేపీ ఎస్సీ మోర్చా కో-కన్వీనర్‌గా నియామకం



సికింద్రాబాద్, నవంబర్ 20 (సింగిడి): సికింద్రాబాద్ మహంకాళి జిల్లా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా కో-కన్వీనర్‌గా నియమితులైన గుండ్రపల్లి శ్రీనివాస్ రావు హర్షం వ్యక్తం చేశారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించడం గర్వకారణంగా భావిస్తున్నానని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్న బీజేపీ ఎస్సీ మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, భారత్ గౌడ్, మేకల సారంగపాణి, మహంకాళి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గడ్డం నవీన్, జిల్లా కార్యదర్శి అంబాల రాజన్న, జిల్లా కన్వీనర్ రమేష్‌లకు గుండ్రపల్లి శ్రీనివాస్ రావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

సాయినగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అర్హులైన నిరుపేదలకు కేటాయిస్తాం ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



సికింద్రాబాద్, నవంబర్ 20 (సింగిడి): సికింద్రాబాద్ లాలాపేటలోని సాయినగర్ ప్రాంతంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయిస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ తెలిపారు. శుక్రవారం మోండా మార్కెట్‌లోని తన నివాసంలో సాయినగర్ వాసులు పద్మారావు గౌడ్‌ను కలిసి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో జరుగుతున్న జాప్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. స్థానికులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో గతంలో రూ. 9 కోట్ల వ్యయంతో నాలుగు అంతస్తుల్లో 104 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించి అర్హులైన స్థానికులకు ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ యువ నాయకుడు రామేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై బిఆరెస్ పార్టీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా.?

• సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్



సిద్ధిపేట ప్రతినిధి నవంబర్ 20 (సింగిడి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట పర్యటనతో బిఆరెస్ నాయ కులకు వణుకు మొదలైంది అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ గారు అన్నారు. సిద్ధిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బిఆరెస్ పార్టీ నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు అని అన్నారు. బిఆరెస్ పార్టీ నాయకులకు నిజాయితీ ఉంటే సిద్ధిపేట ఎల్లమ్మ ఆలయంలో ప్రమాణం చేయాలి అని సవాల్ విసిరారు. ప్రజలను అబద్ధాలతో ఎన్నాళ్లు మభ్యపెడతారు అని ప్రశ్నించారు. 10 సంవత్సరాల పాలనలో జరిగిన అభివృద్ధిపై ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై బిఆరెస్ పార్టీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేటలో నిన్న జరిగిన సభలో వాస్తవాలు మాట్లాడితే బిఆరెస్ నాయకులకు మింగుడు పడటం లేదు అని అన్నారు. అబద్ధాలతో ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తున్న బిఆరెస్ నాయకుల ఆటలు ఇకపై సాగనివ్వము అని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సిద్ధిపేట శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తాం అని అన్నారు. 10 సంవత్స రాల పాలనలో జరిగిన అభివృద్ధిపై ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై బిఆరెస్ పార్టీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు గయాజుద్దీన్ అర్షద్ హుస్సేన్ విజయ డానియల్ నజ్జు ముద్దు తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాలకు భరోసా ఇందిరమ్మ భీమా

నూతనకల్,నవంబర్ 20 (సింగిడి): ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంతో ప్రతి నిరుపేద కుటుంబానికి భరోసా కల్పిస్తుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలో దిర్శనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమా నమోదు కార్యక్రమం నెల రోజులు పాటు కొనసాగుతుందన్నారు.రేషన్ కార్డు లేని కుటుంబాలు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.కార్డులో నమోదు యజమానికి భీమ వర్తిస్తుందన్నారు. 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్నవారు అర్హులని చెప్పారు.అనుకొని ప్రమాదం లేదా విపత్తు కారణంగా కుటుంబ పెద్ద లేదా కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మరణిస్తే,ఆ కుటుంబం



ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా వారం రోజుల్లోనే పరిహారం అందేలా రూపొందించారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పిఏస్సిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ లింగన్న,జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, మండల ప్రత్యేక అధికారి భారతి,తాసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత,వివిధ శాఖ అధికారులు, పంచాయతి కార్యదర్శి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సోహమ్ అగ్రో ఇండస్ట్రీస్‌తో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలి

- విర్లపాలెం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి: ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్

మిర్యాలగూడ, నవంబర్ 20(సింగిడి): పరిశ్రమల ఏర్పాటు వల్ల స్థానిక ప్రాంత అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం విర్లపాలెం గ్రామంలో ఏర్పాటు చేయనున్న సోహమ్ అగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు సంబంధించి నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశ్రమలో ఉద్యోగ నియామకాల సందర్భంగా విర్లపాలెం గ్రామంతో పాటు దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల నిరుద్యోగ యువతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కంపెనీ యాజమాన్యాన్ని కోరారు. యువత విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగాలు కల్పించడంతో పాటు అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. పరిశ్రమ



ఏర్పాటు కేవలం కంపెనీ అభివృద్ధికే పరిమితం కాకుండా స్థానిక ప్రజల జీవితాల్లోనూ మార్పు తీసుకురావాలని అన్నారు. విర్లపాలెం గ్రామంలో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కంపెనీ యాజమాన్యం సామాజిక బాధ్యతతో సహకరించాలని కోరారు. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు వెల్లడించే అభిప్రాయాలు, సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పర్యావరణ పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. పరిశ్రమ అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి, గ్రామాలకు అభివృద్ధి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భవనాల్లో అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి

నిబంధనలు పాటించని వారిపై చర్యలు

జిడబ్ల్యూఎంసి కమిషనర్ వెంకన్న



వరంగల్, నవంబర్ 20(సింగిడి): నగరంలోని పెద్దభవనాలు, వాణిజ్యసముదాయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థల్లో అగ్నిప్రమాదాల నివారణకు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా పటిష్టమైన అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు కల్పించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వెంకన్న సూచించారు. శుక్రవారం నగరంలోని హనుమకొండ లోని డీమార్ట్, వరంగల్‌లోని బిల్లా ఓపెన్ మైండ్ పాఠశాల, బాలసముద్రంలోని కళ్యాణి ఆసుపత్రి, నక్కలగుట్టలోని తదితర భవనాలను కమిషనర్ సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన అగ్నిమాపక భద్రతా పరికరాలు, అత్యవసర రక్షణ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా భవనాల్లో అగ్నిమాపక పరికరాల ఏర్పాటు, వాటి పనితీరు, అత్యవసర సమయాల్లో వినియోగించే విధానం, భద్రతా నిబంధనల అమలు తదితర అంశాలను సమీక్షించారు. అగ్నిమాపక భద్రతా అనుమతుల పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాల్లో నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు ఉన్నాయా లేదా అనే విషయాలను పరిశీలించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి భవన యజమాని బాధ్యతని కమిషనర్ స్పష్టం చేశారు. అగ్నిమాపక పరికరాలను కేవలం ఏర్పాటు చేయడమే కాకుండా, అవి నిరంతరం పనిచేసే స్థితిలో ఉండేలా పర్యవేక్షించాలని, అత్యవసర మార్గాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రజలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే వాణిజ్య సముదాయాల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాల అమలులో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. కమిషనర్ వెంట బల్దియా అగ్నిమాపక భద్రతా అధికారి రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

యువ రైతులకు ఆదర్శంగా నిలవాలి: రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



సూర్యాపేట ప్రతినిధి నవంబర్ 20(సింగిడి): వ్యవసాయ రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరాగాంధీ కృషిరత్న పురస్కారాన్ని సూర్యాపేట మండలం రాజు నాయక్ తండ గ్రామ సర్పంచ్ గిరిజన రైతు లోనావత్ శాంతాబాయి పాండు నాయక్ అనుకున్నారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్ లో ఉమ్మడి నల్లగొండ ఖమ్మం వరంగల్ శాసనమండలి అభ్యర్థి రాశిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సీనియర్ నాయకులు పోతు భాస్కర్ ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువ రైతులకు ఆమె ఆదర్శంగా నిలవాలని అన్నారు. ప్రజా ప్రతినిధిగా కొనసాగుతూ వ్యవసాయం చేయడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు గుగులోతు నాగు నాయక్, కౌన్సిలర్ భూక్య కౌసల్య, గ్రామపంచాయతీ కార్యదర్శి శిల్ప ఉప సర్పంచ్ నాగమణి ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమాకు శ్రీకారం.. తొలిరోజే 142 మందికి నమోదు

ఎంపీడీవో సుష్మ



కోదాడ, నవంబర్ 20 (సింగిడి): పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అనంతగిరి గ్రామపంచాయతీలో సర్పంచ్ నకిరేకంటి వీరభద్రమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్హులైన కుటుంబాల నుంచి బీమా దరఖాస్తుల నమోదు చేపట్టారు. తొలిరోజు 142 మందికి బీమా నమోదు ప్రక్రియ పూర్తయినట్లు ఎంపీడీవో సుష్మ తెలిపారు. 18 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు కలిగిన అర్హులైన కుటుంబ పెద్దలకు రూ. 5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని వివరించారు. కుటుంబ పెద్దకు ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముసుకు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, డేగ కొండయ్య, ముత్తినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా పెట్రోల్ బ్యాంకుల్లో మోసాలు

- క్యాష్ చేసుకుంటున్న నిర్వాహకులు
- నష్టపోతున్న వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు

హన్మకొండ, నవంబర్ 20 (సింగిడి): పెట్రోల్ బంకుల్లో నిరంతరాయంగా మోసాలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో చూసిన ఘటనలు వెలుగు చూసాయి. ఈ విషయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉంటేనే మోసాల బారినపడకుండా ఉండే అవకాశాలు ఉంటాయి. కానీ, ఇంధనం పోయించుకుంటున్న క్రమంలో ఏదో ఆలోచనలో ఉంటే మాత్రం మోసపోయే పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. మోసాలను గుర్తించేందుకు తెలుసుకోవాల్సిన జాగ్రత్తల్లో ఒకటి బంక్‌లో పెట్రోల్ కొట్టడం ప్రారంభించగానే 1,2,3 రీడింగ్ కనిపించకుండా నేరుగా 5,6,7,8 నంబర్లకు జంప్ అవుతుంటే, రావాల్సిన పెట్రోల్‌కన్నా తక్కువ రావడం జరిగింది. ఈ క్రమంలోనే వాహనదారులను మాటల్లో పెట్టి తక్కువ ఇంధనం నింపి, ఎక్కువ డబ్బులు వసూలు చేస్తుంటారు. రూ.100 పెట్రోల్ అడిగితే ఒక వేళ అంతకుముందు కొట్టిన రూ.50రీడింగ్ ఉంటే అదే రూ.50 ఇంధనాన్ని మాత్రమే పోస్తారు. ఇది షార్ట్ ఫ్యూయలింగ్ మోసంగా భావించవచ్చు. ఇక కార్ల విషయానికి వస్తే ఇంధనం నింపుకొనే వాహనదారులు కారు నుండి కాలు కింద పెట్టకుంటానే పెట్రోల్ పోయాలని ఆదేశించిస్తుంటారు. కానీ ఇదే సమయంలో అటెండెంట్లు రీడింగ్ మార్చకుండానే మాటల్లో పెట్టి పెట్రోల్ ను పోతుంటారు. కారులో ఎప్పుడూ పెట్రోల్ కొట్టించినా కారు దిగి మీటర్ ను గమనిస్తూ పెట్రోల్ పోయించుకోవాలి. పెట్రోల్ పోసే వ్యక్తి మిషన్‌ను తరచుగా నిలిపివేస్తుంటే మోసం చేస్తున్నట్టుగానే భావించాల్సి వస్తుంది. మిషన్ వేగంగా పనిచేస్తున్నా ఇంధనం తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. అనుమానం వస్తే పెట్రోల్‌ను

పరీక్షించాలని బంక్ యజమానులను డిమాండ్ చేయాల్సిన బాధ్యత వినియోగదారులపై ఉంది. ఒక వేళ వినియోగదారులు రూ100,200,500,1000 ఇలా రౌండ్ ఫిగర్ పెట్రోల్‌ను పోయించుకోవడంతో సులభంగా మోసం చేస్తారు. వీలైనంత వరకు రౌండ్‌ఫిగర్‌గా ఫ్యూయల్ కొట్టించుకోకూడదు. డిజిటల్ మీటర్లు ఉన్న పెట్రోల్ బంకుల్లో కొట్టించుకోవడం ఉత్తమం.మెషీన్, మీటర్ పూర్తిగా ఆగిన తర్వాతే ట్యాంక్ నుంచి నాజిల్‌ను బయటికి తీయాలని అటెండెంట్‌కు ముందుగానే చెప్పాలి. పెట్రోల్ కల్తీ అయినట్టు అనుమానం వస్తే వెంటనే లిట్మస్ పేపర్‌తో పరీక్షించాలి. వినియోగదారుల రక్షణ చట్టం 1986 ప్రకారం బంకు యాజమాన్యం లిట్మస్ పేపర్లను అందుబాటులో ఉంచాలి. లిట్మస్ పేపర్‌పై కొన్ని చుక్కల పెట్రోల్ పోస్తే అది పూర్తిగా ఆవిరైన తర్వాత ఎలాంటి మరకలూ కనిపించకపోతే అది స్వచ్ఛమైన పెట్రోల్‌గా, మరకలు ఉంటే అది కల్తీ పెట్రోల్‌గా నిర్ధారించుకోవాలనీ కొందరు పేర్కొంటున్నారు. పెట్రోల్ బంకుల్లో జరిగే మోసాలపై పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ లేదా సంబంధిత ఆయిల్ కంపెనీ వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు. బంకుల్లో ఉండే కంప్లయింట్ బుక్‌లోనూ ఫిర్యాదును రిజిస్టర్ చేయవచ్చు. ఆడిట్, తనిఖీల సమయంలో వాటిని సమీక్షిస్తుంటుంది.పెట్రోల్ బంకుల్లో జరిగే ప్రధాన మోసాలు వాటి నుండి తప్పించుకునే మార్గాలు క్రింద ఇవ్వబడ్డాయి:

మోసాలు..

మీటర్ మీద 'సున్నా' పడిందా లేదా అని చూసుకోవాలి. కొన్నిసార్లు జీరో చూపించకుండానే పాత రీడింగ్ నుంచి పెట్రోల్ పోయడం ప్రారంభిస్తారు. మధ్యలో ఆపి మళ్లీ పోయడం (జంప్ ట్రిక్/మిడ్ స్టాప్ స్కాం) రూ. 500 లేదా రూ. 1000 అని చెప్పినప్పుడు, మధ్యలో ఏదో ఒక అమౌంట్ దగ్గర ఉదాహరణకు రూ. 400 వద్ద ఆపి, మళ్లీ అక్కడి నుంచే రీసెట్ చేయకుండా కంటిన్యూ చేస్తారు.

చిప్ ట్యాంపరింగ్

మెషిన్ లోపల ప్రత్యేకమైన చిప్ లేదా సాఫ్ట్‌వేర్ అమర్చి, మీరు కొనే పెట్రోల్‌లో 3% నుండి 10% వరకు తక్కువ ఇంధనం వచ్చేలా మోసం చేస్తారు.రౌండ్ ఫిగర్ మోసాలలో రూ. 100, రూ. 200, రూ. 500 లాంటి అమౌంట్‌లకు ముందుగానే కోడింగ్ సెట్ చేసి ఉంటాయి. కాబట్టి రూ. 110, రూ. 210 లేదా రూ. 550 వంటి ఆడ్ నంబర్లలో పెట్రోల్ పోయించుకోవడం మంచిది. డెన్సిటీ మోసంలి పెట్రోల్ బంకుల్లో క్వాంటిటీ, ప్రైస్‌తో పాటు డెన్సిటీ స్క్రీన్ కూడా ఉంటుంది. పెట్రోల్ డెన్సిటీ 720 నుండి 775కేజీ/ఎం3 మధ్య, డీజిల్ డెన్సిటీ 820 నుండి 860 కేజీ/ఎం 3 మధ్య ఉండాలి. దీనిలో తేడాలు ఉంటే కల్తీ జరుగుతున్నట్లు అర్థం. లిడెన్సిటీ పరిశీలనలి పెట్రోల్ పోయించుకునే ముందు మెషిన్‌పై ఉండే డెన్సిటీ నంబర్‌ను ఒకసారి చెక్ చేయండి. రూ. 100, 500 వంటి రౌండ్ ఫిగర్ కాకుండా రూ. 105 లేదా రూ. 210 వంటి బేసి సంఖ్యల్లో పెట్రోల్ అడగండి. అదే విధంగా పెట్రోల్ పోసేటప్పుడు మీ కళ్లు పంపు మీటర్ వైపే ఉండాలి. అటెండెంట్ మాటల్లో పెట్టినా లేదా దృష్టి మళ్లించినా అప్రమత్తంగా ఉండాలి. పెట్రోల్ పోసిన తర్వాత తప్పకుండా బిల్లు తీసుకోవాలి. వాహన పనితీరు గమనించడం పెట్రోల్ కొట్టించిన తర్వాత మైలేజీ అకస్మాత్తుగా తగ్గిపోతే లేదా ఇంజన్ సౌండ్ తేడాగా వస్తే అధికారులకు ఫిర్యాదులు చేస్తే ఫలితం ఉండదు. అన్ని బంకులు అలా ఉండవు కాబట్టి మరో బ్యాంకును ఎంపిక చేసుకోవడమే మేలు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ సత్య శారద

వరంగల్, నవంబర్20 (సింగిడి): ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో ఘనంగా ప్రపంచ బాలల హక్కుల పరిరక్షణ దినం మరియు బాలల వారోత్సవాల ముగింపు వేడుకలు జరిగాయి. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారద పిలుపునిచ్చారు. ఐక్యరాజ్యసమితి చేసిన బాలల హక్కుల తీర్మానానికి గుర్తుగా ప్రపంచ బాలల దినోత్సవం ప్రతి ఏటా నవంబర్ 20 న నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజులపాటు నిర్వహించిన బాలల వారోత్సవాల ముగింపు వేడుకలు శుక్రవారం ఆటోనగర్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ శ్రీదేవిలి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారదలి మాట్లాడుతూ, పెద్దల మాదిరిగానే బాలలకు కూడా ప్రత్యేక హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కు, రక్షణ పొందే హక్కులు బాలలకు రాజ్యాంగం, చట్టాల ద్వారా కల్పించ బడ్డాయని, వాటిని పరిరక్షించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పిల్లలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, పౌష్టికాహారం, తగిన రక్షణ



కల్పించడంతో పాటు వారు ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో ఉన్న చట్టంతో విభేదించిన బాలలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, తెలిసీ తెలియని వయసులో చేసిన తప్పులను గుర్తించి, వాటిని సరిదిద్దుకొని మంచి మార్గంలో పయనించాలని సూచించారు. జీవితంప్రతి ఒక్కరికీ ఎన్నో అవకాశాలను కల్పిస్తుందని, గతంలో జరిగిన తప్పులే భవిష్యత్తును నిర్ణయించవని, కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. ఒకప్పుడు దొంగగా జీవించిన రత్నాకరుడు తన జీవితాన్ని మార్చుకొని మహర్షివాల్మీకి మారి రామాయణాన్ని రచించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన విషయాన్ని ఉదహరించారు. కోరికలను జయించి, చెడు ఆలోచనలకు దూరంగా ఉండి, మంచి లక్ష్యాలను ఏర్పరచుకున్నప్పుడే జీవితంలో నిజమైన విజేతలుగా నిలుస్తారని బుద్ధుని బోధనలను గుర్తుచేస్తూ బాలల్లో స్ఫూర్తి నింపారు. జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి రాజమణి మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి పౌరులని, బాలల భవిష్యత్తుతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని పేర్కొన్నారు. బాలల హక్కులు, సంక్షేమం, విద్య, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వారి సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత మరియు డా. ఆకులపల్లి మధు బాలలను ఉద్దేశించి మాట్లాడుతూ గతాన్ని మార్చే శక్తి ప్రపంచంలో ఎవరికీ లేదని కానీ భవిష్యత్తును తమకు అనుకూలంగా మలుచుకునే శక్తి బాలలకు ఉందని దానికి అనుకూలంగా తమ భవిష్యత్తును రూపుదిద్దుకోవాలని చెప్పారు. బాలల వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం మరియు వివిధ బాలల సంరక్షణ సంస్థల్లోని బాలలకు వ్యాసరచన, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, చెస్, క్యారమ్స్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన బాలలకు జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారద చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం నిర్వాహకురాలు, జిల్లా బాలల పరిరక్షణ అధికారిశ్రీమతి బత్తిని కళ్యాణి, బాలల సంక్షేమ సమితి సభ్యురాలు షాహిదా బేగం, డీసీపీయూ సిబ్బంది రాజుల సుమన్, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది సుష్మ, ఏహెచ్‌టీయూ పీసీ రామారావు, షేర్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది జన్ను ప్రభాకర్, ప్రశాంతి, కల్పన, పరిశీలన గృహం సిబ్బంది, బాలలు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన కేయూ వీసీ



హనుమకొండ, నవంబర్ 20 (సింగిడి): కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మాస్టర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఎంబీఏ) విభాగంలో రూ. 13 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, ఆధునిక విద్యావిధానంలో కంప్యూ టర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకొని భవిష్యత్తులో ఉన్నత అవకాశాలను అందిపుచ్చు కోవాలని ఆయన సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలను కల్పించడం ద్వారా వారి నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటు అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎన్. రెహమాన్, సహాయ రిజిస్ట్రార్ సునీల్ కుమార్, ఎంబీఏ విభాగ అధ్యాపకులు డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ సాయి చరణ్, డాక్టర్ మయూరి, డాక్టర్ సురేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- భక్తులకు ఇబ్బంది కలగనీయవద్దు
- 23 నుంచి 29 వరకు బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి, నవంబర్ 20 (సింగిడి): భూపాలపల్లి మండలం బొగులోని శ్రీ వెంకటేశ్వర స్వామి జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా చేపట్టాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. రేగొండ మండలంలోని ప్రసిద్ధ భుగులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న జాతర ఉత్సవాల ఏర్పాట్లను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు,పారిశుద్ధ్యం,విద్యుత్తు, రహదారులు, పోలీసుల భద్రత, వాహనాల పార్కింగ్ తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని,



ఆలయ కమిటీ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జాతరకు వచ్చే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేయాలని ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, బాధ్యతయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు,పోలీస్ అధికారులు నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప సన్నిధిలో కొనసాగుతున్న అన్నప్రసాద వితరణ



కోదాడ, నవంబర్ 21(సింగిడి): తెలంగాణ శబరిమలగా ప్రసిద్ధిగాంచిన అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో అన్నప్రసాద వితరణ 45వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా 310 మందికి పైగా అయ్యప్ప స్వాములు అన్నప్రసాదం స్వీకరించారు. ఖమ్మంకు చెందిన వనం వెంకట అప్పారావు--పద్మజ దంపతులు, వారి కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, సభ్యులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



చెన్ యుఫెకు షాకిచ్చిన రక్షిత శ్రీ

హాంకాంగ్ ఓపెన్‌లో భారత యువ సంచలనం

హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్--500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ రక్షిత శ్రీ సంచలనం సృష్టించింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంకర్, టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, ప్రస్తుత ఆసియా చాంపియన్ చెన్ యుఫెకు షాకిచ్చింది. ప్రపంచ 44వ ర్యాంకర్ అయిన రక్షిత 21--18, 24--22తో చైనా స్టార్‌పై అద్భుత విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది.

తన కెరీర్‌లో ఇదే అతిపెద్ద విజయమని 19 ఏళ్ల రక్షిత శ్రీ ఆనందం వ్యక్తం చేసింది. చెన్ యుఫె తనకు ఆరాధ్య క్రీడాకారిణి అని, అలాంటి స్టార్‌ను ఓడించానంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నానని పేర్కొంది. కోయంబత్తూరుకు చెందిన రక్షిత ప్రస్తుతం హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. తదుపరి క్వార్టర్ ఫైనల్లో థాయ్‌లాండ్ క్రీడాకారిణి చోచువోంగ్‌తో తలపడనుంది.

మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్లు లక్ష్య సేన్, కిడాంబి శ్రీకాంత్ కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. లక్ష్య సేన్ 21--11, 21--18తో డెన్మార్క్ ఆటగాడు రస్‌ముస్ గెమ్కేపై విజయం సాధించగా.. శ్రీకాంత్ 12--21, 21--18, 21--14తో దక్షిణ కొరియా షట్లర్ యూ టే బిన్‌ను ఓడించాడు.

పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్--చిరాగ్ శెట్టి కూడా క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో 21--19, 21--16తో మలేసియాకు చెందిన నూర్ మొహమ్మద్ అయూబ్--టాన్ వీ కియోంగ్ జోడీపై గెలిచింది. అయితే మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్--ట్రెసా జాలీ జోడీకి నిరాశ ఎదురైంది. అమెరికా జోడీ లారెన్ లామ్--అలీసన్ లీ చేతిలో 20--22, 13--21తో ఓడిపోయింది. మహిళల సింగిల్స్‌లో మరో భారత షట్లర్ అష్మిత చాలిహా కూడా 17--21, 12--21తో జపాన్ క్రీడాకారిణి హినా అకెచి చేతిలో పరాజయం పాలైంది.

'టైమ్ 100 నెక్ట్స్'లో వైభవ్ సూర్యవంశీ



ఢిల్లీ: భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరో అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచ ప్రఖ్యాత 'టైమ్' మ్యాగజైన్ రూపొందించిన 'టైమ్ 100 నెక్ట్స్ ఇండియా' జాబితాలో చోటు దక్కించుకున్నాడు. దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తూ వివిధ రంగాల్లో మార్పు తీసుకొస్తున్న 100 మంది అసాధారణ ప్రతిభావంతులు, ప్రభావవంతమైన నాయకులతో ఈ జాబితాను రూపొందించారు. భారత్‌లో ఈ తరహా ప్రత్యేక జాబితాను టైమ్ మ్యాగజైన్ విడుదల చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం.

ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో క్రీడారంగం నుంచి మొత్తం తొమ్మిది మందికి చోటు లభించింది. వైభవ్ సూర్యవంశీతో పాటు భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, ఒలింపిక్ పతక విజేతలు లవ్లీనా బోర్గోహెయిన్, మీరాబాయి చాను, ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేశ్, అథ్లెట్ విద్యా రామరాజ్, ఆర్చర్ కుమ్‌కుమ్ మొహోద్, హాకీ మాజీ గోలీకీపర్ సవిత పూనియా, మాజీ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఈ జాబితాలో స్థానం సంపాదించారు.

మరోవైపు వైభవ్ సాధించిన ఈ ఘనతపై బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా ప్రశంసలు కురిపించాడు. మారుతున్న నవ భారతానికి వైభవ్ ప్రతీక అని అభివర్ణించాడు. మైదానంలో బ్యాట్‌తో అద్భుతాలు చేస్తున్న వైభవ్.. విభిన్నంగా ఆలోచించే వారిదే భవిష్యత్తు అని నిరూపిస్తున్నాడని కొనియాడాడు. యువ ప్రతిభకు అంతర్జాతీయ గుర్తింపు లభించడం భారత క్రీడారంగానికి గర్వకారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎంట్రీకాల్.. ఎప్పటికీ మరిచిపోలేను - రోహిత్



భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తన టీమ్‌ఇండియా అరంగేట్రం రోజులను గుర్తు చేసుకున్నాడు. తాజాగా హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. కెరీర్‌లో తొలిసారి భారత జట్టుకు ఎంపికైన క్షణం ఎప్పటికీ మరిచిపోలేనని తెలిపాడు. అప్పుడు తాను బెంగళూరులో ఉన్నానని, జట్టు ఎంపిక కోసం ఆసక్తిగా ఎదురుచూశానని చెప్పాడు. సాయంత్రం ఐదు గంటల సమయంలో బీసీసీఐ నుంచి ఫోన్ రావడంతో టీమ్‌ఇండియాకు ఎంపికైనట్లు తెలిసిందన్నాడు. ఆ వార్త వినగానే ఆనందంతో బెడ్‌పై నుంచి ఎగిరి గంతేశానని, ఏం చేయాలో కూడా అర్థం కాలేదని తన అనుభవాన్ని పంచుకున్నాడు.

నా కల నిజమైంది ...

శార్వరీ వాఘ్

బాలీవుడ్ యంగ్ బ్యూటీ శార్వరీ వాఘ్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. ఒకే ఏడాదిలో మై వాపస్ ఆవుంగా, ఆల్ఫా వంటి చిత్రాలతో అలరించిన ఆమె, ఇప్పుడు 'యే ప్రేమ్ మోల్ లియా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆయుష్మాన్ ఖురానా సరసన శార్వరి హీరోయిన్‌గా కనిపించనుంది. ప్రముఖ దర్శకుడు సూరజ్ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రానికి హిమేష్ రేష్మియా సంగీతం అందించారు. పెళ్లి తర్వాత అమ్మాయి అత్తింటికి వెళ్లకుండా, ఆమె కుటుంబ బాధ్యతల కోసం అబ్బాయే అమ్మాయి ఇంటికి రావడం అనే కొత్త కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందింది. షూటింగ్ పూర్తి చేసుకుని నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శార్వరికి ఓ ఆసక్తికర ప్రశ్న ఎదురైంది.

ఈ ఏడాదిలో మూడు సినిమాలు రావడం, ఇండస్ట్రీ తనపై పెట్టుకున్న అంచనాల వల్ల ఒత్తిడిగా అనిపిస్తోందా? అని యాంకర్ అడిగిన ప్రశ్నకు.. ఆమె స్పందిస్తూ.. ప్రేక్షకులు తనను ఇంత బాగా ఆదరిస్తున్నందుకు ఎంతో కృతజ్ఞతగా ఉందని శార్వరీ తెలిపింది. వైవిధ్యమైన పాత్రలతో తనపై నమ్మకం ఉంచిన దర్శకులందరికీ థ్యాంక్స్ చెప్పింది. ముఖ్యంగా సూరజ్ బర్జాత్యా దర్శకత్వంలో పనిచేయడం తన జీవితంలో ఒక కల నిజమైన సందర్భమని ఆమె ఆనందం వ్యక్తం చేసింది. చిన్నప్పటి నుంచి రాజశ్రీ ప్రొడక్షన్స్ సినిమాలను చూస్తూ పెరిగానని, ఇంట్లో తన తల్లిదండ్రుల ముందు ఆ పాటలకు డ్యాన్స్ చేస్తూ, సీన్లను నటించి చూపించేదాన్నని గుర్తు చేసుకుంది. ఇప్పటికీ ఇంట్లో అలా చేస్తూనే ఉంటానని చెప్పింది. అందుకే తనకు ఎలాంటి ఒత్తిడి లేదని, రోజూ కష్టపడుతూ ఈ ప్రయాణాన్ని ఎంతో ఎంజాయ్ చేస్తున్నానని పేర్కొంది.

ఆ ఇద్దరు హీరోయిన్స్ ఫిక్స్..







టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ తెరకెక్కేందుకు సిద్ధమవుతోంది. యంగ్ హీరో రామ్ నితిన్, ప్రముఖ నిర్మాణ సంస్థ సోల్జర్స్ ఫ్యాక్టరీ ప్రొడక్షన్ నంబర్ 7లో హీరోగా పరిచయం అవుతున్నారు. కె. సినిష్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని సినిష్ శ్రీధరన్, షాని సియుసిఐసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రెడాక్టెడ్ స్టూడియోస్ ఈ ప్రాజెక్ట్‌కు సహకారం అందిస్తోంది. విభిన్నమైన కథలను ప్రోత్సహిస్తూ, కొత్త నటీనటులకు మంచి అవకాశాలు కల్పించడంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నిర్మాత సినిష్ మరోసారి తన అభిరుచికి తగిన కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఇక కార్తీక్ ప్రీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన లేటెస్ట్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఇందులో ఇద్దరు యంగ్ బ్యూటీస్.. ప్రార్థన నాథన్, తేజు అశ్విని హీరోయిన్లుగా నటిస్తున్నట్లు అఫీషియల్‌గా ప్రకటించారు. ఇక ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో ప్రకటించనున్నారు మేకర్స్.

ఆ సమయంలో నిద్రపట్టదు..



'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్: ఆఫ్టర్ డార్క్' సిరీస్‌తోనే తన సినీ ప్రయాణం మొదలైందని అంటున్నారు బాలీవుడ్ నాయిక శనయా కపూర్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ సిరీస్‌తో ప్రస్తుతం ఓటీటీలో సందడి చేస్తున్నారు. ఇందులో ద్విపాత్రాభినయంలో కనిపించి ప్రేక్షకుల్ని అలరించారీమె. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న శనయ.. తన సినీ ప్రయాణానికి నాంది పలికిన తొలి ప్రాజెక్టు గురించి ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు. సాధారణంగా సినిమాలు విడుదలయ్యే ముందు చాలా ఆందోళనగా ఉంటాను. ఆ సమయంలో నాకు అస్సలు నిద్ర పట్టదు. చాలా ఒత్తిడికి గురవుతాను. అలాగే ఈ సిరీస్ కోసం కూడా చాలా భయపడ్డాను. కానీ ఇలాంటి సస్పెన్స్ థ్రిల్లర్ సిరీస్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడం ఆనందంగా ఉంద"ని అన్నారు శనయ. ఆమె తదుపరి తేజ సజ్జా 'జాంబిరెడ్డి 2' చిత్రంలో కనిపించనున్నారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737